PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 182 | విజయవాడ, సోమవారం 3 ఫిబ్రవరి 2025 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 3 February 2025 | Rs

ప్రకాశం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- జిల్లా ఆవిర్భావ దినోత్సవంలో మంత్రి వీరాంజనేయ స్వామి

8

కాంగోలో భీకర యుద్ధం : 700 మంది మృతి

గోమా : కాంగో సైన్యం, రువాండా మద్దతున్న ఎం23 తీవ్రవాదుల మధ్య భీకర యుద్ధం సాగుతోందని ఐక్యరాజ్యసమితి తెలిపింది. ఈ పోరాటంలో కనీసం 700 మంది చనిపోగా మూడు వేల మంది వరకు గాయాలపాలయ్యారని పేర్కొంది. ఇప్పటికే గోమా నగరాన్ని, ఒక అంతర్జాతీయ విమానాశ్రయాన్ని స్వాధీనం చేసుకున్న తీవ్రవాదులు దక్షిణాన ఉన్న కివు ప్రావిన్స్‌లోకి శరవేగంగా చొచ్చుకు వస్తున్నారని వెల్లడించింది. ఈ క్రమంలో జరుగుతున్న పోరులో భారీగా ప్రాణనష్టం సంభవించిందని వివరించింది. తీవ్రవాదులు మరో విమానాశ్రయాన్ని కూడా స్వాధీనం చేసుకునే ప్రమాదముందని హెచ్చరించింది. దక్షిణ కివు ప్రావిన్స్‌లోని కొన్ని గ్రామాలను ఆర్మీ తిరిగి స్వాధీనం చేసుకున్నారని ఐరాస పేర్కొంది. గోమా తీవ్రవాదుల వశం కావడంతో విదేశీ సాయుధ మూకలు లొంగుబాట పట్టడం, పెద్ద సంఖ్యలో సైనికులు చనిపోవడంతో కాంగో ఆర్మీ బలహీనపడిందని వివరించింది. కాంగోలోని సాయుధ గ్రూపుల్లో ఎం23యే అతిపెద్దది.

సెకితో డిస్కంల ఒప్పందాలు వద్దు

- కేంద్రీకృత సోలార్ ప్లాంట్లతో నష్టాలు
- కేంద్ర ఆర్థికశాఖ మంత్రికి ఇఎఎస్ శర్మ లేఖ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకి)తో విద్యుత్ పంపిణీ సంస్థలు ఒప్పందాలు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఎఎస్ శర్మ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. ప్రైవేట్ కంపెనీలతో సోలార్ ఒప్పందాలు చేసుకోవడం వల్ల వినియోగదారులపై భారాలు పడుతున్నాయని తెలిపారు. కేంద్రీకృత సోలార్ ప్లాంట్లు సాంకేతికత లేకపోవడం వల్ల భారీ ప్రసార నష్టాలు సంభవిస్తున్నాయని అన్నారు. ఇందుకు ఉదాహరణ అమెరికాలోని మోజావే ఎడారిలో ప్రారంభించిన ప్లాంట్ అని లేఖలో వివరించారు. అమెరికాలో జరిగిన ఇలాంటి కుంభకోణం త్వరలో దేశంలో కూడా వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు. ఉపయోగంలో లేని సౌర ఉత్పత్తి సాంకేతికతల కోసం కార్పొరేట్ కంపెనీలతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పిపిఎ) చేసుకోవాలని డిస్కంలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒత్తిడి తెస్తున్నాయన్నారు. దీనివల్ల ప్లాంట్లు త్వరగా పాడవడంతో గ్రిడ్‌ను బ్యాలెన్స్ చేయడం కష్టమని పేర్కొన్నారు. అదే విధంగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యుత్ వినియోగదారులపై భారీగా భారం పడుతుందని తెలిపారు. మరోవైపు థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు అయ్యే భూమి కంటే రెండు రెట్లు ఎక్కువగా ఈ ప్లాంట్లు ఆక్రమిస్తాయని వివరించారు. గుజరాత్‌లోని ఖావ్డా ప్రాంతంలో అదానీ గ్రూప్ ప్లాంట్ 538 చదరపు కిలోమీటర్లలో విస్తరించిందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు ప్లాంట్లకు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. వీటికి ప్రభుత్వ ఖర్చుతో రాయితీ ధరలకు భూమి, నీరు ఇస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర, కేంద్ర పన్ను మినహాయింపులు, రాయితీలతోపాటు, ప్రత్యక్ష సబ్సిడీలు ఇస్తున్నాయని అన్నారు. అదాని గ్రూపుతోపాటు అజూర్ కంపెనీకి రాయితీలతోపాటు కేంద్ర ప్రభుత్వం రూ.1000 కోట్లకు పైగా ప్రత్యక్ష సబ్సిడీలు ఇచ్చిందని ఉదాహరించారు. ప్రైవేట్‌కు అప్పగించే కేంద్రీకృత ప్లాంట్ల కంటే వినియోగదారులే వారి ప్రాంతంలో సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినియోగదారులు తక్కువ ఖర్చుతో తమ సొంత ప్రాంతంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి, అదనంగా ఆదాయాన్ని సంపాదించే అవకాశం ఉందన్నారు. మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించొచ్చని తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగ్రాతులు

చిత్తూరులో ఘోర ప్రమాదం

- బాలుడు సహా నలుగురు మృతి

ప్రజాశక్తి- విజయపురం, నగరి:

చిత్తూరులో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. బాలుడు సహా నలుగురు మృతిచెందారు. 15 మంది గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు..తమిళనాడుకు చెందిన భారతి ట్రావెల్ బస్సు తిరువళ్లూరు నుంచి తిరుపతికి బయలుదేరింది. చిత్తూరు జిల్లా నగరి సాయిబాబా గుడి సమీపంలో హైవే నుంచి నగరి టౌన్‌లోకి వస్తుండగా లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో బస్సు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బాలుడు సహా నలుగురు మరణించారు. గాయపడిన 15 మందిని నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రయాణీకులందరూ తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని బాధితులు తెలిపారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు తక్షణ చర్యలు

- 6న హైకోర్టు జడ్జీల బృందం కర్నూలుకు రాక : మంత్రి ఫరూక్

8

విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి

సిపిఎం రాష్ట్ర మహాసభ డిమాండ్



ఎ.నాగరాజు



వై.నేతాజీ

ప్రజాశక్తి - కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ (నెల్లూరు)

తక్షణమే విద్యుత్ అదనపు సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర మహాసభ డిమాండ్ చేసింది. స్మార్ట్ మీటర్లు బిగించడం ఆపాలని, అదానీ ఒప్పందాన్ని రద్దు చేయాలనే తీర్మానాన్ని ఎ.నాగరాజు (నంద్యాల) ప్రవేశపెట్టగా, వై.నేతాజీ (గుంటూరు) బలపరిచారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి భిన్నంగా ఏడు నెలల కాలంలోనే టిడిపి కూటమి ప్రభుత్వం రూ.15,485 కోట్ల సర్దుబాటు ఛార్జీల భారాన్ని మోపిందని మహాసభ విమర్శించింది. 30 నెలల నుండి వసూలు చేస్తున్న ట్రూఅప్ ఛార్జీలకు తోడు మరో మూడు రకాల సర్దుబాటు ఛార్జీలను ఈ సర్కార్ అదనంగా మోపిందని తెలిపింది. విద్యుత్ సుంకం పేరుతో వ్యాపార సంస్థలు, పరిశ్రమల నుండి యూనిట్‌కు ఆరు పైసల నుండి 100 పైసలకు పెంచడానికి చట్ట సవరణ చేసిందని విమర్శించింది. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రమాదకరమైన విద్యుత్ సంస్కరణలను దూకుడుగా అమలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. గత వైసిపి ప్రభుత్వం కేంద్రం ఆదేశాలకు తలొగ్గి సెకి ద్వారా అదానీ సంస్థల నుండి కొనుగోలు చేయడానికి ఒప్పందం చేసుకుందని విమర్శించింది. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు రూ.1,750 కోట్ల ముడుపులు ఇచ్చి అదానీ సంస్థ ఈ అక్రమ ఒప్పందాలను కుదుర్చుకున్నదనే ఆరోపణలపై అమెరికా కోర్టులో సాక్ష్యాధారాలతో విచారణ జరుగుతోందని తెలిపింది. తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని రద్దు చేయకపోగా కుంటి సాకులతో కొనసాగించడం సిగ్గుచేటని పేర్కొంది.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ మిగతా 9లో

పోలవరం పూర్తి బాధ్యత కేంద్రానిదే



పులి సంతోష్



వి.కృష్ణయ్య

పోలవరం పూర్తి బాధ్యత కేంద్రానిదేనని, నిధులన్నీ కేంద్రమే కేటాయించాలనీ, నిర్వాసితులకు సమగ్ర పునరావాసం, పూర్తిస్థాయి పరిహారం అందించాలని సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. నెల్లూరులో మాగుంట లే అవుట్స్‌లో సీతారాం ఏచూరి నగర్(అనిల్ గార్డెన్స్)లో జరుగుతున్న మహాసభలో పోలవరంపై తీర్మానాన్ని పులి సంతోష్ మిగతా 9లో

బడ్జెట్ ప్రతులు దహనం

- మధ్య తరగతి బడ్జెట్ కాదు..కార్పొరేట్ బడ్జెట్
- రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు



నెల్లూరులో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన కేటాయింపులు చేయకపోవడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసనలు చేపట్టారు. బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందని, సామాన్యులకు ఏటువంటి ప్రయోజనం చేకూర్చేలా లేదని పలువురు నాయకులు విమర్శించారు. ఈ బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రను ఆదుకునేందుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. రాజధాని అమరావతి, కడప ఉక్కు, విశాఖస్టీల్‌కు నిధుల ఊసేలేదని విమర్శించారు.

నెల్లూరులో మినీ బైపాస్‌రోడ్డు వివేకానంద పార్కు వద్ద ధర్నా నిర్వహించారు. సిపిఎం మహాసభలు జరుగుతోన్న అనిల్ గార్డెన్ నుంచి వివేకానంద పార్కు వరకు ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బడ్జెట్‌కు వ్యతిరేకంగా నినదించారు. కేంద్ర బడ్జెట్ రైతు వ్యతిరేకమైనదని, ఇది కార్పొరేట్ శక్తుల అనుకూల బడ్జెట్ అని, సంపన్నులకు ఊడిగం చేసే బడ్జెట్ అని నాయకులు విమర్శించారు. సాధారణ ప్రజలందరూ ఈ బడ్జెట్‌ను వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు ఆల్ ఇండియా అధ్యక్షులు హేమలత, అల్ ఇండియా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్, సిఐటియు ఆల్ ఇండియా కోశాధికారి సాయిబాబు, సిఐటియు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి కృష్ణయ్య, కె.ప్రభాకర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆల్ ఇండియా నాయకులు ఆర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం టవర్‌క్లాక్ వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేసి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు ఈ బడ్జెట్‌లో ఎటువంటి నిధులూ కేటాయించలేదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ముత్తుజ విమర్శించారు. కార్పొరేట్‌కు అనుకూలమైన ఈ బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. కర్నూలు, నంద్యాల, కోవెలకుంట్ల, ఆత్మకూరు, నందికొట్కూరులో ఆందోళనలు చేపట్టారు. కడపలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ నేతృత్వంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో విభజన హామీలు, కడప ఉక్కు ఊసే లేదని విమర్శించారు. బద్వేల్‌లో అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలియజేశారు. వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ప్రకాశం జిల్లా అద్దంకి బస్టాండ్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ.. బడ్జెట్‌లో ప్రకాశం జిల్లాకు ఎటువంటి ప్రాధాన్యత మిగతా 9లో

చైనా, కెనడా, మెక్సికోలపై వాణిజ్య యుద్ధం

ఉత్తర్వులపై ట్రంప్ సంతకాలు



వాషింగ్టన్ : అమెరికాకే తమ ప్రాధాన్యత, అమెరికన్ల ప్రయోజనాలే ముఖ్యమంటూ ఎన్నికల ప్రచార సమయం నుండి చెప్పుకుంటూ వచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధికారంలోకి వచ్చిన రోజుల వ్యవధిలోనే వరుసగా తాననుకున్న చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగానే మెక్సికో, కెనడా, చైనాల నుండి వచ్చే దిగుమతులపై అదనపు టారిఫ్‌లు విధించారు. ఈ మేరకు శనివారం ఆయన ఉత్తర్వులపై సంతకాలు చేశారు. ఈ టారిఫ్‌లు మంగళవారం నుండి అమల్లోకి రానున్నాయి. అమెరికన్లను రక్షించేందుకు ఈ టారిఫ్‌లు తప్పవని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఫెంటనిల్ అక్రమ తయారీ, ఎగుమతులపై మరిన్ని చర్యలు తీసుకోవాలని చైనాను కోరారు. అలాగే అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించే వారి సంఖ్యను కెనడా, మెక్సికోలు తగ్గించాలని ట్రంప్ పేర్కొన్నారు.

చైనా నుండి వచ్చే దిగుమతులన్నింటిపై 10శాతం, అలాగే చైనా మెక్సికో, కెనడాల నుండి వచ్చే దిగుమతులపై 25శాతం సుంకాలు విధించడానికి గానూ ఆర్థిక అత్యవసర పరిస్థితిని ట్రంప్ ప్రకటించారు. కెనడా నుండి చమురు, ఖనిజ వాయువు, విద్యుత్‌లను దిగుమతి చేసుకుంటారు. వాటిపై పది శాతం చొప్పున పన్ను విధించనున్నారు. ఇతర దేశాలు తీసుకునే ప్రతీకార చర్యలకు వ్యతిరేకంగా అమెరికా వసూలు చేసే రేట్లను పెంచే యంత్రాంగం కూడా ట్రంప్ ఉత్వర్వుల్లో వుంది. దీంతో మరింత తీవ్రమైన ఆర్థిక అంతరాయం తలెత్తే పరిస్థితులపై ఆందోళనలు వ్యక్తమవుతున్నారు.

ఈ చర్యలతో సుదీర్ఘంగా మిత్రపక్షాలుగా వున్న దేశాలతో వాణిజ్య యుద్ధానికి పురి గొల్పినట్లైంది. అలాగే ఎన్నికల సమయంలో ట్రంప్ హామీ ఇచ్చిన మేరకు నిత్యావసరాల ధరలు, గ్యాసోలిన్, ఇళ్ల నిర్మాణం, ఆటోలు, ఇతర వస్తువుల మిగతా 7లో

డేటా సురక్షితమేనా?

వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో ఆందోళన



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన వాట్సాప్ గవర్నెన్స్‌పై రాష్ట్ర ప్రజల్లో ఆందోళన నెలకొంది. డేటా రక్షణ చట్టం లేకుండా అమలు చేయడం ప్రాథమిక హక్కులకు భంగమనే వాదన నెలకొంది. స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్‌లలో ఉన్న సమస్త సమాచారాన్ని సేకరించి బ్యాంకు ఖాతాలు, ఇతర పేర్లతో జరిపే సైబర్ క్రైమ్స్ విపరీతంగా పెరిగాయని డిజిపి గురువారం వెల్లడించిన విషయం తెలిసిందే. దీంతో సమాచార పరిరక్షణ ఇప్పుడొక సవాలుగా మారింది. ఈ సమయంలోనే రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించింది. పౌర సేవలను వేగంగా అందిస్తామనే పేరుతో 'మన మిత్ర' ద్వారా మొత్తం 520 రకాల సేవలను వాట్సాప్ ద్వారా అందించేలా వాట్సాప్, మెటా కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. కార్పొరేట్ కంపెనీలైన వాట్సాప్, మెటాల దగ్గర ప్రజల సమాచారం భద్రంగా ఉంటుందా? అనే అనుమానాలు నెలకొన్నాయి. ఈ వాట్సాప్ సేవల్లో ప్రజలు తమ ఆధార్ వివరాలను తప్పనిసరిగా అందించాల్సి ఉంది. గతంలో ఆధార్ సహా అనేక రకాల డాక్యుమెంట్లు దుర్వినియోగం సంఘటనలు చాలా ఉన్నాయి. ఇలాంటివి ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయి. 2019 ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు సంబంధించిన సమాచారం హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో లభ్యమవ్వడంతో అప్పట్లో ఈ అంశంపై రాజకీయంగా పెద్ద దూమారం రేగింది. ప్రజల ఆధార్‌ను ఉపయోగించి ఫారం-7 ద్వారా ఓట్లు తొలగిస్తున్నారని టిడిపి, వైసిపి పరస్పరం విమర్శలూ చేసుకున్నాయి. ప్రజల్లో కూడా తమ ఓట్లు తొలగిస్తున్నారనే ఆందోళన గతంలో నెలకొంది. ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం కేసులు కూడా నమోదు చేసింది. ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేసుకునేందుకు గత వైసిపి ప్రభుత్వం వాట్సాప్‌లో చాట్‌బండ్‌ను తీసుకొచ్చింది. దీనిని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి విమర్శించిన సందర్భాలు ఉన్నాయి. ప్రభుత్వం వద్ద ఉండాల్సిన ప్రజల సమాచారం ప్రైవేట్ కంపెనీలకు చేరాయి. డేటా ప్రైవసీ చట్టం-2018 ఇప్పటికీ పెండింగ్‌లో ఉంది. ఇది చట్టం కాకుండా ఇలాంటి సేవలు తీసుకురావడం పౌరుల వ్యక్తిగత భద్రతకు ముప్పు అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇప్పటికీ పలు కార్పొరేట్ కంపెనీలు, ప్రైవేట్ బ్యాంకులు రుణాలు అందిస్తామనే పేరుతో ఆధార్‌కు అనుసంధానమైన ప్రజల ఫోన్ నెంబర్లను తీసుకొని వేధింపులకు గురిచేస్తున్నాయి. ఫేస్‌బుక్‌ను మెటానే నిర్వహిస్తోంది. ఈ యాప్‌లో అనేక మంది యూజర్ల అకౌంట్లు హ్యాకింగ్‌కు గురయ్యాయి. ఒక వ్యక్తి పేరుతో నకిలీ ఖాతాను తెరిచి సైబర్ నేరగాళ్లు డబ్బులు అడుగుతున్న సంఘటనలు చాలానే ఉన్నాయి. ఇందులో అనేక మంది డబ్బులు చెల్లించి మోసపోయారు. ఇలాంటి సైబర్ నేరాలపై ఫేస్‌బుక్‌ను ప్రభుత్వాలు ఎప్పుడూ హెచ్చరించలేదు. ఫేస్‌బుక్ కూడా ఈ కేసులను నియంత్రించలేకపోయింది. ఇప్పుడు అదే కంపెనీతో వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. మీ సేవ, సచివాలయ వ్యవస్థలను వినియోగించకుండా, సచివాలయ సిబ్బందిని కుదించేందుకు ఈ తరహా నిర్ణయాలు తీసుకుంటున్నారనే విమర్శలున్నాయి.



ఐసిసి అండర్-19 మహిళల క్రికెట్

విశ్వ విజేత భారత్

- ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 9వికెట్ల తేడాతో గెలుపు
- తెలుగమ్మాయి త్రిషకు ప్లేయర్ ఆఫ్ ది సిరిస్ అవార్డు

6

కౌలాలంపూర్ వేదికగా జరిగిన ఐసిసి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ విశ్వ విజేతగా భారత్ నిలిచింది. దక్షిణాఫ్రికాతో ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 9వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత దక్షిణాఫ్రికా 20ఓవర్లలో 82 పరుగులకే ఆలౌట్ కాగా.. ఆ లక్ష్యాన్ని భారత్ 11.2ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన తెలుగమ్మాయి గొంగడి త్రిష ఫైనల్లోనూ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చింది. మూడు వికెట్లు, 44 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ నిలవడంతోపాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను సొంతం చేసుకుంది. భారతజట్టు వరుసగా రెండోసారి ఈ టైటిల్‌ను చేజిక్కించుకుంది.

రాష్ట్రపతిపై వ్యాఖ్యలు.. సోనియాగాంధీపై ఫిర్యాదు

ముజఫర్‌పూర్ : రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై చేసిన వ్యాఖ్యలకు గానూ కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీపై బీహార్‌లోని కోర్టులో ఫిర్యాదు దాఖలయింది. దేశ అత్యున్నత రాజ్యాంగ అధినేతను అగౌరవపరిచేలా వ్యాఖ్యలు చేసినందుకు ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ముజఫర్‌పూర్ జిల్లా కోర్టులో సుధీర్ ఓజా అనే న్యాయవాది ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీని సహా నిందితులుగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓజా విలేకరులుతో మాట్లాడుతూ 'బడ్జెట్ సమావేశాల సందర్భంగా పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తూ చివరికొచ్చేసరికే రాష్ట్రపతి అలసిపోయారు. ఆమె చాలా కష్టపడి మాట్లాడారు. పూర్ థింగ్' అని సోనియాగాంధీ వ్యాఖ్యానించినట్లు పేర్కొన్నారు. అలాగే రాష్ట్రపతి ప్రసంగాన్ని 'బోరింగ్' అని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించినట్లు ఓజా తెలిపారు. ప్రియాంక గాంధీ కూడా ఆ సమయంలో పక్కనే ఉన్నారన్నారు. కాగా, ఈ వ్యాఖ్యలపై రాష్ట్రపతిభవన్ కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. సోనియాగాంధీ పేరు ప్రస్తావించకుండా ఈ వ్యాఖ్యలు 'అమోదయోగ్యం కాదు' అని పేర్కొంది. ముర్ము అలసిపోలేదని తెలిపింది.



పోరాటాలతో సమస్యల పరిష్కారం

- సిపిఎం రాష్ట్ర మహాసభలో వివిధ జిల్లాల అనుభవాలు
- చర్చల్లో ఉత్సాహంగా పాల్గొన్న ప్రతినిధులు

ప్రజాశక్తి- కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ (నెల్లూరు)

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సిపిఎం రాష్ట్ర మహాసభకు హాజరైన ప్రతినిధులు చెప్పారు. సీతారాం ఏచూరి నగర్‌లో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర మహాసభలో రెండో రోజు ఆదివారం ప్రతినిధులు ఉత్సాహపూరితంగా చర్చల్లో పాల్గొన్నారు. కార్యదర్శి ప్రవేశపెట్టిన రాజకీయ నిర్మాణ నివేదికపై జిల్లాల వారీగా చర్చించారు. ఈ మూడేళ్ల కాలంలో తమతమ జిల్లాల్లో నిర్వహించిన పోరాటాల అనుభవాలను, మహాసభ ముందుంచారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగానూ, స్థానిక సమస్యపైనా ఆయా జిల్లాల్లో నిర్వహించిన పోరాటాలను వివరించారు. తొలుత బాపట్ల జిల్లా ప్రతినిధి గంగయ్య మాట్లాడుతూ.. బాపట్ల జిల్లా కొత్తగా ఏర్పడినా ఉద్యమ సంప్రదాయం ఉందని, ఇంటింటికీ సిపిఎం కార్యక్రమంలో భాగంగా పది వేల మందిని కలిశామని తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధికి గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ నెల రోజుల పాటు పోరాటం నిర్వహించామని, పాలకుల విధానాలకు నిరసనగా ఆదోని నుంచి కర్నూలు వరకూ వారం రోజుల పాటు మహా పాదయాత్ర నిర్వహించామని కర్నూలు ప్రతినిధులు అంజిబాబు, ఆనంద్‌బాబు వివరించారు. వెనుకబడిన ప్రాంతమైన ఆదోనిలో ప్రత్యేకంగా జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సమీక్షా సమావేశం నిర్వహించే విధంగా పాదయాత్ర ఉపయోగపడిందని తెలిపారు. జిల్లాలో సామాజిక, వర్గ ఉద్యమాల వల్ల కొన్ని కొత్త ప్రాంతాలకు ఉద్యమం విస్తరించిందని వివరించారు. జిల్లాలో అంటరానితనం బలంగా ఉందని తెలిపారు. అనుగొండ, సందెకుడ్లూరు, నందికొట్కూరు, గురజాల తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న కులవివక్ష, అంటరానితనంపై పోరాటాలు నిర్వహించామని, ఈ పోరాటాల్లో రాష్ట్ర కార్యదర్శి కూడా పాల్గొన్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించడంతో వాటిని తొలగించినట్లు చెప్పారు.

ప్రజారక్షణ భేరి క్యాంపెయిన్‌లో యువతను భాగస్వామ్యం చేశామని, జనం కోసం సిపిఎం కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లగలిగామని, ఇది విజయవాడ నగర ఉద్యమానికి బాగా ఉపయోగపడిందని ఎన్‌టిఆర్ జిల్లా ప్రతినిధులు ఎన్‌జిహెచ్ శ్రీనివాస్, కృష్ణ తెలిపారు. కృష్ణా కరకట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సుదీర్ఘ పోరాటం ఫలితంగానే రిటైనింగ్ వాల్ నిర్మాణం జరిగిందన్నారు. అయితే, మేమంటే మేమని అధికార, ప్రతిపక్ష పార్టీలు చెప్పుకుంటున్నాయని తెలిపారు. విజయవాడ నగరాన్ని వరద ముంచెత్తిన సమయంలో పార్టీ కార్యకర్తలు అనేకమంది ప్రజలకు సహాయ సహకారాలు అందించడానికి ముందుకొచ్చారని, దాదాపు 15 రోజుల పాటు 15 సెంటర్లలో సేవా కార్యక్రమాలు నిర్వహించామని వివరించారు. కిడ్నీ వ్యాధితో ఎ.కొండూరు తండాలోని ప్రజలు చనిపోతుంటే... ఇక్కడ ఐదు డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు, వాటర్ ట్యాంక్‌ల ద్వారా మంచినీరు సరఫరా సిపిఎం పోరాట ఫలితమేనని తెలిపారు.

టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రాజధాని ప్రాంతంలో లేరన్న నెపంతో మున్సిపల్ కార్మికులను పనులకు రాకుండా అడ్డుకున్నారని, దీనిపై 72 రోజుల పాటు పారిశుధ్య కార్మికులు పోరాడిన ఫలితంగా వారందరినీ విధుల్లోకి తీసుకున్నారని గుంటూరు జిల్లా ప్రతినిధులు అప్పారావు, భావన్నారాయణ, నాయక్ తెలిపారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించినట్లు చెప్పారు.

పల్నాడు జిల్లా ప్రతినిధి గోపాల్‌రావు మాట్లాడుతూ చెత్త పన్నుకు వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం నిర్వహించామని తెలిపారు. దళిత ప్రజాప్రతినిధులకు అండగా నిలచామని, జిల్లాలో ప్రాంతాల వారీగా ఉద్యమాల ద్వారా ఫలితాలు సాధించామని తెలిపారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించామని విశాఖ ప్రతినిధులు కుమార్, పద్మ తెలిపారు. 1450 రోజులుగా ఉక్కు రక్షణ దీక్షలు సాగుతున్నాయని, దీంతో ప్రైవేటీకరణపై కేంద్రం ఒక అడుగు కూడా ముందుకు వేయలేకపోయిందని వివరించారు. విశాఖ డెయిరీ ఉద్యోగులు, గంగవరం పోర్టు కార్మికులు, నిర్వాసితుల సమస్యలపై ఆందోళనలు చేపట్టామని, విజయాలు సాధించామని తెలిపారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 125 రోజులుగా ఉద్యమిస్తున్నామని చెప్పారు.

గత మూడేళ్లలో కార్మిక, గిరిజన, వ్యవసాయ కార్మిక, రైతు రంగంలో గుర్తించదగిన కృషి చేశామని ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధులు ఆర్.లింగరాజు, పి.రామకృష్ణ, బి.వాసుదేవరావు, కె.నాగేశ్వరరావు తెలిపారు. ప్రధానంగా ఫ్యాక్టరీల్లో ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులకు అండగా నిలిచి కార్మికులకు, వారి కుటుంబాలకు నష్టపరిహారాలు ఇప్పించామని చెప్పారు. ఇటీవల పెచ్చుమీరుతున్న మతోన్మాద చర్యలను అడ్డుకునే ప్రయత్నం జరిగిందన్నారు. విశాల వేదికల ద్వారా అన్ని రంగాల ప్రజలను మమేకం చేసే ప్రయత్నం చేశామని వివరించారు. పాణ్యం మండలం పిన్నాపురం గ్రామంలో గ్రీన్‌కో ప్రాజెక్ట్ వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు 'చలో పిన్నాపురం' కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా రాత్రికి రాత్రే నాయకులను అరెస్టు చేశారని, అరెస్టులకు వ్యతిరేకంగా ధర్నా చేశామని, నిరసనలు తెలిపామని నంద్యాల జిల్లా ప్రతినిధులు నాగరాజు వివరించారు.

గరుగుబిల్లి మండలం శివ్వాం దళితులపై దాడికి నిరసనగా ఆందోళనల ఫలితంగా పెత్తందార్లపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదైందని పార్వతీపురం మన్యం జిల్లా ప్రతినిధులు ఇందిర, నాయుడు తెలిపారు. పాచిపెంట మండలం కుడుమూరులో 784 ఎకరాల అన్యాక్రాంత భూములను పంచాలని పోరాడామని, గిరిజనుల పోడు భూములకు పట్టాలివ్వాలని ఉద్యమాలు నిర్వహించామని చెప్పారు.

జిఒ 3ని పునరుద్ధరించాలని, ఏజెన్సీ ప్రాంతంలో స్పెషల్ డిఎస్‌సి నిర్వహించి వంద శాతం ఖాళీలను ఆదివాసీలతోనే భర్తీ చేయాలని ఆందోళనలు నిర్వహించామని ఎఎస్‌ఆర్ పాడేరు జిల్లా ప్రతినిధులు కె.త్రినాథ్ తెలిపారు. కాఫీ, జీడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఉద్యమాలు నిర్వహించినట్లు చెప్పారు.

పోలవరం నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని, గ్రామాలు ఖాళీ చేసే నాటికి 18 ఏళ్ళు నిండిన యువతీయువకులకు సహాయ పునరావాస ప్యాకేజీ ఇవ్వాలని, ముంపు గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించామని ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా ప్రతినిధులు వెంకట్, పి.సంతోష్ తెలిపారు. పోడు భూముల హక్కుదార్లకు పట్టాలివ్వాలని రంపచోడవరం, చింతూరు ఐటిడిఎ కేంద్రాల వద్ద ఆందోళన నిర్వహించామని వివరించారు. జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించి గిరిజన ప్రాంతంలోని వంద శాతం పోస్టులను గిరిజనులతోనే భర్తీ చేయాలని ఉద్యమించినట్లు తెలిపారు. మణిపూర్ ప్రాంతంలో ఆదివాసీలపైన, క్రిస్టియన్లపైన జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బంద్ నిర్వహించామని చెప్పారు. కాకినాడ జిల్లా ప్రతినిధి ప్రసాద్ మాట్లాడుతూ జీడి పిక్కల కార్మికులు 68 రోజుల పాటు సమ్మె చేసి సంతృప్తికరమైన ప్యాకేజీ సాధించుకున్నారని వివరించారు. కాలుష్యం, భూ సేకరణ సమస్యలపై కృషి పెంచాల్సి ఉందన్నారు.

విజయనగరం జిల్లా ప్రతినిధి టివి.రమణ మాట్లాడుతూ గొర్రెల కాపరుల భృతికి ఆధారంగా ఉన్న ప్రభుత్వ భూమిని కృషి పరిశోధనా కేంద్రానికి కేటాయించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన ఆరు నెలల పాటు పోరాడి అడ్డుకున్నామని తెలిపారు. దీనివల్ల 150 కుటుంబాల భృతి పోకుండా కాపాడామని చెప్పారు. పరిశోధనా కేంద్రాన్ని మరొక చోటకు మార్చారని తెలిపారు. విజయనగరం పట్టణం చుట్టూ ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్ల వల్ల ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో బోరు బావులు ఎండిపోతున్నాదని, దీంతో, ఆరు నెలల పాటు పోరాడి 40 ప్లాంట్లను మూసివేయించగలిగామని తెలిపారు.

చిత్తూరు జిల్లా ప్రతినిధి వి.నాగరాజు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో జైలు సూపరింటెండెంట్ ఇంట్లో దళిత మహిళ దొంగతనం చేసిందంటూ 'జై భీమ్' సినిమా తరహాలో పోలీసులు చిత్రహింసలకు గురిచేశారని, దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించడంతో ఆ అధికారిపై కేసు నమోదైందని వివరించారు. ఏనాదుల భూములను అగ్రకులస్తులు ఆక్రమించుకోవడాన్ని వ్యతిరేకిస్తూ చేసిన పోరాటం విజయవంతమైందన్నారు. అధికారులు సర్వే నిర్వహించి 59 ఎకరాలు ప్రభుత్వ భూమిని తేల్చి అక్కడ యానాదులకు స్కూలు, హాస్టల్ పెట్టడానికి ప్రతిపాదించారని వివరించారు. సత్యసాయి జిల్లా ప్రతినిధి జిఎల్ నరసింహ మాట్లాడుతూ పేదలకు భూమి, ఇళ్ల స్థలాల కోసం పోరాటాలు నిర్వహించామని తెలిపారు. దీనివల్ల ప్రజాసంఘాల సభ్యత్వం పెరిగిందన్నారు.

జిల్లాల వారీగా చర్చలు



అనకాపల్లి నుంచి డి.వెంకన్న



అనంతపురం నుంచి కృష్ణమూర్తి



అనంతపురం నుంచి సావిత్రి



అన్నమయ్య నుంచి శ్రీనివాసులు



చిత్తూరు నుంచి గంగరాజు



తూర్పుగోదావరి నుంచి జె.రాంబాబు



కడప నుంచి రామ్మోహన్



కాకినాడ నుంచి ప్రసాదరావు



కోనసీమ నుంచి కె.వెంకటేశ్వరరావు



కృష్ణా నుంచి వెంకటేశ్వరరావు



నెల్లూరు నుంచి పుల్లయ్య



నెల్లూరు నుంచి మాదాల వెంకటేశ్వర్లు



ప్రకాశం నుంచి జివి కొండారెడ్డి



ప్రకాశం నుంచి ఎస్‌కె మాబూ



రాష్ట్ర కేంద్రం నుంచి రామ్మోహన్



సత్యసాయి నుంచి నర్సింహులు



తిరుపతి నుంచి సుబ్రహ్మణ్యం



విజయనగరం నుంచి టివి రమణ

స్ఫూర్తినిచ్చిన పెరుగులంక భూపోరాటం

- మరోసారి చర్చనీయాంశమైన చించినాడ
- ఆర్ఎస్ స్ఫూర్తితో పేదల విజయం

ప్రజాశక్తి - కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ (నెల్లూరు)



చించినాడలో పెరుగులంక భూములు పేదలకు ఇవ్వాలని చేపట్టిన ప్రదర్శన

గోదావరి జిల్లాల్లో చించినాడ పేరు వినగానే అందరికీ గుర్తొచ్చేది కమ్యూనిస్టులే. స్వాతంత్రోద్యమ సమయంలోనూ, స్వాతంత్ర్యం వచ్చాక కూడా అగ్రవర్ణ పెత్తందారీ భూస్వాములతో ఢీ అంటే ఢీ అంటూ పేదల పక్షాన కమ్యూనిస్టులు, ప్రధానంగా స్వాతంత్ర్యం వచ్చాక సిపిఎం ఆధ్వర్యాన సాగిన పోరాటాలు చరిత్రలో చిరస్మరణీయ ఘట్టాలుగా చెప్పుకోవచ్చు. ఆ పోరాటాల నేపథ్యమే ఆ గ్రామం పోరాటాల పురిటిగడ్డగా పేరొందడంతోపాటు స్థానిక సంస్థలన్నింటిలో సిపిఎం నేతలే ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారని చెప్పొచ్చు. పెద్దఎత్తున సాగిన వర్గపోరులో సిపిఎం నేతలు భూస్వాముల చేతిలో హత్యకు గురైన గడ్డ చించినాడ. ఆ దాడులను, హత్యలను ప్రతిఘటించి ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో ఆ గ్రామానికి చెందిన కమ్యూనిస్టు యోధుడు, మాజీ ఎంఎల్ఎ ఆర్.సత్యనారాయణరాజు (ఆర్ఎస్) పాత్ర ఎనలేనిది. ఆయన వెంట ఉండి ఉద్యమాన్ని ముందుకు నడిపిన వారిలో కేతా సూర్యారావు ముఖ్యులు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలోని మేజర్ గ్రామం చించినాడ.

అదే తరహాలో తీవ్ర నిర్బంధం నడుమ ఇటీవల చించినాడలో పేద దళితులు, బిసిలు సాగించిన పెరుగులంక భూపోరాటం చించినాడ పేరును మరోసారి మార్మోగించింది. సుమారు 800 కుటుంబాలు తమ అధీనంలో ఉన్న భూములను రక్షించుకోవడం కోసం సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యాన ఆరు నెలలపాటు సమరశీల పోరు సాగింది. ఆ భూములు మళ్లీ పేదలకు కేటాయిస్తూ అధికారులు పట్టాలిస్తుండటం సిపిఎం పోరాటాల ఫలితమేనని ఘంటాపథంగా చెప్పొచ్చు. ఆ పోరులో ప్రత్యక్షంగా పాల్గొన్న ఆ గ్రామానికి చెందిన సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు ఆ పార్టీ 27వ రాష్ట్ర మహాసభకు ప్రతినిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి ఆయనను పలుకరించగా, పెరుగులంక భూముల పోరాట వివరాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

చించినాడలో పేద దళితులు, బిసిల పోరాట ఫలితంగా గోదావరి లంక భూముల్లో సాగు చేసుకునేందుకు 1983లో అప్పటి ప్రభుత్వం 40 ఎకరాలకు డి.ఫారం పట్టాలిచ్చింది. నాటి నుంచి పేదలు ఆ భూముల్లో చెరువులు తవ్వుకుని ఆక్వా సాగు చేసుకుంటున్నారు. కాలక్రమంలో గోదావరి ప్రవాహం రీత్యా ఆ లంక భూములకు ఆనుకుని లంక భూములు మరో 20 ఎకరాలకు విస్తరించాయి. ఆ భూములను సైతం చించినాడలోని పేదలు సాగు చేసుకోవడానికి పట్టాలివ్వాలని అధికారులను కోరి సాగు ప్రారంభించారు. ఆ భూములపై వైసిపి పెద్దల కన్ను పడింది. పేదలను అక్కడి నుంచి తరిమేసే లక్ష్యంతో డి.ఫారం పట్టాభూముల్లో వేరే వారు సాగు చేస్తున్నారంటూ మొత్తం 60 ఎకరాల్లోనూ సాగును అధికారులు అడ్డుకున్నారు. ఆపై జగనన్న ఇళ్ల కాలనీలకు మట్టి తోలకం పేరుతో ఆ లంక భూముల్లో మట్టి తవ్వకం ప్రారంభించారు. దీనిపై పేదలు హైకోర్టును ఆశ్రయించగా, మట్టి తవ్వకాలు ఆపాలని కోర్టు ఉత్తర్వులిచ్చింది. అయినప్పటికీ జిల్లా అధికారులు, వైసిపి ప్రజాప్రతినిధులు ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తూ మట్టి తవ్వకాలను సాగించారు. దీనిపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జిల్లా నేతలు బి.బలరాం, కవురు పెద్దిరాజు, కేతా సూర్యారావు నేతృత్వంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టగా నిరాక్షిణ్యంగా పోలీసులు విరుచుకుపడి శ్రీనివాసరావు, బలరాంతోపాటు సుమారు వందమందిని అరెస్టు చేసి ఆ రోజు రాత్రి వరకూ నేతలను వివిధ పోలీసు స్టేషన్లకు తిప్పుతూ హైడ్రామా సాగించారు. ఎక్కడికక్కడ నిరసనలు వెల్లువెత్తడంతో రాత్రికి విడుదల చేశారు. ఖాకీల దాడిలో సిపిఎం కార్యకర్తలు పల్లేరు శ్రీను, కానేటి బాలరాజు, కె.ప్రియాంక, రాపాక బొజ్జమ్మ, తెన్నేటి స్టాలిన్ తదితరులకు గాయాలవ్వడంతో పోలీసులే ఆసుపత్రికి తరలించారు. ఈ తరహాలో సుమారు ఆరు నెలలపాటు పోలీసుల నిర్బంధం పెద్దఎత్తున సాగింది. నిర్బంధాలు ఆ గ్రామస్తులకు కొత్తకాకపోవడంతో ధీటుగా తిప్పికొట్టారు. ఈ క్రమంలో ప్రతిపక్ష ఎంఎల్ఎగా ఉన్న నిమ్మల రామానాయుడు ఈ ఉద్యమంలో ప్రత్యక్షంగా భాగస్వాములయ్యారు. టిడిపి, జనసేన నేతలు సంఘీభావం తెలిపారు. వివిధ దళిత, ప్రజాసంఘాలు సైతం మద్దతు పలికాయి. పౌరహక్కుల సంఘం నేతలు నిజ నిర్ధారణ పర్యటన చేశారు. ఫలితంగా అధికారులు వెనక్కుతగ్గారు. అప్పటికీ వైసిపి నేతల ఒత్తిడి తగ్గకపోవడంతో కొందరు సెలవుపై వెళ్లిపోయారు. చించినాడ పేదల సమరశీల పోరాటాల ఫలితంగా మట్టి తవ్వకాలను ప్రభుత్వం నిలిపివేసింది. కామ్రేడ్ ఆర్ఎస్, కామ్రేడ్ కేతా సూర్యారావు, అమరవీరుల స్ఫూర్తితో సాగించిన ఈ పోరాట ఫలితంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక పాత 40 ఎకరాలతోపాటు కొత్తగా ఏర్పడిన 20 ఎకరాల లంక భూములకు సంబంధించి పేదలకు పట్టాలివ్వడం ప్రారంభించింది. తద్వారా చించినాడ పోరాటం మరోసారి విజయపతాకం ఎగురవేయడంతోపాటు జిల్లాలోని పేదలకు, పోరాటాలకు స్ఫూర్తినిచ్చిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

హామీల అమలుకు ఉద్యమం

- సిపిఎం నేతలు బాబూరావు, ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి- కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ (నెల్లూరు నుంచి)



విలేకరుల సమావేశంలో బాబురావు, ప్రభాకర్‌రెడ్డి, మూలం రమేష్, మోహనరావు

ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజా ఉద్యమాలు నిర్వహించబోతున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, కె ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులో సిపిఎం 27వ మహాసభను పురస్కరించుకుని రెండో రోజు ఆదివారం కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్‌లో వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజానీకం తీవ్రంగా ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సిపిఎం మహాసభలో రెండో రోజు ప్రతినిధులు చర్చించి పలు తీర్మానాలు చేసినట్లు చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతోపాటు ఇతర హామీలనూ అమలు చేయాలని మహాసభ డిమాండ్ చేసినట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం చేసిన అనేక తప్పిదాల కారణంగా తీవ్రమైన ఓటమిని చవిచూసిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, భారాలపై భారాలు మోపుతోందని వివరించారు. రాష్ట్ర ప్రజలు ఎనిమిది నెలలుగా ఓపికతో ఉన్నారని, హామీలను అమలు చేయకపోతే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రం లక్షల కోట్ల రూపాయలు అప్పుల్లో ఉందని, ప్రభుత్వం సంక్షోభంలో కూరుకుపోయిందని ముఖ్యమంత్రి చెబుతున్నారని, రాష్ట్ర ప్రజలు కూడా చాలా ఇబ్బందుల్లో ఉన్నారని, వారు కూడా తీవ్ర అప్పుల్లో కూరుకుపోయారనే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుర్తించాలని సూచించారు. టిడిపి కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 50 వయసు నిండిన బిసిలకు పింఛన్లు, పట్టణవాసులకు ఆస్తి పన్నులు తగ్గించడం తదితర హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూన్‌లో మూడు పథకాలు, ఆ తర్వాత మరో మూడు పథకాలు అమలు చేస్తామంటే కుదరదని, ఇచ్చిన హామీలపై కాలయాపన చేస్తే ప్రజలు ఊపేక్షించబోరని హెచ్చరించారు. మహాసభ అనంతరం ప్రజలను చైతన్యపరిచి రాష్ట్రంలో పెద్ద ఎత్తున సిపిఎం నేతృత్వంలో ఆందోళనకు సిద్ధమవుతామని తెలిపారు. విజన్ 2047, వికసిత్ భారత్ తప్ప, 2025-26 గురించి చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. 'చెప్పినవి చేయరు. చెప్పకుండా ప్రజలపై భారాల మోపుతారు. ఆ కోణంలోనివే విద్యుత్ ఛార్జీల బారాలు. భూముల రిజిస్ట్రేషన్ ధరల పెంపు' అని వివరించారు. రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచడం వల్ల పట్టణ ప్రాంతాల్లో అద్దెలు పెరిగి ప్రజలకు భారంగా మారుతుందని తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గత పదిన్నర సంవత్సరాల పాలనలో రాష్ట్రానికి ఏమి ఒరిగిందో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్‌డిఎలో భాగస్వాములుగా ఉన్న టిడిపి, జనసేన పార్టీలు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, కడప ఉక్కు, పోలవరం నిర్వాసితుల న్యాయమైన పరిహారం, ప్యాకేజీ, పోలవరం ప్రాజెక్టు పూర్తికి ప్రధాని మోడీపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్రం ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేంతవరకు సిపిఎం అవిశ్రాంత పోరాటం చేస్తుందని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాజెక్టులు సత్వరం పూర్తి చేసి సాగునీరు అందించి రైతులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు మోహనరావు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల కోసం మూడేళ్లుగా పోరు ఉధృతం

- కోర్టు ఆదేశాలనూ అమలు చేయని రెవెన్యూ అధికారులు
- దోసపాడు భూపోరాటంపై పి.రామకృష్ణ

ప్రజాశక్తి - కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ (నెల్లూరు)



దోసపాడు నుంచి ఏలూరు వరకూ సాగిన పాదయాత్రలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు (ఫైల్)

ఏలూరు జిల్లా దెందులూరు మండలం దోసపాడులో సుమారు వందెకరాలకుపైగా అసైన్డ్ భూముల కోసం అక్కడి పేదలు, దళితులు పెద్దఎత్తున పోరు సాగిస్తున్నారు. క్షేత్రస్థాయి పోరుతోపాటు కోర్టుల్లో కేసులు వేసి పేదలు అనుకూల ఉత్తర్వులు సాధించుకున్నా... రెవెన్యూ అధికారులు అమలు చేయని పరిస్థితి. ఈ భూపోరాటానికి ప్రత్యక్షంగా నాయకత్వం వహిస్తున్న వ్యవసాయ కార్మిక రంగం నేత పి.రామకృష్ణ నెల్లూరులో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర మహాసభకు ప్రతినిధిగా హాజరయ్యారు. ఆయనను ప్రజాశక్తి పలుకరించగా దోసపాడు పోరాట పూర్వపరాలను వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. దోసపాడులోని సీలింగ్ భూములను 1956 నుంచి 98 మధ్యకాలంలో అప్పటి ప్రభుత్వాలు సుమారు 106 ఎకరాలు పేదలకు అసైన్ చేసి డి.నమూనా పట్టాలిచ్చాయి. ఇవికాక సీలింగ్ భూమి 350 ఎకరాలు, గయాళ భూములు సుమారు 150 ఎకరాలు ఉన్నాయి. ఆ భూములన్నీ అన్యాక్రాంతమయ్యాయి. నేటికీ ఈ భూములన్నీ విజయవాడకు చెందిన భూస్వాముల సాగులో ఉన్నాయి. అక్రమంగా రొయ్యలు, చేపల సాగు చేస్తున్నారు. అన్యాక్రాంత భూములను గుర్తించిన రెవెన్యూ అధికారులు వాటిని స్వాధీనం చేసుకోవడంలో ఉదాశీనత ప్రదర్శించడంతో పేదలు నష్టపోతున్నారు. 106.16 ఎకరాల అసైన్డ్ భూములను అర్హులైన తమకే అందించాలని అక్కడి పేదలు, దళితులు పోరాడుతుంటే పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారు. సుమారు 95 మందిపై 8 కేసులు నమోదయ్యాయి. ఈ పేదల పోరాటానికి మద్దతుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వాన దోసపాడు నుంచి ఏలూరులోని జిల్లా కలెక్టరేట్ వరకూ పాదయాత్ర సైతం నిర్వహించారు. పేదలను పోరులో ముందుండి నడిపిస్తున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు ఎ.రవి, ప్రజాసంఘాల జిల్లా నేతలు డిఎన్‌విడి. ప్రసాద్, కె.శ్రీనివాస్‌లపైనా పోలీసులు కేసులు బనాయించారు. క్షేత్రస్థాయి పోరుతోపాటు 2012 నవంబర్‌లో లోకాయుక్తకు ఫిర్యాదు చేయగా, విచారణ అనంతరం 2015 ఆగస్టులో పేదలకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఆ ఆదేశాలను అప్పటి రెవెన్యూ అధికారులు అమలు చేయకపోవడంతో పేదలు పోరు సాగించాల్సి వచ్చింది. ఇదే క్రమంలో 2023లో జిల్లా కోర్టులో, జాయింట్ కలెక్టర్ కోర్టుల్లో కేసులు నడపగా అక్కడా పేదలకు అనుకూలంగా తీర్పులొచ్చినా, నేటికీ అమలు చేయలేదు. దీంతో హైకోర్టును ఆశ్రయించాం. కోర్టు తీర్పులను అమలు చేయాలని సిసిఎల్ఎను కలిశాం. అసైన్డ్ భూమిని పేదలకు అప్పగించాలని, సాగుకు అవకాశం కల్పించాలని రానున్న కాలంలో పోరు ఉధృతం చేయనున్నాం.

నేడు బహిరంగ సభ

- సిపిఎం నేత బృందాకరత్ రాక

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ సందర్భంగా సోమవారం భారీ ర్యాలీ, బహిరంగ సభ జరగనుంది. మధ్యాహ్నం మూడు గంటలకు ఆత్మకూరు బస్టాండ్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుంది. బోసుబొమ్మ, సుందరయ్య బొమ్మ, ఎసి సెంటర్, గాంధీబొమ్మ, మీదుగా ట్రంకురోడ్డు నుంచి విఆర్‌సి మైదానం చేరుకుంటుంది. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, ఎంఎ బేబి, బివి రాఘవులతోపాటు, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శవర్గ సభ్యులు ఎంఎ గఫూర్, డి . రమాదేవితోపాట ఆపార్టీ సీనియర్ నాయకులు పాల్గొననున్నారు.ప్రదర్శన అగ్రభాగాన నేతలు, 27వ రాష్ట్ర మహాసభలకు సూచకంగా 27 మహిళలు ఎర్రచీరలు, అరుణపతాకాలతో ర్యాలీలో పాల్గొననున్నారు. డప్పులు, కోలాట దళం, విచిత్ర వేషదారణలు, తెనాలి బ్యాండ్, డిజేలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.



విశాఖ ఉక్కును కేంద్రమే నడపాలి

• కార్మికులకు కనీస వేతనాలు పెంచాలి • సమగ్ర భూ పంపిణీ ద్వారానే పేదరిక నిర్మూలన • సిపిఎం రాష్ట్ర మహాసభలో ఏకగ్రీవ తీర్మానాలు


విశాఖ స్టీల్‌ప్లాంట్ తీర్మానం ప్రవేశపెడుతున్న కె. శ్రీనివాస్


బలపరుస్తున్న నాగరాజు

విశాఖ స్టీలు ప్లాంటును కేంద్రమే నిర్వహించాలని, ప్రైవేటీకరించొద్దని, సొంత గనులు కేటాయించాలని సిపిఎం రాష్ట్ర 27వ మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. గత ఎన్నికల ముందు టిడిపి, జనసేన నాయకులు ఈ మేరకు వాగ్దానాలు చేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంకా పుట్టని ఆర్సెల్లార్ మిట్టల్‌కు గనులు ఇవ్వాలని కోరారేగానీ, విశాఖ స్టీలుకు ఇవ్వాలని కోరలేదని తీర్మానంలో పేర్కొన్నారు. నెల్లూరులోని సీతారాం ఏచూరి నగర్ (అనిల్ గార్డెన్స్)లో జరుగుతున్న సిపిఎం 27వ మహాసభ రెండో రోజు పలు అంశాలపై తీర్మానాలను ఆమోదించింది. కడపలో స్టీలు ప్లాంటు, పేదలందరికీ సమగ్ర భూ పంపిణీ, కార్మికులకు కనీస వేతనాలు, రెగ్యులరైజేషన్, సంక్షేమ పథకాలు అమలు వంటివి వాటిలో ఉన్నాయి. పట్టణాల్లో ఆస్తి పన్ను పెంపు ఆపాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేటీకరణ ఆపాలని, దళితులపై దాడులు అరికట్టాలని ప్రవేశపెట్టిన తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

ప్రజాశక్తి- సీతారాం ఏచూరి నగర్ (నెల్లూరు)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లతో కుమ్మక్కై భూములను, గనులను, భారీ పరిశ్రమల సంపదను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తున్నాయని, ఇటువంటి ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఆపాలని సిపిఎం రాష్ట్ర 27వ మహాసభ డిమాండ్ చేసింది. స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ జిల్లాకు చెందిన కెఎం.శ్రీనివాస్ తీర్మానం ప్రవేశపెట్టగా తిరుపతి జిల్లాకు చెందిన నాగరాజు బలపరిచారు. దీన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రైవేటీకరణలో భాగంగానే విశాఖ స్టీలులో నూరు శాతం వాటాలు అమ్మాలని 2021 జనవరిలో కేంద్ర కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించిందని పేర్కొన్నారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లతో కుమ్మక్కై కారు చౌకగా ఈ ప్లాంట్‌ను కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని, ఇటువంటి ప్రయత్నాలు విరమించుకుని కేంద్రమే నిర్వహించాలని మహాసభ డిమాండ్ చేసింది. సాలీనా 73 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో దేశంలోనే నాణ్యమైన స్టీలును ఉత్పత్తి చేస్తున్న విశాఖ స్టీలును అభివృద్ధి చేయాల్సిందిపోయి అమ్మాలని చూడడం సరికాదని పేర్కొంది. విశాఖ స్టీలును ప్రైవేటుపరం కాకుండా ఆపుతామని టిడిపి, జనసేన పార్టీలు వాగ్దానం చేశాయని, ఎన్నికల్లో భారీ మెజార్టీతో నెగ్గిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇంకా పుట్టని ఆర్సెల్లార్ మిట్టల్ స్టీలుకు సొంత గనులు కేటాయించాలని ప్రధానిని కోరారేగానీ, విశాఖ స్టీలుకు గనులు కోరకపోవడం దుర్మార్గమని తెలిపారు. జనవరి 8న విశాఖ వచ్చిన మోడీ... స్టీల్ ప్లాంటుపై మాట్లాడలేదని, దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర అర్థమవుతోందని వివరించారు. యాజమాన్యం కార్మికులకు, అధికారులకు విఆర్ఎస్ ప్రకటించిందని, నాలుగు వేల మంది కార్మికులకు తొలగించేందుకు సన్నద్ధమైందని తీర్మానంలో పేర్కొన్నారు. ముడి ఇనుప ఖనిజం, కోకింగ్ కోల్ గంగవరం పోర్టు నుండి విశాఖ స్టీలుకు రాకుండా అదాని పోర్టు యాజమాన్యం అనేకసార్లు అడ్డుపడుతూనే ఉందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజలు భారీ మెజార్టీ ఇచ్చినా కేంద్ర ప్రభుత్వంపై టిడిపి కూటమి ప్రభుత్వం ఒత్తిడి చేయకపోవడాన్ని మహాసభ తీవ్రంగా ఖండించింది.

సెయిల్ ఆధ్వర్యంలో కడప స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణం

ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 షెడ్యూలు 13లో కేంద్ర ప్రభుత్వం కడప ఉక్కు నిర్మిస్తామని ఇచ్చిన హామీ నేటికీ శిలాఫలకాలకే పరిమితమైందని మహాసభ పేర్కొంది. కడప స్టీలు ఫ్యాక్టరీ నిర్మించాలని మహాసభ మరొక తీర్మానాన్ని ఆమోదించింది. రాయలసీమ డిక్లరేషన్ పేరిట బిజెపి ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి మోడీ ప్రభుత్వం కట్టుబడి ఉందని కర్నూలులో ప్రకటించిందని గుర్తు చేసింది. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి ఎట్టిమట్టిచంతల వద్ద, అనంతరం చంద్రబాబునాయుడు కంబాలదిన్నె వద్ద శంకుస్థాపనలు చేశారని పేర్కొంది. మూడోసారి జగన్ ముచ్చటగా కన్నెతీర్థం వద్ద శంకుస్థాపన చేశారని వివరించింది. సెయిల్ చైర్మన్ తొలుత కడప ఫీజుబిలిటీ అని నివేదిక ఇచ్చారని, బిజెపి ఒత్తిడితో నాన్ ఫీజుబిలిటీ అని రిపోర్టు ఇచ్చారని పేర్కొన్నారు. కడప ఉక్కు ఫీజుబిలిటీపై జాయింట్ పార్లమెంటరీ పబ్లిక్ హియరింగ్ పెట్టాలని తీర్మానంలో పేర్కొన్నారు. ఫ్యాక్టరీకి కావాల్సిన ఇనుప ఖనిజం కడప, అన్నమయ్య, అనంతపురం, బళ్లారి జిల్లాల్లోనే ఉందని తీర్మానం తెలిపింది. వెంటనే కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలని తీర్మానం కోరింది.

పట్టణాల్లో పన్ను పెంపు ఆపాలి

కేంద్ర ఆర్థిక సంఘం నిధులన్నీ ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలకు ముడిపెట్టి పన్నులు పెంచుతున్నారని, ఈ నిర్ణయాన్ని ఆపాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేటీకరణ విడనాడాలని మరొక తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. దీన్ని డి.కాశీనాథ్ ప్రవేశపెట్టగా టి.రాముడు బలపరిచారు. ప్రపంచ బ్యాంకు ఆదేశిత కేంద్ర బిజెపి పట్టణ సంస్కరణల అమలుకు రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం సిద్ధపడడాన్ని మహాసభ తీవ్రంగా వ్యతిరేకించింది. పిపిపి పేరుతో స్థానిక సంస్థల ఆస్తులను బడా సంస్థలకు ధారాదత్తం చేస్తోందని, ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, అంతర్జాతీయ ఫైనాన్స్ కార్పొరేషన్ తదితర అంతర్జాతీయ సంస్థల నుండి అప్పులు తీసుకోవాలని కేంద్రం ఒత్తిడి తెస్తోంది. గతంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం మోడీకి లొంగిపోయి ప్రమాదకర విధానాలను అమలు చేసింది. గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా పన్నును రద్దు చేయకపోగా,


తీర్మానం ప్రవేశపెడుతున్న డి.కాశీనాథ్


బలపరుస్తున్న రాములు

అమృత్ పథకం సంస్కరణలు ద్వారా నీటి కుళాయిలకు మీటర్లు, నీటి ఛార్జీలు, భూగర్భ డ్రెయినేజీ ఛార్జీల పెంపునకు ప్రయత్నిస్తోందని, నీటి పంపిణీ వ్యవస్థను ప్రైవేటుపరం చేసేందుకు పూనుకుంటోందని తీర్మానం పేర్కొంది. పన్ను భారాలు, యూజర్ ఛార్జీల విధింపు, మౌలిక సదుపాయాలు, పౌరసేవల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి ఉద్యమించాలని ఆ తీర్మానం విజ్ఞప్తి చేసింది.


తీర్మానం ప్రవేశపెడుతున్న ఆర్‌వి నరసింహారావు


బలపరుస్తున్న డిఎస్‌విడి ప్రసాద్

కార్మికులకు కనీస వేతనాలు పెంచాలి

రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని వెంటనే పరిష్కరించాలని సిపిఎం మహాసభ డిమాండ్ చేసింది. కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఆర్‌వి.నరసింహారావు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా ప్రసాదు బలపరిచారు. రాష్ట్రంలో 50 లక్షల మంది కార్మికులు పరిశ్రమలు, మిల్లులు, షాపులు, రవాణా, హాస్పిటల్స్, విద్యా సంస్థలు తదితర షెడ్యూలు ఎంప్లాయిమెంట్‌లో పనిచేస్తున్నారని తెలిపారు. వేతన సవరణ బోర్డును వేసి మూడు దఫాలుగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలను పరిగణనలోకి తీసుకుని వేతనాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ మహాసభ తీర్మానించింది.

అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, వెలుగు, ఉపాధి హామీ, సమగ్ర శిక్ష, కస్తూరిబా, వెల్ఫేర్, నేషనల్ హెల్త్ మిషన్, 108, 104 తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఆయుష్, ఎన్‌టిఆర్ వైద్యసేవ, అర్బన్ హెల్త్ పథకాల్లో లక్షలాది మంది పనిచేస్తున్నారు. అన్ని క్యాడర్ల స్కీమ్ వర్కర్లను ప్రభుత్వోద్యోగులకు గుర్తించాలని, స్కీమ్ వర్కర్లకు డిఎ సౌకర్యం కల్పించాలని మహాసభ ఆ తీర్మానంలో కోరింది. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, వేర్వేరు రంగాల్లో 50 వేలమంది పనిచేస్తున్నారు. , వీరందరినీ పర్మినెంట్ చేయాలని మహాసభ డిమాండ్ చేసింది. 12వ పే రివిజన్ కమిషన్‌ను వెంటనే నియమించాలని, ఉద్యోగ సంఘాలు కోరుతున్న విధంగా 30 శాతం మధ్యంతర భృతి కల్పించాలని, హమాలీ, ఆటో, లారీ కార్మికులకు సంక్షేమ బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని కోరింది. భవన నిర్మాణ బోర్డులో నిలుపుదల చేసిన పథకాలను వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని మహాసభ కోరింది.

సమగ్ర భూ పంపిణీ ద్వారానే పేదరిక నిర్మూలన

భూసంస్కరణలు అమలు జరిగి పేదల చేతికి భూమి వచ్చి నీటి సౌకర్యం లభించిన చోట పేదరిక నిర్మూలన జరిగిందని, ఆ విధంగా సమగ్ర భూ పంపిణీ చేయాలని సిపిఎం మహాసభ తీర్మానించింది. ఈ తీర్మానాన్ని దడాల సుబ్బారావు ప్రవేశపెట్టగా అన్వేష్ బలపరిచారు. మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. దున్నేవాడికే భూమి కావాలని వెట్టిచాకిరీ, కులమతాలు లేని సమాజం కావాలని, ఎర్రజెండా నాయకత్వంలో వీర తెలంగాణ విప్లవ సాయుధ పోరాటం ద్వారా నాలుగు వేల మంది ప్రాణాలు అర్పించి మూడు వేల గ్రామాల్లో పది లక్షల ఎకరాలు పంచిన చరిత్ర కమ్యూనిస్టులది. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల బంజరు, మిగులు భూములు పేదలకు పంచామని చెబుతున్న భూముల్లో 15 లక్షల ఎకరాలు తిరిగి భూస్వాములు, పలుకుబడి కలిగినవారు అక్రమంగా, దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నారని మహాసభ పేర్కొంది. పోరాడిన వారిపై అధికార పార్టీలు నిర్బంధం ప్రయోగించి 1200 మందిపై కేసులు బనాయించారని, 120 మందిని జైలుకు పంపించారని తెలిపింది. ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కోనేరు రంగారావు కమిషన్ రాష్ట్రంలో భూమిలేని పేదలకు కనీసం ఎకరం చొప్పున పంచడానికి భూమి ఉందని చెప్పిన విషయాన్ని గుర్తు చేసింది. 2007లో జరిగిన భూ పోరాటం సందర్భంగా ముదిగొండ పోలీసు కాల్పుల్లో ప్రభుత్వం ఏడుగురిని పొట్టన బెట్టుకుంది. ఆ పోరాట ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చి కొంతమందికైనా భూములు పంచింది. రాష్ట్రంలో


తీర్మానం ప్రవేశపెడుతున్న డి.సుబ్బారావు


బలపరస్తున్న అన్వేష్

చంద్రబాబునాయుడు, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు పేదలకు భూ పంపిణీ చేయకపోగా, భూ చట్టాలన్నిటినీ నీరుగార్చి పేదల భూములను పెద్దలకు కట్టబెడుతున్నారని ఈ తీర్మానం తెలిపింది. మరోవైపు కార్పొరేట్ కంపెనీలు పరిశ్రమలు పెట్టకుండానే తీసుకున్న భూములను తాకట్టుపెట్టి రుణాలు తీసుకుని ఎగ్గొట్టి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నాయని తీర్మానం వివరించింది. పోరాడితేనే భూమి దక్కుతుందని, పేదలను చైతన్యపరిచి భూమి కోసం పోరాడడానికి ప్రజలను సన్నద్ధం చేయాలని సిపిఎం మహాసభ పిలుపునిచ్చింది. రాష్ట్రంలో కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేసి భూమిలేని ప్రతి కుటుంబానికీ రెండు ఎకరాల భూమి, గ్రామాల్లో ఐదు, పట్టణాల్లో మూడు సెంట్ల నివాస స్థలం పంపిణీ చేయాలని మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బలవంతపు భూసేకరణ ఆపాలని, 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని తీర్మానించిది.


తీర్మానం ప్రవేశపెడుతున్న ఆంద్ర మాల్యాద్రి

దళితులపై వివక్ష రూపుమాపేందుకు చర్యలు

మహాసభలో తీర్మానం


బలపరుస్తున్న లింగన్న

దళితులపై దాడులు అరికట్టాలని, వివక్ష రూపుమాపేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ మహాసభ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. అంద్ర మాల్యాద్రి ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా లింగన్న బలపరిచారు. దళితులపై కొనసాగుతున్న అమానుష దాడులు, హత్యలను నివారించాలని, దుర్మార్గాలకు పాల్పడుతున్న కుల దురహంకారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, 41 ఎపిఆర్‌ఆర్‌పి కింద బెయిల్ ఇవ్వకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు, రాజ్యాంగం కల్పించిన హక్కులను పటిష్టంగా అమలు చేయాలని, సామాజిక న్యాయాన్ని కాపాడాలని ప్రభుత్వాలను మహాసభ డిమాండు చేసింది.

సమ్మె చేస్తేనే వేతనాలు

- తాగునీటి ప్రాజెక్టుల్లో 1500 మంది కార్మికులకు అండగా సిఐటియు
- అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్



ప్రజాశక్తి - కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ (నెల్లూరు)

'సమ్మె చేస్తేనే కార్మికులకు జీతాలు.. లేకపోతే పస్తులు.. కార్మికులు నిలదీస్తే నిర్బంధాలు.. అరెస్టులు.. అక్రమ కేసులు.. నిత్యం వేధింపులకు గురవుతున్న ఆ అభాగ్యులకు ఎర్రజెండా తోడునీడైంది. 'పోరాడితే పోయేదేం లేదు.. బానిస సంకెళ్లు తప్ప' అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని 1500 మంది కార్మికులు పోరుపథంలో కదిలారు. సిఐటియు ఆధ్వర్యాన ఏడాదిగా పోరాటం చేస్తూ ఎన్నో విజయాలు సాధించారు. సాధిస్తూనే ఉన్నారు. 'ఆ కార్మికులకు నాయకత్వం వహిస్తున్న సిఐటియు అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ సిపిఎం రాష్ట్ర మహాసభకు ప్రతినిధిగా హాజరయ్యారు. అక్కడ కార్మికుల పోరాటాలు.. సాధించిన విజయాలు ప్రజాశక్తితో ఆయన పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే....

అనంతపురం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా (అనంతపురం, హిందూపురం) నీలకంఠాపురం శ్రీరామ్‌రెడ్డి తాగునీటి పథకం, సత్యసాయిబాబా తాగునీటి పథకం కింద రెండు వేల గ్రామాలకు నీటి సరఫరా అవుతోంది. ఈ ప్రాజెక్టుల కింద పనిచేస్తున్న 1500 మంది కార్మికులకు ప్రతినెలా వేతనాలొచ్చే పరిస్థితి లేదు. మూడు నెలలకోసారి ఆందోళన చేస్తేగాని జీతాలు రావు. ప్రతిసారీ జీతాల కోసం సమ్మె నోటీసు ఇవ్వాల్సిందే. ఇప్పటికి ఆరు నెలల బకాయి ఉంది. నాటి జగన్ ప్రభుత్వంగానీ, నేటి కూటమి ప్రభుత్వంగానీ వీరి సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి చూపడం లేదు. సత్యసాయి బోర్డు ద్వారా నిధులొస్తున్నప్పటికీ... రెండో ప్రాజెక్ట్ అయిన శ్రీరామ్‌రెడ్డి ప్రభుత్వ ప్రాజెక్టుకు ప్రభుత్వం నిధులివ్వడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. ఈ కారణంగా కార్మికులకు జీతాలివ్వడం ఆపేశారు. తాజాగా డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అనంతపురం వచ్చినప్పుడు వీరి సమస్యను ఆయన దృష్టికి సిఐటియు తీసుకెళ్లింది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, ఏ నెలకు ఆ నెల జీతం ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్ చెల్లించాలని కార్మికులు పవన్‌కల్యాణ్‌ను కోరారు. స్పందించిన ఆయన వారి సమస్యలు పరిష్కరించాలని అక్కడికక్కడ ఆదేశాలు జారీ చేసినా ఆచరణలో అమలు కావడం లేదు. ఇది కాదని లేబర్ ఆఫీసుల చుట్టూ తిరిగారు. లేబర్ ఆఫీస్ నుంచి రీజినల్ ఆర్‌జెడి వారు పని చేస్తున్న ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. స్కిల్డ్, అన్‌స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని అధికారి ముందుంచారు. మూడు నెలలైనా ఫలితం లేదు. ఇక ప్రయోజనం లేదని సమ్మె నోటీసు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. దీనిపై సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. సిఐటియు ఆధ్వర్యాన దీన్ని ప్రజాపోరాటంగా మలిచి శాశ్వత ఉద్యోగులుగా గుర్తింపు పొందడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని కార్మికులు ప్రతినబూనుతున్నారు.

ప్రొటెక్షన్ ఆర్డర్లతో గిరిజనుల భూములు గిరిజనేతరుల పరం

- పశ్చిమ ఏజెన్సీలో పాలకుల

అండతో అధికారుల అక్రమాలు


ఏజెన్సీలో పేదల గుడిసెలు పీకివేతను అడ్డుకున్న సిపిఎం నేతలు, పేదలను బలవంతంగా అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ (నెల్లూరు)

ఏలూరు జిల్లాలోని పశ్చిమ ఏజెన్సీ అంటే అందరికీ గుర్తొచ్చేది భూపోరాటాలు. ఏజెన్సీ పరిధిలోని మండలాల్లో విస్తారంగా నేటికీ భూపోరాటాలు సాగుతున్నాయి. అయితే ఇవి కొత్త భూముల కోసం కాకుండా గిరిజనుల సాగులో ఉన్న భూములను రక్షించుకోవడానికి పోరు సాగించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో పాలకులు గిరిజనులపై, ఆయా సంఘాల నేతలపై తీవ్ర నిర్బంధం ప్రయోగించడంతోపాటు అక్రమ కేసులు పదుల సంఖ్యలో బనాయిస్తున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరులో జరుగుతున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభకు ప్రతినిధిగా హాజరైన ఏజెన్సీలో భూపోరాట నేత, సిపిఎం నేత తెల్లం రామకృష్ణను ప్రజాశక్తి పలుకరించింది. ఏజెన్సీ పోరాట వివరాలు, అధికారుల తీరు ఆయన మాటల్లోనే..

ఏజెన్సీలో భూపోరాటాల ద్వారా వేలాది ఎకరాలను గిరిజనులు సాధించుకున్నారు. ఈ కాలంలో గిరిజనులపై గిరిజనేతర భూస్వాములు, అధికారుల నిర్బంధం, దాడి పెరిగింది. గిరిజనులకు చెందే భూముల రికార్డు (టైటిల్ వెరిఫికేషన్) చేయకుండా గిరిజనేతరులకు అనుకూలంగా జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి పోలవరం తహశీల్దార్లు గిరిజనులనే నేరస్తులుగా ముద్రించి గిరిజనేతరులకు ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన గిరిజన నేతలు, గిరిజనులపై అక్రమ కేసులు బనాయించడం పోలీసులకు పరిపాటిగా మారింది. బుట్టాయగూడెం మండలం మర్లగూడెంలో గత 35 సంవత్సరాలుగా సాగు చేస్తున్న ఎల్‌టిఆర్, 1/70 చట్ట భూములను ఎటువంటి రికార్డు వెరిఫికేషన్ చేయకుండా ఆర్‌డిఒ తప్పుడు ప్రొటెక్షన్ ఆర్డర్ ఇచ్చారు. స్థానిక గిరిజనులు పది మందిపై నాలుగు కేసులు నమోదు చేశారు. ఇనుపూరులో 80 ఎకరాల భూముల పోరాటం జరుగుతుంది. కొత్తగా వచ్చిన ఆర్‌డిఒ రమణ ఇప్పటికీ మూడు ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇచ్చారు. ప్రొటెక్షన్ ఆర్డర్ పేరుతో 10 ఎకరాల్లో వేసిన బొబ్బర పంటను పోలీసు రక్షణతో గిరిజనేతరులు దున్నేశారు. బుట్టాయిగూడెం మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకున్న పేదల గుడిసెలను కొంతమంది గిరిజనేతర భూస్వాములు కిరాయి రౌడీలతో దాడులు చేయడం, దానికి పోలీసులు వత్తాసు పలకడం దారుణం. ఏజెన్సీ మండలాల్లో నేతలు, గిరిజనులు సుమారు మూడొందల మందిపై 98కిపైగా కేసులు ఉన్నాయంటే అధికారుల, ప్రభుత్వ తీరు అర్థం చేసుకోవచ్చు. రికార్డులు పరిశీలించాలకే భూములు ఎవరివనేది నిర్ధారించాలనేది మా ప్రధాన డిమాండ్. అలా చేయకుండా అధికారులే సమస్యను సృష్టిస్తుండటం, ఎస్‌డిసి కోర్టుల్లో గిరిజనులకు అనుకూలంగా తీర్పు వచ్చినా అధికారులు అమలు చేయకపోవడం సర్వసాధారణంగా మారింది. ఇదే కొనసాగితే రానున్న రోజుల్లో తప్పుడు ప్రొటెక్షన్ ఆర్డర్లకు వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరు చేపడతాం.

గిరిజన సమస్యలపై జడ్‌పిలో గళం

'ప్రజాశక్తి'తో అనంతగిరి జడ్‌పిటిసి గంగరాజు



ప్రజాశక్తి- కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ (నెల్లూరు)

గిరిజన సమస్యలపై విశాఖ జిల్లా పరిషత్తులో గళం విప్పుతున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి జడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు తెలిపారు. సిపిఎం రాష్ట్ర మహాసభకు ప్రతినిధిగా హాజరైన ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. గిరిజన ప్రాంత సమస్యలపై సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన ఆందోళనలు, సాధించిన విజయాలను వివరించారు. గిరిజన ప్రాంత సమస్యలను అధికారుల దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిఒ నంబర్ 3 ప్రకారం షెడ్యూల్ ఏరియాలోని గిరిజనులకు నూటికి నూరు శాతం ఉద్యోగాలు ఇవ్వాలని జిల్లా పరిషత్తు సమావేశంలో పలుమార్లు ప్రస్తావించారు. 2022లో సుప్రీంకోర్టులో ఈ జిఒను కొట్టేశాక దీని పునరుద్ధరణకు జడ్‌పిలో గట్టిగా వాదించారు. ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న 807 మంది భాషా వలంటీర్ల ఉద్యోగ భద్రతకు పోరాడారు. కులం వెబ్ సైట్ నుంచి తొలగించిన భగత, వాల్మీకి, కొండదొర, గౌడ కులాలను సిపిఎం పోరాటంతోనే తిరిగి కొనసాగిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో డోలి మోత, రోడ్ల అభివృద్ధికి రూ.60 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేయించి నిధులు రాబట్టారు. నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. తాగునీరులేని గిరిజన ప్రాంతాలకు అధికారిని తీసుకెళ్లి పరిస్థితిని చూపించి జలజీవన్ మిషన్ కింద నీటి సౌకర్యం కల్పించారు. పల్లె పండగ నిధులు అల్లూరు జిల్లాకు కూడా కేటాయించాలని జడ్‌పి సమావేశంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లారు. కొండపోరంబోకు భూములను సాగు చేస్తున్న గిరిజనులకు అటవీ, రెవెన్యూ శాఖల అధికారులతో మాట్లాడి పట్టాలు ఇప్పించారు. పంచాయతీల నిధులు దారి మళ్లించడం వల్ల మౌలిక సౌకర్యాల కల్పన కుంటుపడిందని, కేరళ తరహాలో గ్రామస్వరాజ్యం అమలు కావాలంటే ఇక్కడా అదే తరహాలో నిధులు, విధులు కేటాయించి అభివృద్ధి చేయాలని గంగరాజు అన్నారు. గిరిజన సమస్యలపై సిపిఎం నిరంతరం పోరాడుతోందని తెలిపారు.



ప్రపంచీకరణ సంస్కృతి సాంప్రదాయ వ్యతిరేకి అని భావించటం తప్పు. దానికి ఏది లాభాలను తెస్తుంది అనుకుంటే దానిని నిరభ్యంతరంగా స్వీకరించి, విపరీత ప్రాచుర్యం కల్పిస్తుంది. ప్రపంచీకరణకు సాహిత్య, సాంస్కృతిక విలువల కన్నా తన ప్రయోజనాలే ముఖ్యం.

–సీతారాం ఏచూరి



దుఃఖిత స్థలి

భక్తి ముసుగులో వ్యక్తి భద్రతకు తూట్లు
కబోది కవ్వింపుల వ్యవస్థ
తరతరాలుగా ఇదే అవస్థ
చరిత్ర నేర్పిన పాఠాలు
చెవికెక్కని నిర్వాహ గణం
ప్రాణాలే మూల్యంగా గుణపాఠం!

అక్కడ అమృత స్నానాలు
అసువుల గీతాలు పాడాయి
ప్రయాగ్ రాజ్
దు:ఖిత స్థలిగా బావురుమంది
మౌని అమావాస్య
బతుకు చీకట్లను చిమ్మింది
త్రివేణి సంగమం
ఆధ్యాత్మిక గమనం వీడి
ఆర్తనాదాల ఆగమనం అయ్యింది
కిక్కిరిసిన జన తొక్కిసలాట
కుంభమేళ సంబురాన్ని మింగింది
విషాద శ్లోకమై శోకమై నిలిచింది!

శూన్యమైన ఏర్పాట్ల నడుమ
చెత్తడబ్బాలు సైతం వెక్కిరించాయి
దైవ చింతన సామూహికంగా కన్నీరొలికింది..!

– డా.కటుకోఝ్వల రమేష్
99490 83327

సాహో ...

నేల గర్భం పండిస్తున్న నాగలి
కవిత్వం రాస్తున్న కవి లేఖ్యం
ఒక్కక్క విత్తనం ఒక్కక్క అక్షరం
ఒక్కొక్క చాలు ఒక్కొక్క వాక్యం
ఒక్కొక్క మొక్క ఒక్కొక్క పద్యం
ఒకరిది ప్రత్యక్ష శ్రమ
మరొకరిది పరోక్ష పటిమ
వాడిది –
అదే క్షుద్ర మాంత్రిక చక్రవర్తిది
అన్నం ముద్ద లాక్కోవడం
ఆలోచనపై లాఠీ ఝుళిపించడం
కొయ్యగుర్రం మీద
కోటి స్వప్నాల్ని కాలరాస్తూ
ఓహో అంటూ స్వారీ చేయడం
ఊరూరు ఊరేగుతూ
మాటలనుకునే
మాయ మరమరాలు వెదజల్లడం !
అయితే
కృషీవలుడూ కవిశ్రేష్ఠుడూ
ఇరువురూ వాణ్ణి –
గండికోటలో
ఎండమావుల నీటి మోసగాణ్ణి
ఆలస్యంగానైనా
పడమటి కొండల్లోకి వాలిపోయే పొద్దులోకి తోచేస్తారు
ఎప్పటికైనా
వంగే నింగి సూర్యుడిలోకి తొక్కేస్తారు
సాహో!
ప్రజలే ఉషోదయం తెస్తారు!

– రవి నన్నపనేని
91821 81390

సంధి చర్చలు

అహంకార పీఠమేసుకొని
ఆర్తనాదాలతో ఆనందిస్తూ
మృత్యు విహంగాలతో
మరణ మృదంగాలను మోగిస్తున్నారు కదరా?

మర మనుషుల్లా మారి
మానవత్వాన్ని మంటల్లో కాల్చి
కళేబరాల కమురు వాసనలతో
సహవాసం చేస్తున్న స్వార్థపరులారా!

మీ మూర్ఖత్వం తృప్తి చెందేదాకా
అప్పగింతలు నచ్చక ఒడంబడిక కుదరదంటారా?
సంధి కోసం సమాధులపై కూర్చుంటారా?
సమరం సర్వనాశనమని తెలియదా?
మీ వ్యాపార యావ తీరాక కదరా
ఈ యుద్ధ యవ్వారం తేలేది?
అందాక ఈ ఆక్రందనలతో
మీ ఆకలి ఆసాంతం తీర్చుకోండి
మీ అశాంతిని ప్రపంచమంతా పంచండి
మృత్యు బేహారులై సమస్తం విస్తరించండి

శాంతి, సహనం, సామరస్యాలకు
మేలి ముసుగు తొడిగి రహస్యంగా
సభ్య సమాజంలో సమాధి చేయండి!

– డా.ఎడ్ల కల్లేశ్
98667 65126

పురి వీడిన ప్రజాస్వామ్యం!

నా బొంగరం
సజావుగా తిరగడం మానేసింది!
తాగుబోతు నడుస్తున్నట్టు
ఊగుతూ జోగుతూ సాగుతోంది!
చదునైన నేలమీంచి సర్రున జారిపోయి
గతుకుల్లో గోతుల్లో
గీరెత్తిన కోడిపిల్లలా
గిరాగిరా తిరుగుతోంది!

ముల్లు వంకరగా ఉందేమోనని
ఓర కంటితో వంగి చూద్దును గదా
మట్టిరేణువులు కళ్ళల్లోకి తుళ్ళి
గుడ్ల నీరు బొటా బొటా కారి
తట్టుకోలేక చతికిలబడిపోయాను!
చుట్టూవున్న జనాలు చోద్యం చూస్తున్నట్టు
తమాషాగా చూసుకుంటూ వెళ్తున్నారుగాని
కళ్ళల్లో కాస్త ఊది
ఉపశమనం కలిగిద్దామన్న
ఉద్దేశంలో ఒక్కరూ కనిపించలేదు!

కాసేపయ్యాక నాకు నేనే
తమాయించుకుని
తేరిపార చూద్దును కదా
లోపం తాడులోనే కనిపించింది
కొట్టొచ్చినట్టు!
బిగుతుగా ఉండాల్సిన తాడు
పురి వీడిపోయి, దేనికదే
పీలికలు పీలికలుగా చీలిపోయి
ఒకదానికొకటి పొంతన లేకుండా
చెదిరిపోయి, అక్కడక్కడ
చిక్కులు చిక్కులు పడిపోయి
అస్తవ్యస్తంగా కనిపించింది!

విడిపోయిన పీలికల్ని ఏకంచేసి
తెగిపోయిన పోగుపోగునూ ముడి వేసి
నడుస్తున్న జనాల కదలికన్ని గమనిస్తూ
మళ్లీ తాడు పేనటం మొదలు పెట్టాను!

– పతివాడ నాస్తిక్
94417 24167


అసమానతలపై ధిక్కార స్వరం

సమీక్ష

కుల వివక్షపై, సామాజిక అంతరాలపై కవన కరవాలాలు దూసిన కవుల్లో సతీష్ చందర్, శిఖామణి, ఎండ్లూరి సుధాకర్, మద్దూరి నగేష్‌బాబు, పైడి తెరేష్ బాబు, కలేకూరి ప్రసాద్ తదితరులు ముందువరసలో ఉంటారు. ఆ కోవలోకి వచ్చే కవి డాక్టర్ కోయి కోటేశ్వరరావు. సమాజంలో దళితులపై జరుగుతు్న అన్యాయాలకు ఆగ్రహించి ఆయా సందర్భాల్లో తన పదునైన కవిత్వ బాణాలను ఎక్కుపెట్టారు ఆయన. కోటేశ్వరరావు కవిత్వం నిదురపుచ్చేదీ, మైమరిపించేదీ కాదు; అది ఒక ఆత్మ గౌరవ స్వరం. నిదురలేపే స్వరం. ఆయన తాజాగా వెలువరించిన 'నాగస్వరం' కవితా సంపుటి కచ్చితంగా ఒక ఒక ధిక్కార స్వరం.

ఈ సంకలనంలో సమాజం చేసిన అన్యాయాలకు బలై గావుకేకలు పెట్టిన దళితుల గురించి రాసిన కవితలే అధికం. కవి తన తండ్రిని గురించి 'కొత్త చెప్పులు' కవితలో 'మట్టి మబ్బుల్లో చెమట చుక్కల్ని నాటి/ ఎండి ఎన్నెల్ని బస్తాలకెత్తే/ నల్ల చంద్రుడని' అభివర్ణిస్తాడు. 'అడ్డమైన గొడ్డు చాకిరితో/ ఆరుగాలం అయ్యను పీల్చిపిప్పి చేసే/ దొరగారి దోపిడి గురించి/ పొట్ట పొడిస్తే ఆకలి పేగులు తప్ప/ అచ్చురమ్ముక్క రాని మోటోడని/ బతుకంత బాకీని/ అయ్య ఏలుముద్రకు అంటకట్టిన/ కుట్ర గురించి దండోరా ఏస్తాను' అంటూ రెచ్చిపోతున్న 'అచ్చోసిన ఆంబోతుని/ అడ్డంగా తెగ నరకాల్సిందే/ దీని తోలు వొలిచి/ పగిలిపోయిన అయ్య కాళ్ళకు/ కొత్త చెప్పులు కుట్టాల్సిందే' అని తన తిరుగుబాటు బావుటా ఎగరేస్తారు.

ఈ సమాజంలో దళిత స్త్రీలు అటు సంఘానికీ లోకువే. భర్తకీ లోకువే. ఈ విషయాన్నే 'పత్తిపూవు' కవితలో 'ఊరందరికీ మా అయ్య బానిసైతే/ పాపం అమ్మ, మా అయ్యక్కూడా బానిస...' అని వాస్తవాన్ని చెప్తారు. 'ఆడతనం అంటరానితనాల నడుమ అమ్మ/ రోకలి బండ కింద చితికిన/ దోసబద్దలా రోదిస్తుంది/ ఆకలి మంటల్లో మండుతున్న/ అమ్మ గుండె పుండు మీద/ మొగోళ్ళ పోరంబోకుతనం/ గొడ్డు కారమై వొలుకుతుంది' అని దళిత స్త్రీ బతుకు చిత్రాన్ని ఆవిష్కరిస్తారు. పితృస్వామ్య యుగంలో స్త్రీలకు ఇంటిచాకిరీ తప్పదు. రోగమొచ్చినా, రొష్టు వచ్చినా ఇంటిపని చెయ్యక తప్పదు. పల్లెటూళ్ళలో స్త్రీలైతే తెల్లవారు జామునే లేచి సూర్యుణ్ణి నిద్ర లేపుతారు. దీనిని ఇక్కడ కవితామయంగా 'పడమటి మంచంలో నిద్రబోతున్న/ సూరిగాడిపై చెంబెడు కళ్ళాపి చల్లి/ మా పూరి గుడిసెముందు అమ్మ/ పొద్దుటెండను పారబోస్తుంది' అని చెప్తారు. కవి తన తండ్రిని గురించి వర్ణిస్తూ... 'రాతిని నాతిగా మార్చిన రామపాదం కంటే/ మట్టిని పరమాన్నంగా మలిచిన/ మా అయ్య



పాదమే నాకు ఆరాధ్యం/ గీతోపదేశం కంటే/ మా అయ్య శ్రమోపదేశమే/ ఈ విశ్వానికి శిరోధార్యం' అంటూ శ్రమ తత్త్వాన్ని వెల్లడిస్తారు.

ఈ సంకలనంలో ప్రపంచీకరణ గురించీ, నకిలీ ప్రజాస్వామ్యం గురించీ, మూఢ నమ్మకాల గురించి, మితిమీరిన భక్తి గురించి వర్ణించిన కవితలు ఎన్నో ఉన్నాయి. రాజ్యహింస గురించీ, సావిత్రీబాయిని గురించిన విభిన్న వస్తువులు ఈ సంకలనాన్ని చదివింప చేస్తాయి. మార్చురీ ఉద్యోగి సలీం గురించి రాసిన 'పరమ యోగి' దేన్నయినా కవిత చెయ్యగలిగిన కవి ప్రతిభను వెల్లడిస్తుంది. 'కుష్టురోగిని ఇష్టదైవంగా కొలిచిన మహాతల్లిలా/ కుళ్ళిన శవాలను ప్రాణమిత్రుల వలె/ పరామర్శిస్తావు/ వస్తువులతో కాపురం చేసే ప్రబుద్ధులు/ బతికి ఉన్న మనుషులను శవాలుగా చూస్తుంటే/ శవాలను కూడా మనుషులుగా ప్రేమించే/ కరుణా జలపాతం నీవు' అంటూ ప్రస్తుతించారు. సావిత్రీబాయి పూలే గురించి 'తల్లీ! నిన్ను దలంచి' కవితలో 'ప్రవాహంలో పడి కొట్టుకుపోకుండా/ జ్ఞానశిఖరమై ప్రవాహగతిని మార్చావు / ఆకాశంలో సగం నిండా ఆవరించిన అమావాస్యలను చెరిపేసి/ శూద్రావనిలో సూర్యోదయమయ్యావు/ కేవలం దేవుడి దయవల్ల మనిషి చంద్రమండలం మీద/ అడుగు పెట్టాడని ప్రగాఢంగా విశ్వసిస్తున్నాం/ తిరోగమన తిమిరంలో/ కొడిగట్టి పోతున్న మాకు ఇప్పుడు హఠాత్తుగా ఒక తాత్త్విక చైతన్యం కావాలి / తల్లీ! చదువుల జాబిల్లీ/ మమ్మల్ని నీ పాఠశాలలో చేర్చుకొని పిడికెడు జ్ఞానభిక్ష పెడతావా ప్లీజ్' అని ఆమె జీవిత రేఖాచిత్రాన్ని గీస్తారు.

సమాజంలో రాను రాను మూఢభక్తి పెరిగిపోతుంది. పాలకులే పనిగట్టుకొని దీనిని ప్రమోట్ చేస్తున్నారు. బాబాల పాదధూళి కోసం వెళ్ళి ప్రాణాలు పోగొట్టుకొన్న జనం గురించి 'యథారాజా తథా బాబా'లో 'చిటికెడు పాదధూళికోసం/ చెలరేగిన మూర్ఖపోరాటానికి/ పుట్టిన సామూహిక చావులు/ గుప్పెడు ఓట్లకోసం పడిన కక్కుర్తి/ అజ్ఞాన మూర్తులతో అంటకాగితే/ బజారుకో బాబా/ వీధికో ఫాదర్/ పేటకో మౌజన్ ప్రత్యక్షం/ ఆటంబాంబు కంటే/ గుడ్డి నమ్మకం అత్యంత ప్రమాదకరం/ యుద్ధం కంటే మౌఢ్యమే మహానష్టదాయకం' అని ప్రకటిస్తారు. సంకుచిత మనస్కుడైన మనిషి స్వేచ్ఛగా ఎగిరే పక్షులకు కూడా కులం రంగును అంటగడతాడు. కోయిల పాడుతుందని గాయని కిరీటం దాని నెత్తిమీద పెట్టారు. కాకిని మాత్రం మాల కాకిగా మారుస్తారు. కాకి సహజంగా నలుపు.. ఈ వివక్షపై సంధించిన అస్త్రమే 'మహాకవి' కవిత. ఈ కవి స్త్రీల పక్షపాతి. 'గొంతు తెగిన ఓ కోయిల'లో అన్యాయానికి గురైన విద్యార్థినిని పరామర్శిస్తారు. 'ప్రేమించలేదని ప్రేమించిన అమ్మాయి మీద దాడి చేయడం ఎంత నరకం/ రాక్షసత్వం! 'ఇప్పుడు మళ్ళీ ప్రేమోన్మాది గారిని కాదన్నందుకే/ కుండపోతగా కురిసిన యాసిడ్ వర్షం' అని అంటారు కవి.

ప్రపంచంలో యుద్ధాలను ఎగదోచే అమెరికా అహంకారాన్ని ఖండిస్తూ 'ఆధునిక వామనుడు' కవితలో 'యుద్ధరంగం వాడికొక రతిక్రీడ/ కాలకృత్యం తీర్చుకున్నంత సులభంగా/ యుద్ధం చేసి/ శ్మశానంలో ప్రజాస్వామ్య మంత్రాన్ని జపిస్తాడు/ ఒక్క చమురు బొట్టుకోసం లెక్కలేనన్ని రక్త సముద్రాల్ని పొంగిస్తాడు/ కుడిచేతితో శాంతి పావురాన్ని ఎగరేసి/ ఎడమచేతితో దాన్ని కాల్చి చంపే/ వృత్తి వేటగాడి హింసా ప్రవృత్తిని/ చెట్టుకీ పుట్టకీ పిట్ట కథలుగా చెప్పాలి' అని అగ్రరాజ్యం యుద్ధోన్మాదాన్ని, హింసా స్వభావాన్ని ఎండగడ్తారు. ఇంకా ప్రజాస్వామ్యం ముసుగులో నియంతృత్వం ప్రదర్శించే పాలకులను నిలదీస్తూ రాసిన ఎన్నో శక్తివంతమైన కవితలున్నాయి ఈ సంపుటిలో. ప్రజలు ఏమి తినాలో, ఏమి మాట్లాడాలో రాజ్యం నిర్ణయిస్తుంది. మతోన్మాదాన్ని పెంచిపోషిస్తుంది. వీటన్నిటిపై తన ధిక్కారాన్ని తెలుపుతూ 'కాలసర్పం' కవితలో 'నా కంచంలో బువ్వ మీద/ నేను నడిచే తొవ్వమీద/ నిషేధాజ్ఞల్ని జారీ చేస్తుంది కాలసర్పం/ ధిక్కరించే ఉక్కు పిడికిళ్ళను/ ప్రశ్నించే సిరాచుక్కలను పాశవికంగా తెగనరుకుతుంది కాలసర్పం' అంటారు. ఈ నేలలో పుట్టిన ముస్లింలపై అకారణ ద్వేషాన్ని చూపించడాన్ని 'ఈ మట్టిలో మొలకెత్తిన/ ఆకుపచ్చని నెలవంకలపై/ కారుచీకట్లను కుమ్మరిస్తుంది' అని తన ఆగ్రహాన్ని ప్రకటిస్తారు. అంబేద్కర్ ఆశయాలను గౌరవించకుండా విగ్రహానికి మాత్రం దండలు వెయ్యడాన్ని పదునైన వాక్యాల్లో నిరసిస్తారు. 'జగమంతా విద్వేషాగ్ని రగిలించి/ ఓటు ఫిడేలు వాయిస్తుంది కాలసర్పం/ త్రివర్ణ పతాకం ఊర్ధ్వవర్ణంలో/ మనువు రాసిన వాక్యంలా/ మహావంకర్లు పోతుంది కాలసర్పం' అని కుటిల నీతిపై కత్తి దూస్తారు. 'నిరంతరం మతోన్మాదాన్ని జపించే/ అగ్నిగుండం అదును చూసి ఇప్పుడు/ ఆర్థిక తీవ్రవాద దాహంతో ప్రజ్వలిస్తుంది/ గుండెనిండా పడమటి గాలుల్ని శ్వాసిస్తూ/ అంటరాని చెమట చుక్కలకు/ అన్నం మెతుకుల్ని నిషేధిస్తుంది' అంటారు. 'నిప్పుకణాలను రగిలించి/ ధమ్మపథంలో భీమరాజ్యాన్ని లిఖిద్దాం!' అని ఆశాభావం వెల్లడిస్తారు.


ఈ నాగస్వరం నిండా సంప్రదాయ సమాజాన్ని ధిక్కరించే తుపాకీ తూటాలు, కొరడా దెబ్బలు, సూదిపోట్ల వంటి కవితలు చాలా ఉన్నాయి. 'దివ్య నక్షత్రం' పేరిట ప్రొఫెసర్ సాయిబాబా గురించి రాసిన కవితలో 'ఆయుధం లేకుండా/ నెత్తురుబట్టు రాలకుండా/ ఒక్క సిరాచుక్క తోనే/ మృత్యు 'ఉపా'ఖ్యానం రాసిన మహా హంతకులు' అని పాలకులకు చెంప చెళ్ళుమనిపిస్తారు. ఈ సంకలనం చదివాక పాఠకులు రాజ్యం క్రూర స్వభావానికి ఆగ్రహంతో రగిలిపోతారు. 'ఏ సాహిత్య ప్రక్రియ ఐనా కానివ్వండి. నిన్ను అది ఏదో రూపంలో డిస్టర్బ్ చేయాలి' అంటాడు ఓ.వీ.విజయన్. అలా పాఠకుణ్ణి డిస్టర్బ్ చేస్తుంది కోయి కోటేశ్వరరావు 'నాగస్వరం.'

– మందరపు హైమవతి
94410 62732

లెనిన్ గురించి ఒక స్వాప్నికుడి జీవిత కథ

నా రచన

లెనిన్ గురించి ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. ప్రపంచవ్యాప్తంగా గల దోపిడీ, పీడన, అణచివేత, వంచన, వగైరా వివక్షలకు గురవుతున్న వివిధ సెక్షన్లకు చెందిన కోట్లాదిమంది జనాలకు ఆయన దేశ, కాలావధుల్ని దాటి మరీ స్ఫూర్తి ప్రదాత, స్మరణీయుడు. లెనిన్ మరణించి వంద సంవత్సరాలు దాటినా, ఆయనింకా శ్రామిక జనాల గుండెల్లో సజీవంగా నిలిచి వున్నాడు. ఇప్పటికే కాదు, ప్రపంచంలో ఇంకా ఏ రూపంలో వివక్ష నిలిచి ఉన్నా, దానికి గురయ్యే జనాల గుండెల్లో ఆయన నిలిచే ఉంటాడు. ప్రపంచంలో ప్రప్రథమ సోషలిస్టు రాజ్య స్థాపకునిగా మాత్రమే ఆయన ప్రాముఖ్యత పరిమితం కాదు. ఆ సోషలిస్టు రాజ్యాన్ని కమ్యూనిస్టు రాజ్యంగా తీర్చిదిద్దే ప్రయత్నంలో ఆయన పలు అడుగులు ముందుకు వేశాడు కూడా. ఆ ప్రయత్నంలో ఉండగానే ఆయన చనిపోయాడు.



మార్క్స్ కాలం నాటికి పూర్వం ఉన్న పలువురు మేధావులు సర్వమానవుల శ్రేయస్సు కోసం పరితపించారు. అసమానతలు లేని, మానవులంతా సుఖసంతోషాలతో విలసిల్లే ఒక నూతన సమాజం కోసం వారు అన్వేషించారు. అలాంటి సమాజాన్ని ఏర్పరచడం కోసం వారిలో ఎవరికి వారు రకరకాల సిద్ధాంతాలను ప్రతిపాదించారు. అయితే అవేవీ శాస్త్రీయ ఆధారాల మీద నిలబడేవి కానందున ఆచరణయోగ్యం కాక, కేవలం ఊహాజనిత వాదాలయ్యాయి. అలాంటి పరిస్థితుల్లో జర్మనీకి చెందిన తాత్విక మేధావి కార్ల్‌మార్క్స్ వారి భావాలు నిజం చేసేందుకు సుదీర్ఘకాలం పరిశోధనలు చేసి, తన నాటికి బాగా అభివృద్ధి చెందిన జర్మన్ తాత్విక భావాలు, ఫ్రెంచి విప్లవ సిద్ధాంతాలు, బ్రిటన్ కార్మిక పోరాటాల అనుభవాలు కలబోసి, ఒక ఆచరణ యోగ్యమైన, శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. దోపిడీ, అణచివేత లేని సమాజం కావాలంటే, సంఖ్యాధిక్యం కలిగిన బలహీన శక్తులు తమను దోపిడీ చేసే బలమైన శక్తుల్ని ఐకమత్యంగా ఢీ కొనాలని, అందుకోసం అవి సాయుధ విప్లవ పోరాటం చెయ్యాలని చెప్పాడు. ఈ సిద్ధాంతం సహేతుకంగా ఉండటం వల్లనే, దీనికి మానవజాతి విముక్తి సిద్ధాంతంగా పేరొచ్చింది. ఈ సిద్ధాంతాన్ని మార్క్స్ ప్రతిపాదించడంతో, దీన్ని మార్క్సిజం అన్నారు. పారిశ్రామికం గా అభివృద్ధి చెందిన దేశాల్లోనే మార్క్స్ ప్రతిపాదించిన కార్మికవర్గ విప్లవం విజయం సాధిస్తుందని సోషల్ డెమోక్రాట్లు భావించారు. ఆ లెక్కన అది నాడు పరిశ్రమలు బాగా అభివృద్ధి చెంది, అక్కడి కార్మికులు రాజకీయంగా కూడా అభివృద్ధి చెందిన జర్మనీ దేశంలో మొదట ఈ విప్లవం విజయం సాధించాలి. కానీ అందుకు భిన్నంగా, పారిశ్రామికంగా వెనుకబడి ఉన్న రష్యాలో అది లెనిన్ నేతృత్వాన విజయవంతం అయింది.

లిలిలి

లెనిన్ జీవిత చరిత్ర రచన చాలా క్లిష్టమైన రచన. ఆయన జీవిత చరిత్ర ఘట్టాలు పూర్తిస్థాయిలో లిఖితమైలేవు. ఆయన ప్రచారానికి ఎల్లప్పుడూ ఆమడదూరంలో ఉన్నాడు. అంచేత ఆయన మరణానంతరమే పార్టీ పనుపున ఆయన కుటుంబ సభ్యులు, పార్టీ కామ్రేడ్లు కొన్ని వివరాలు, స్మృతుల రూపంలో రాశారు. ఆయన తన కుటుంబ సభ్యులకు, మిత్రులకు, కామ్రేడ్లకు కూడా కొన్ని లేఖల్ని రాశాడు. వాటిలో కొన్ని నశించిపోగా, కొన్ని దొరుకుతున్నాయి. వాటివల్లే ఈ మాత్రమైనా ఆయన జీవిత విశేషాలు తెలిసే అవకాశం ఏర్పడింది. పార్టీపరంగా ఆయన మరణానంతరం ఆయన సంక్షిప్త జీవిత చరిత్ర ప్రకటించారు గానీ, దాని ద్వారా ఎక్కువ విషయాలు తెలియడం లేదు. అందుకోసం ఆయన రాసిన వివిధ రచనలు, ఆయనపై వచ్చిన వివిధ రచనలు, స్టాలిన్ రాసిన బోల్షివిక్ పార్టీ చరిత్ర; తెలుగులో, ఆంగ్లంలో లభిస్తున్న రకరకాల సమాచారం ఆధారంగా చేసుకుని ఒక సమగ్ర పరిశోధక ప్రాజెక్టుగా ఈ గ్రంథ రచనను చేపట్టి పూర్తి చెయ్యడం జరిగింది.

మొదట ఈ రచనను కేవలం ఆయన రచనలు, పార్టీ నిర్మాణం, విప్లవ విజయం, ప్రభుత్వ స్థాపన, పాలన వంటి అంశాలతో కూడిన పూర్తిస్థాయి రాజకీయ జీవిత చరిత్రగా రాయాలనుకుని ఇంతకంటే పెద్దగా ఒక బృహద్గ్రంథాన్ని సిద్ధం చేశాను. ప్రస్తుతకాలంలో ఇలాంటి భారీ రాజకీయ గ్రంథాన్ని పాఠకులు ఆదరించరేమోనన్న ఆలోచన వచ్చి, రాజకీయాంశాలు తగ్గించి, ఆయన కృషిని వివరించే 22 కథలతో కలిపి ఈ రచనను ప్రచురిస్తున్నాను. ఆయన గావించిన రాజకీయ కృషి ఆధారంగా కథలు రాయడానికి ప్రధాన ప్రేరణ ప్రసిద్ధ రష్యన్ రచయిత శ్చెద్రీన్ కాగా, కొంతవరకు 'లెనిన్ జీవిత కథ' రాసిన 'మరీయ ప్రిలెజోయెవా'. ఇంకా ఈ రచనకు అమెరికన్ జర్నలిస్టులైన జాన్‌రీడ్, ఆల్బర్ట్‌రీస్ విలియమ్స్‌ల రచనలు, కూడా కొంత వరకు ఉపకరించాయి.

ఎన్ని గ్రంథాలు, రచనలు, వెబ్‌సైట్లు ఉపకరించినా, స్వీయ పరిశోధనతో అనేక వాస్తవాంశాలను కూడా ఇందులో చేర్చాను. అంచేత ఈ రచనను 'లెనిన్ సంపూర్ణ జీవిత చరిత్ర'గా పేర్కొనడం జరిగింది. ఆయన జీవితంలో ఎదురైన 'అన్ని' అంశాలు ఇందులో ఉన్నాయనడం కూడా సత్యదూరమే. సంక్షిప్త రచనలు తెలుగులో ఉన్నందున, వాటి పరిమితిని, అలాగే దీని విస్తృతిని తెలిపేందుకే దీన్ని 'సంపూర్ణ జీవిత చరిత్ర'గా పేర్కొన్నాను. ఈ గ్రంథంలో లెనిన్ జీవితంలోని ముఖ్య ఘట్టాలు, ఆయన రచనలు సంక్షిప్త పాఠాలు, పార్టీ నిర్మాణం, విప్లవ పోరాటం, ప్రభుత్వ స్థాపన పాలన, అంతర్యుద్ధం ముఖ్య ఘట్టాలు, మూడో ఇంటర్నేషనల్ స్థాపన, ఆయన అంతిమ ఘడియలు వగైరా అంశాలన్నీ వివరంగా ఉన్నందున, ఈ రచన అభిమానులకు, సామాన్య కార్యకర్తలకు, అందరికీ కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

(ఒక స్వాప్నికుడి జీవిత కథకు రచయిత రాసుకున్న ముందు మాట నుంచి కొంత భాగం)

– నాగభూషణ్
94934 74836



'మూల్యం'లో దృశ్యాలు



'పేగు రాసిన శాసనం'లో దృశ్యం

ఆరు నాటికలు .. ఆరు ఇతివృత్తాలు

రంగస్థలం

నాటకాల్ని పరిషత్తులే బతికిస్తున్నాయనేది ఓ బలమైన వాదన. వాస్తవానికి పరిషత్తులే నాటకాన్ని నీరుగారుస్తున్నాయనే అభిప్రాయం కూడా గట్టిగానే వినిపిస్తుంటుంది. 'బహుమతుల ఎంపికకు అత్యధికులు అంగీకరించే శాస్త్రీయ.. నిర్దిష్ట ప్రమాణాలేవీ' అనేది దీర్ఘకాలంగా వినిపిస్తున్న ఆక్షేపణే. అందుకేనేమో ఈసారి 'తపస్వి...' నిర్వాహకులు 'ఉత్సవాలే' నిర్వహించారు. అయితే పరిషత్తుల్లో ప్రదర్శించేంత 'సీరియస్నెస్' ఉత్సవాల్లో కానరాదు వంటి అభిప్రాయం పూర్తి అసంబద్ధంగా కొట్టిపారేయలేమనిపించింది– ఒకటి రెండు ప్రదర్శనలు చూశాక. ఎంతో ఉత్సాహంతో వచ్చిన కళాకారులు కొంత నిరుత్సాహం వ్యక్తంచేశారు. జనవరి 27, 28 29 తేదీల్లో విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో– తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఆంధ్ర నాటక కళా సమితి, కొడాలి బ్రదర్స్ సంయుక్త ఆధ్వర్యంలో.. తెలుగు రాష్ట్రాల స్థాయిలో– రోజుకు రెండు చొప్పున ఆరు వైవిధ్య ఇతివృత్తాల నాటికలను ప్రదర్శింపజేశారు. చాలావరకు మంచి నాటికలనే ఎంపిక చేశారని నిర్వాహకులను పలువురు అభినందించారు.



ఓ కాశీ వాసీ రావయ్యా నాటికలో ఓ ఆసక్తికర సన్నివేశం

మూల్యం : అన్ని రంగాల్లో పురోగమిస్తున్న స్త్రీ– వివాహమైనంత మాత్రాన తన దేహం మీద సర్వహక్కుల్నీ ఎలా, ఎందుకు ఒదులుకోవాలి అని తీవ్రంగా, నిశితంగా నిరసించి.. న్యాయస్థానాన్ని నిలదీసి మరీ సాధించుకున్న స్త్రీమూర్తి స్ఫూర్తిదాయక ఉదంతం ఇతివృత్తంగా సాగిన నాటిక 'మూల్యం'. లింగ అసమానతనూ దుర్విచక్షణనూ, హక్కుల హననాన్నీ నాటిక సహేతుకంగా, శక్తిమంతంగా ఎండగట్టింది. 'ఆడ పుట్టుక మీద వివక్ష.. భర్తకు అనంత అధికారమిచ్చిన పెళ్లి.. అర్థంపర్థం లేని నిబంధనలతో చట్టాలు చేసిన ప్రభుత్వం... వీరంతా హంతకులే! నా శరీరంలోని అవయవాల మీద హక్కు ముమ్మాటికీ నాదే.. ముమ్మాటికీ నాదేనని నిరూపించుకోవడానికి నేను ఎంత 'మూల్యం' చెల్లించుకోవాల్సి వచ్చిందో మీకు తెలుసా? అమూల్యమైన మా నాన్న ప్రాణాలు– నాన్నా' అంటూ జ్యోతిరాణి భీశెట్టి కూలబడిన పతాక సన్నివేశం ప్రేక్షకుల్ని స్థాణువులజ్జేసింది. నాటిక రచనల పోటీల్లో (ఈ నాటిక సహా) పలుమార్లు ప్రథమ బహుమతి అందుకున్న సింహప్రసాద్ రచనను డా. వెంకట్ గోవాడ సమర్థ దర్శకత్వంలో గోవాడ క్రియేషన్స్, హైదరాబాద్ బందం ప్రశంసనీయంగా ప్రదర్శించింది.

గురి తప్పిన వేట : ఓ తాగుబోతు కోటీశ్వరుడి నుంచి డబ్బు సంపాదించే కుటిల బుద్ధితో– అతి వినయం నటించి.. ఆపదను సైతం మీద వేసుకుని మరీ... డ్రైవర్‌గా చేరాలనుకున్న ఓ నయవంచక యువకుడి వేట గురి తప్పిన వైనాన్ని రసఝరి, పొన్నూరు కళాకారులు ప్రదర్శించారు. మూలకథ : శ్రీసుధ మోదుగ, నాటకీకరణ: పిన్నమనేని మృత్యుంజయరావు.. దర్శకత్వం వై ఎస్ కృష్ణేశ్వరరావు. (తొలి ప్రదర్శనలో లేని) ముగింపు స్టిల్, దానికి ముందు హీరోయిన్ డాన్స్ బిట్స్ సందర్భోచితమనిపించలేదని పలువురు సీనియర్ కళాకారులు భావించారు. కారెక్టరైజేషన్‌లో మరింత సమంజసత్వాన్నీ పాత్రోచిత నటనలో మరింత పర్ఫెక్షన్నూ ఆశిస్తారు ప్రేక్షకులు. నెగిటివ్ రోల్‌లో భాగ్యరాజ్ పాత్రోచితంగా నటించారు.

మహాప్రస్థానం : పేదరికం కష్టాల నుంచి బయటపడేందుకు డబ్బు సంపాదనకై ఇతర దేశాలకు తరలిపోతున్న వారి ఈతిబాధల్ని, అత్యంత దయనీయ పరిస్థితుల్ని కళ్లక్కట్టే ప్రయత్నం చేశారు తపస్వి, విజయవాడ కళాకారులు. 'మహా ప్రయాణం', 'భస్మీపటలం' అర్థాలకు నాటిక టైటిల్ 'మహాప్రస్థానం' సమన్వయం సాధించింది. చావుకీ ప్రయాణానికీ అర్థం చెదిరిపోతోందంటారు రచయిత ఎం.సంజీవి. దర్శకత్వం పిల్లా నటరాజ్.

ఓ కాశీవాసా, రావయ్యా : మానవత్వపు విలువలు మృగ్యమవుతున్న నేపథ్యంలో ఎవరి తలకి వాళ్లే కొరివి పెట్టుకునే ఓ రోజు వస్తుందేమోనని భయం వ్యక్తంచేస్తూ అలాంటి దౌర్భాగ్యం సంభవించకూడదని రచయిత పి.టి.మాధవ్ ప్రగాఢంగా అభిలషిస్తారు. ఏ ఒక్కడూ నలుగురిని దూరం చేసుకోకూడదు.. ఏ నలుగురు ఒక్కడినీ ఒంటరి చేయకూడదు అనే సందేశమిచ్చిన నాటికను కళాభినయ, విశాఖపట్నం బృందం కవి ప్రసాద్ దర్శకత్వంలో ప్రేక్షకుల్ని ఆద్యంతం కట్టిపడేసింది.

ఇది అతని సంతకం : జీవితాంతం నిబద్ధతతో కూడిన విలువలకు, ప్రమాణాలకు కట్టుబడి– చరమాంకంలోనూ తమ దంపతులు ఆ ఆదర్శాలను కొనసాగించితీరాలని బలంగా చిత్రించుకుని.. పరిపూర్ణ జీవి 'కృష్ణమూర్తి' చేసిన సిగ్నేచరే 'ఇది అతని సంతకం'. 'స్నిగ్ధ' రచనను అభినయ ఆర్ట్స్, గుంటూరు వారు ఎన్.రవీంద్రరెడ్డి దర్శకత్వంలో మెచ్యూర్డ్‌గా ప్రదర్శించారు.

పేగు రాసిన శాసనం : పేగుబంధం పేరుతో పబ్బం గడుపుకునే స్వార్థ సంతానానికి కనువిప్పు కలిగించేలా– అర్థంపర్థం లేని అసంబద్ధ ప్రేమలతోనే కొట్టుకుపోకుండా అమ్మానాన్నలు చిట్లిన తమ పేగులతోనే కొత్త శాసనం రాయాలంటారు రచయిత డా. చింతకింది శ్రీనివాసరావు. అయినవారే అసలు సంతానం.. సొంతవారయినా కానివారయితే అలాగే చూడాలని ప్రబోధించిన 'పేగు రాసిన శాసనం' నాటికను గంగోత్రి, పెదకాకాని కళాకారుల ప్రదర్శన ఈడిగ్గా సాగింది.

ఇంకెన్నాళ్లీ ఇబ్బంది?

హనుమంతరాయ గ్రంథాలయం మైక్ సిస్టమ్ తరచూ తీవ్ర ఇబ్బంది పెడుతోందని ప్రదర్శకులూ ప్రేక్షకులూ ఎంతగా వాపోతున్నా థియేటర్ యాజమాన్యానికి చీమకుట్టినట్టయినా ఉంటే ఒట్టు. తపస్వి నాటకోత్సవాల్లో సైతం కొన్ని నాటికలను మైక్ సిస్టమ్ ఇబ్బంది పెట్టింది. ఇటీవలే థియేటర్‌ను ఆధునీకరించారు. అయినా రీ సౌండ్‌తో మైక్ సిస్టమ్ తలనొప్పి కొనసాగుతోంది. ఇకనైనా కళాకారుల, కళాభిమానుల ఆవేదన గ్రంథాలయం పాలకవర్గం పట్టించుకోవాలి.

– జి.వి.రంగారెడ్డి, సీనియర్ పాత్రికేయులు
99126 15747

చంద్రచూడ్ ఇంటికి మోడీ వెళ్లకూడదు

- జస్టిస్ హృషికేశ్ రాయ్

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు మాజీ సిజెఐ డివై చంద్రచూడ్ ఇంటికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెళ్లకుండా ఉండాల్సిందని జస్టిస్ హృషికేశ్ రాయ్ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా తాజాగా పదవీ విరమణ చేసిన జస్టిస్ హృషికేశ్ రాయ్ తన పదవీ విరమణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఈ సంఘటన ప్రధాన న్యాయమూర్తి వ్యక్తిగత కార్యక్రమం. వాస్తవానికి ఈ దృశ్యాలు కొంత కలవరపెట్టేలా కనిపించాయి. కానీ గతాన్ని పరిశీలిస్తే, దానిని నివారించవచ్చని నేను నమ్ముతున్నా' అని అన్నారు. అదే విధంగా ఒకవేళ మీడియా కవరేజ్ లేకుండా ఈ సమావేశం ప్రైవేట్‌గా జరిగి ఉంటే ఆందోళనలను రేకెత్తించకపోవచ్చని జస్టిస్ హృషికేశ్ రాయ్ అభిప్రాయపడ్డారు. 'ఈ కార్యక్రమం పూజాగది నుంచి ప్రజల దృష్టికి వెళ్లి అనవసరమైన ఊహాగానాలను సష్టించే సమస్యకు దారి తీసింది' అని అన్నారు. అయితే ఈ సమావేశంలో ఇద్దరూ కూడా కోర్టుకు సంబంధించిన ఎలాంటి విషయాలను చర్చించలేదని, న్యాయమూర్తి నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం జరుగలేదని తాను నమ్ముతున్నట్లు చెప్పారు. 'జస్టిస్ చంద్రచూడ్ పూర్తిగా నిజాయితీపరుడు. దానిని చెప్పడానికి నాకు ఎలాంటి సంకోచం లేదు' అని జస్టిస్ రాయ్ అన్నారు.

జస్టిస్ డివై చంద్రచూడ్ నివాసంలో జరిగిన గణపతి పూజా కార్యక్రమంలో ప్రధాని మోడీ పాల్గొనడంపై అప్పట్లో వివాదం చెలరేగిన సంగతి తెలిసిందే.

భారత్‌కు గ్యాంగ్‌స్టర్ జోగిందర్ గ్యోంగ్

న్యూఢిల్లీ : కరుడుగట్టిన నేరగాడు, గ్యాంగ్‌స్టర్ జోగిందర్ గ్యోంగ్‌ను ఎట్టకేలకు భారత్‌కు రప్పిస్తున్నారు. ఫిలిప్పీన్స్ నుంచి బ్యాంకాక్ మీదుగా గ్యోంగ్‌ను ఢిల్లీకి తీసుకువస్తున్నట్లు సిబిఐ అధికారులు తెలిపారు. సిబిఐకు చెందిన గ్లోబల్ ఆపరేషన్స్ సెంటర్ నిరంతరాయంగా ప్రయత్నించి గ్యోంగ్‌ను భారత్‌కు రప్పించడంలో విజయవంతమైంది. హర్యానా స్పెషల్ టాస్క్‌ఫోర్స్, సిబిఐ సంయుక్త అభ్యర్థన మేరకు జోగిందర్ గ్యోంగ్‌ను భారత్‌కు అప్పగించాలని ఫిలిప్పీన్స్‌కు ఇంటర్‌పోల్ రెడ్ నోటీస్ జారీచేసింది. దాంతో ఫిలిప్పీన్స్ అధికారులు జోగిందర్ గ్యోంగ్ భారత పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని సిబిఐ ఒక ప్రకటనలో వెల్లడించింది. గ్యాంగ్‌స్టర్ జోగిందర్ గ్యోంగ్‌పై భారత్‌లో దోపిడీ, హత్య, హత్యాయత్నం, కిడ్నాప్ తదితర కేసులు ఉన్నాయి. జోగిందర్ గ్యోంగ్ సోదరుడు సురేందర్ గ్యాంగ్ 2017లో పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. సోదరుడి మరణానికి ప్రతీకారంగా జోగిందర్ గ్యోంగ్ గ్యాంగ్‌స్టర్‌గా మారాడు. అనంతరం 2023లో నేపాల్ మీదుగా ఫిలిప్పీన్స్‌కు పారిపోయాడు. ఇంటెలిజెన్స్ సాయంతో గ్యోంగ్ ఫిలిప్పీన్స్‌లో ఉన్నట్లు తెలుసుకున్న సిబిఐ అధికారులు.. అక్కడి అధికారులతో మాట్లాడి భారత్‌కు రప్పిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ జోగీంద్ర గ్యోంగ్ హర్యానా రాష్ట్రం కైతాల్‌లోని గ్యోంగ్ గ్రామ నివాసి. అతడిని జోగా డాన్ అని కూడా అంటారు. అతనిపై హర్యానా, పంజాబ్, ఢిల్లీ, యూపీలో పలు తీవ్రమైన కేసులు ఉన్నాయి. ఒక్క కైతాల్‌లోనే జోగిందర్ గ్యోంగ్‌పై 17 కేసులు నమోదయ్యాయి.


రాందేవ్ బాబాకు కేరళ కోర్టు షాక్

- నాన్‌బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ
- పతంజలి ఎమ్‌డి బాలకృష్ణకు కూడా..

న్యూఢిల్లీ : పతంజలి ఆయుర్వేద సంస్థ వ్యవస్థాపకులు, యోగా గురువు రాందేవ్ బాబాకు కేరళలోని జిల్లా కోర్టు షాకిచ్చింది. బాబాతో పాటు, ఆ సంస్థ ఎండి ఆచార్య బాలకృష్ణలకు నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. పతంజలికి చెందిన దివ్య ఫార్మసీ వైద్యవిధానాలపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు, తప్పుడు ప్రచారాల నేపథ్యంలో కేరళ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేశారు. దీనిపై పాలక్కాడ్ జిల్లా కోర్టు విచారణ నిర్వహిస్తోంది. ఈ నెల 1న విచారణకు హాజరు కావాలని న్యాయస్థానం ఆదేశించగా వారిద్దరూ హాజరు కాలేదు. దీంతో బాబా రాందేవ్, బాలకృష్ణలపై కోర్టు తాజాగా అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఈ నెల 15న తిరిగి విచారణ చేపట్టనున్నట్లు వివరించింది. విచారణకు హాజరు కోసం ఇద్దరిపై అరెస్టు వారెంట్ జారీ చేసింది. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వాణిజ్య ప్రకటనల నేపథ్యంలో ఇప్పటికే పతంజలికి చెందిన 10 దివ్య ఫార్మసీ ఉత్పత్తుల తయారీ లైసెన్స్ రద్దయిన విషయం తెలిసిందే. ఆయుర్వేద ఉత్పత్తులతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ రాందేవ్ బాబాపై దేశంలోని పలు వైద్య సంఘాలు ఇప్పటికే ఆగ్రహాన్ని వ్యక్తం చేసిన విషయం విదితమే. తాజాగా కోర్టు తీర్పుతో మార్కెట్‌లోనూ పతంజలి విశ్వసనీయత దెబ్బతిని నష్టపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

గిరిజన వ్యవహారాల శాఖను ఉన్నత కులాల వారికి ఇవ్వాలి

- కేంద్ర మంత్రి సురేష్ గోపి వివాదస్పద వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి, కేరళలోని త్రిస్సూర్ ఎంపి సురేష్ గోపి వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. గిరిజన వ్యవహారాల శాఖను ఉన్నత కులాల వారికి ఇవ్వాలని అన్నారు. సినిమాల నుంచి రాజకీయాల్లోకి చేరిన సురేష్ గోపి ఆదివారం ఢిల్లీలో జరిగిన బిజెపి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ ప్రచారంలో మాట్లాడుతూ గిరిజన వ్యవహారాల శాఖను ఉన్నత కులాలు వారు పర్యవేక్షిస్తేనే నిజమైన పురోగతి సాధ్యమవుతుందని అన్నారు. 'గిరిజన సమాజానికి చెందిన వ్యక్తి మాత్రమే ఆ వ్యవహారాల శాఖ మంత్రి అవుతున్నారు. ఇది మన దేశానికి శాపం. గిరిజన సమాజం వెలుపల నుంచి ఒకరిని వారి సంక్షేమం కోసం నియమించాలనేది నా కల. నా భావన. ఒక బ్రాహ్మణుడు లేదా మరొక ఉన్నత కులస్థుడు ఆ శాఖ బాధ్యతలు చేపట్టనివ్వండి. గణనీయమైన మార్పు ఉంటుంది' అని అన్నారు. అదే విధంగా గిరిజన నాయకులకు ఉన్నత వర్గాల సంక్షేమ శాఖ ఇవ్వాలని సురేష్ గోపి సూచించారు. మన ప్రజాస్వామ్య వ్యవస్థలో అలాంటి మార్పు జరుగాలని అన్నారు. అలాగే గిరిజన వ్యవహారాల శాఖను నిర్వహించాలనే తన కోరికను కూడా ఆయన వ్యక్తం చేశారు. ఆ మంత్రిత్వ శాఖను తనకు కేటాయించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కోరినట్లుగా వెల్లడించారు. కాగా, సురేష్ గోపి చేసిన ఈ వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు

- ఎంపి ఆర్. కృష్ణయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చట్టసభల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, బిసి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యులు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంగణంలో బిసి జాక్ జిల్లా అధ్యక్షులు సుందర్ రాజ్ యాదవ్ అధ్యక్షతన 'బీసీల రాజకీయ యుద్ధభేరి' బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభలో కృష్ణయ్య మాట్లాడుతూ.. బిసిలు ఉద్యమ పంథా మార్చాల్సిన అవస రాన్ని గుర్తు చేశారు. జాట్‌లు చేసిన ఉద్యమంతో వారికి రిజర్వేషన్లు దక్కాయన్నారు. అగ్ర కులాల లెక్కలు లేకున్నా రిజర్వేషను పెట్టి వారికి అమలు చేస్తుంటే కోర్టులు జోక్యం చేసుకోవడం లేదన్నారు. బిసిలకు రిజర్వేషన్లు అమలు చేస్తుంటే నిలిపివేస్తున్నాయన్నారు. ఐక్యంగా తెగించి పోరాడితే బిసిలకు రిజర్వేషన్లు పెరుగు తాయన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. ఒకవైపు ఉద్యమం చేస్తూనే మరోవైపు పిల్లల్ని బాగా చదివించాలన్నారు. 75 ఏండ్లలో బీసీ ముఖ్యమంత్రి ఒక్కరూ కాలేదన్నారు.

తమిళనాడులో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేయడం లేదు : రాజ్యసభ సభ్యులు విల్సన్

తమిళనాడులో 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను అమలు చేయడం లేదని రాజ్యసభ సభ్యులు విల్సన్ తెలిపారు. దేశంలో తమిళనాడులో మాత్రమే 69 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్నామని తెలిపారు. 50 శాతం బిసిలకు, 18 శాతం ఎస్‌సిలకు, 1 శాతం ఎస్‌టిలకు రిజర్వేషన్లను అమలు చేస్తున్నామన్నారు.

జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2, 3 శాతం జనాభా లేని కులాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. మనం మేల్కొవాలని, సమయం ఆసన్నమైందని, మీరంతా ఢిల్లీకి వచ్చి కేంద్రానికి హెచ్చరిక చేయాలని తెలిపారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పట్టభద్రులు, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసి అభ్యర్థులకే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సభలో బిసి మండల్ మనుమడు ప్రొఫెసర్ సూరజ్ మండల్, బిసి మేధావుల ఫోరం కన్వీనర్, పూర్వ ఐఎఎస్ అధికారి టి. చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ నౌకల విధ్వంసక క్షిపణిని పరీక్షించిన ఇరాన్

టెహరాన్ : వెయ్యి కిలోమీటర్లు దూరంలో గల ఓడలను చేరుకునే సామర్థ్యం గల యుద్ధ నౌకల విధ్వంసక క్షిపణిని ఇరాన్ శనివారం ప్రయోగించింది. ఈ మేరకు ప్రభుత్వ టివి నివేదిక తెలిపింది. అంటే ఒమన్ పర్షియన్ గల్ఫ్ తీరంలో అమెరికా నావికాదళానికి చెందిన నౌకలను ఈ క్షిపణి చేరుకోగలదు. "ఇది ఘదర్-380 మైల్ టైప్ ఎల్. దీని రేంజ్ వెయ్యి కిలోమీటర్లు. దీనికి జామింగ్ నిరోధక సామర్థ్యం వుంది." అని రివల్యూషనరీ గార్డ్ నావికాదళ అధిపతి జనరల్ అలీ రెజా చెప్పారు. ఇరాన్ దక్షిణ తీర ప్రాంతంలో భూగర్భంలోని క్షిపణి కేంద్రాన్ని వార్తల్లో చూపించారు. అయితే ఈ పరీక్ష ఎప్పుడు జరిగిందనే వివరాలు గానీ, ఆ క్షిపణిక యుద్ధ శీర్షం వుందా లేదా అనే సమాచారం గానీ వెల్లడించలేదు. ఈ క్షిపణి కేంద్రమనేది రివల్యూషనరీ గార్డుకు గల క్షిపణి వ్యవస్థల్లో ఒకటని అలీ రెజా వెల్లడించారు. ఈ క్షిపణులు శత్రువు యుద్ధనౌకలకు నరకం సృష్టించగలవని హెచ్చరించారు. ఇది అత్యంత అధునాతనమైన కొత్త ఆయుధమని మాత్రమే ఆ నివేదిక పేర్కొంది. సెంట్రల్ ఇరాన్‌లోని భూగర్భ కేంద్రం నుండి ఒమన్ సముద్రంలోకి ఈ క్షిపణిని ప్రయోగించారు. ఐదు నిముషాల్లోపే ఈ క్షిపణిని సిద్ధం చేసి, ప్రయోగించవచ్చన్నారు. 2011 నుండి ఇరాన్ ప్రతిసారీ క్షిపణి పరీక్షలతో పాటూ భూగర్భ క్షిపణి కేంద్రాలనూ ప్రారంభిస్తున్నట్లు ప్రకటిస్తూ వస్తోంది. దేశవ్యాప్తంగా ఈ భూగర్భ కేంద్రాలు వున్నాయని, అలాగే వ్యూహాత్మకమైన హోర్ముజ్ జలసంధి తీరం పొడవునా కూడా వున్నాయని తెలిపింది.

వాషింగ్టన్‌కు నెతన్యాహు

- నేడు ట్రంప్‌తో భేటీ ?

జెరూసలేం : అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ కావడానికి ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు ఆదివారం వాషింగ్టన్‌కు బయలుదేరి వెళ్ళారు. గాజాలో దాడుల విషయమై బైడెన్ ప్రభుత్వంతో ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వంతో సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు నెతన్యాహు ప్రయత్నిస్తున్నారు. సోమవారం వారిద్దరి మధ్య సమావేశం జరగవచ్చని భావిస్తున్నారు. ట్రంప్ రెండోసారి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటగా భేటీ కానున్న విదేశీ నేత నెతన్యాహు కానున్నారు. గాజాలో జరిగిన దాడుల్లో తాము తీసుకున్న నిర్ణయాలతో మధ్య ప్రాచ్యంలో పరిస్థితులు ఇప్పటికే మారాయని నెతన్యాహు వాషింగ్టన్‌కు వెళ్లడానికి ముందు విమానాశ్రయంలో వ్యాఖ్యానించారు. తాము తీసుకున్న నిర్ణయాలు, తమ సైనికులు చూపించిన సాహసాలతో మ్యాప్‌ను తిరగరాశాం. కానీ ట్రంప్‌తో సన్నిహితంగా పనిచేస్తే ఈ మ్యాప్‌ను మరింత మెరుగ్గా విస్తరిస్తామని ఆశిస్తున్నామని చెప్పారు. గాజాలో కాల్పుల విరమణ అమలు జరుగుతున్న వేళ, ఈ వారంలో రెండో దశ కాల్పుల విరమణ అమలుకై చర్చలు ప్రారంభమవుతాయని ఆశిస్తున్న వేళ ఈ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది.



మీ కోసం
అలసందలతో వేసే వడలు కరకరలాడాలంటే, అందులో బియ్యపుపిండితో పాటుగా మొక్కజొన్న పిండిని కూడా జోడించాలి.

జీవన సౌరభం
పుస్తకాలనే కాదు మనుషులను కూడా చదవాలి. ముఖ్యంగా మనల్ని మనం చదువుకోవాలి.

అతి గారాబం



సుందరమను అడవి
యుండె
అందు కోతి ఒక్కటుండె
దాని బిడ్డ మర్కటమును
గారాబము చేయుచుండె

ఎవరు చెప్పినను వినదు
దానికి అసలే తోచదు
అది జంతువులన్నింటిని
అల్లరి పెట్టుట మానదు

ఆ అడవిలో ఎలుగు ఉండె
తన దారిన పోవుచుండె
ఆయుర్వేదపు మొక్కలు
దాని చేతులలో నుండె

మర్కటమ్ము దాన్ని గనెను
ఆ మొక్కల లాగుకొనెను
వెంటనె వాటిని అది ఒక
బురదగుంటలో వేసెను

తల్లి ఎంతొ బాధ పడెను
ఎలుగును మన్నించమనెను
అతి గారాబం వద్దని
ఎలుగుయు దానికి
చెప్పెను

తల్లి కోతి ముఖము కనెను
ఎలుగు ఓపికను పట్టెను
కానీ ఆ మర్కటమ్ము
చెడు బుద్ధి మారదయ్యెను

అదియు ఒంటరిగా వచ్చె
గ్రామమందు ఇంట చొచ్చె
వస్తువులను దొంగిలించి
దాని చేతి లోన తెచ్చె

ఇంటి వారు అది చూసిరి
కర్రతో దాని కొట్టిరి
గాయములతో అది రాగ
దాని వెంట బడె ఒక కరి

మర్కటమ్ము పరిగెత్తెను
తల్లి వద్దకది చేరెను
తల్లి దాన్ని ఎలుగు కడకు
వెంట తీసుకొని వెళ్లెను

ఎలుగు దాన్ని మందలించి
మందు లేదని బెదిరించి
కట్టు కట్టె పసరు పూసి
తల్లి బాధ పడుట గాంచి

"చూశావా, పిల్ల కోతి
మొక్కలను తోడ్పడు రీతి
లాక్కొని అవి పారవేయ
నీకు లేదు నీతి భీతి

మర్కటమా! కొంటె పనులు
నీవు చేయకున్న చాలు
మీ అమ్మయు కోరుకొనే
నీ భవితకు అదే మేలు"

ఆ మాటలు మనసు చేరి
దానిలోన మార్పు తెచ్చె
తల్లి ఎంతొ సంత సిల్ల
అది ఇంటికి మరలి వచ్చె!

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
99085 54535.

నేను గీసిన బొమ్మ





పి.జాహ్నవి,
8వ తరగతి,
ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల,
రాజమహేంద్రవరం.

లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న బాక్సులో అడ్డం, నిలువు వరుసలో ఇచ్చిన సంఖ్యలు వచ్చేలా ఖాళీ బాక్సుల్లో అంకెలు నింపండి.

Clues

	18	11	18
11		2	
22	8		
14	7		3

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆత్మవిశ్వాసం తోడుగా...

బాల్యం కొంతమందికి తీయని జ్ఞాపకాలను గుర్తు చేస్తుంది. మరికొంతమందికి మాత్రం చేదు అనుభవాలను జ్ఞప్తికి తెస్తుంది. ముఖ్యంగా పేదరికం వల్ల బాల్యంలో ఎన్నో అవమానాలు, అవహేళనలు ఎదుర్కొన్న వారు చాలామందే ఉంటారు. అలాంటి యువతి షనీబా అలీ. కేరళకి చెందిన షనీబా ప్రస్తుతం ఎర్నాకుళం హైకోర్టు న్యాయవాదుల్లో ఒకరిగా ఉన్నారు. మలయాళ నటుడు మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటించిన 'కాథల్ కోర్' చిత్రానికి లీగల్ అడ్వైజరర్‌గా కూడా పనిచేశారు. సాధారణంగా ఈ స్థాయికి వెళ్లిన వారు తమ బాల్యపు చేదు జ్ఞాపకాలను నెమరు వేసుకునేందుకు ఇష్టపడరు. కానీ షనీబా ... ఆ పరిస్థితులు పిల్లల మనసులపై ఎంత ప్రభావాన్ని చూపిస్తాయో చెప్పేందుకు తన అనుభవాలనే పంచుకుంటున్నారు.



షనీబా కోజీకోడ్‌లోని కుట్టికత్తూర్‌లో పుట్టారు. తండ్రి అనారోగ్యంతో ఇంటికే పరిమితమైతే తల్లి ఇంటిపని చేసేందుకు వెళ్లేవారు. ఆ కుటుంబం పస్తులు పడుకున్న రోజులు ఉన్నాయి. ఆ రోజులు గుర్తుచేసుకుంటూ షనీబా ఇలా చెప్పారు. 'మధ్యాహ్నం ఉచిత భోజనం దొరుకుతుందని నేను, చెల్లి ప్రతి రోజూ స్కూలుకు వెళ్లేవాళ్లం. ఉడకబెట్టిన గుడ్డు తినడమే మాకు లగ్జరీ విషయం. అది కూడా నెలలో రెండు, మూడుసార్లు ఉండేది. 'అమ్మ గుడ్లు ఉడకబెడుతుంటే ఎప్పుడెప్పుడు తిందామా' అని ఆమె చుట్టూనే తిరిగేవాళ్లం' అంటూ తన బాల్యాన్ని గుర్తుచేసుకున్నారు.

'పేదవాడిని అందరూ పనికిరానివాడిగా చూస్తారు. ఇది నా స్వంత అనుభవం' అని చెబుతున్న షనీబా, 'పిల్లల భావాలు గాయపడినప్పుడు, వారు అనుభవించే మానసిక గాయాలు శాశ్వతంగా నిలిచిపోతాయి. పిల్లల ఆత్మగౌరవాన్ని గౌరవించాలి. అప్పుడే వారు పెద్దయ్యాక ఇతరులను గౌరవిస్తారు. చాలా మంది పేదరికాన్ని ఆహారం, దుస్తులు, నివాసం లేకపోవడంతో పోల్చుతారు. కానీ నాకు మాత్రం పేదరికం అంటే మీ ఆత్మ గౌరవాన్ని తగ్గించడం' అంటున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో మార్పు రావాలని షనీబా ఎంతో తపించింది. చదువుపై శ్రద్ధపెట్టింది. పాత టెక్స్ట్ బుక్స్, ఇరుగు పొరుగు పిల్లల నుండి సేకరించిన నోట్సులు, బట్టలతోనే ఆమె స్కూలు రోజులు గడిచాయి. ఇంకా తన అనుభవాలను ఆమె ఇలా చెబుతున్నారు. 'మా అమ్మ వంట చేసేందుకు వెళ్లే ఇళ్లు చాలా పెద్దవిగా ఉండేవి. అక్కడ ఉండే పిల్లలు ఆటవస్తువుల కోసం మారాం చేయడం మాకు తెలుసు. కానీ మాకు ఇల్లు లేదు. కట్టుకునే బట్టలు ఉండేవి కావు. పుస్తకాలు, జామెట్రీ బాక్సు కొనివ్వమని అమ్మని ఎన్నోసార్లు అడిగాం. కానీ అమ్మ వాటిని కూడా కొనివ్వలేనని చెప్పేది' అంటున్న షనీబా బాల్యస్మృతులు ఎందరో చిన్నారులవి.

పేదరికం పిల్లలపై ఎంత వివక్ష చూపుతుందో ఆమె తన బాల్యంలో ఎదుర్కొన్నారు. ఆ అనుభవాన్ని ఇలా పంచుకున్నారు. 'చిన్నప్పుడు మమ్మల్ని ఎవరూ ఎత్తుకునేవారు కాదు. చాక్లెట్ ఇస్తామని ముద్దు కూడా చేసేవారు కాదు. ఎల్ఎల్‌బి చదివేటప్పుడు వచ్చిన స్టైఫండ్‌తోనే నేను మొదటిసారి డెయిరీ మిల్క్ చాక్లెట్ కొనుక్కున్నాను' అని చెబుతున్నప్పుడు ఆ మాటల్లోని నిజాయతీకి ఎంతో ఆశ్చర్యం వేస్తుంది.

పక్కింట్లో టీవీ చూసేందుకు వెళ్లినప్పుడు ముఖంమీదే తలుపులు వేసిన అనుభవం కూడా షనీబా బాల్యంలో ఎదుర్కొంది. 'సమాజంలో పేదలకు విలువ లేదు. ఈ సంఘటనలు నా మనసులో చాలా పెద్ద ప్రభావాన్ని చూపాయి. పేదవాడు కూడా ఆత్మగౌరవాన్ని కలిగి ఉంటాడని, ఈ విషయాన్ని సమాజానికి చాలా గట్టిగా నిరూపించాలని అప్పుడే అనుకున్నాను' అని ఆమె చెప్పారు.

ఇంట్లో ఇంత పేదరిక పరిస్థితులు ఉన్నా షనీబా చదువులో, క్రీడల్లో రాణించేది. ఖర్చుతో కూడుకున్నవాటికి మాత్రం దూరంగా జరిగేది. స్కూల్లో పెట్టిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో షనీబాకే ఎప్పుడూ ప్రథమ బహుమతి వచ్చేది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ఆమే ముందుండేది. అయితే ఒకసారి, సాధారణంగా ప్రతిభతో రాణించే విద్యార్థులకు స్కూల్లో ఇచ్చే 'కళాతిలకమ్' టైటిల్ ఆమెకి దక్కలేదు. ఖర్చుతో కూడుకున్న డాన్స్ పోటీలో ఆమె పాల్గొనకపోవడమే కారణంగా చెప్పారు. ఆ సందర్భాన్ని షనీబా ఇలా ప్రస్తావించారు. 'ఆ కార్యక్రమానికి, టైటిల్ తీసుకున్న విద్యార్థులతో పాటు వాళ్ల తల్లిదండ్రులు, బంధువులు కూడా వేదికపైకి వచ్చారు. ఆ ఫంక్షన్ హాలులో మా అమ్మానాన్న కూడా ఉన్నారు. కానీ ఈ వివక్షపై ప్రశ్నించే ధైర్యం వాళ్లకి లేదు' అని షనీబా గుర్తు చేసుకున్న సంఘటన ఎందరో పేదపిల్లలది.

'రుచికరమైన ఆహారం తినడానికి కలలు కన్నాను. ఈ స్థాయి నుండి ప్రజలు తమ హక్కుల కోసం పోరాడేలా, వాళ్లని ప్రేరేపించే వ్యక్తిగా నేను మారాను. నన్ను ఇంతలా ఎదిగేలా ఈ అనుభవాలే మార్చాయి' అంటున్న షనీబా పాఠశాల విద్య పూర్తిచేసి, ఎల్ఎల్‌బి వైపు అడుగులు వేశారు.

పేదరికం వల్ల చదువులో కూడా తను ఎలా రాజీపడిందో ఇలా గుర్తుచేసుకున్నారు. 'ఎంబిబిఎస్ కంటే ఎల్ఎల్‌బి తక్కువ ఖర్చు కాబట్టి దీన్ని ఎంచుకున్నాను. 'నేను త్వరగా జీవితంలో స్థిరపడాలి. అమ్మానాన్నకి ఓ మంచి ఇల్లు కొనిపెట్టాలి' ఇదే నా మనసులో ఎప్పుడూ వుండేది' అని చెబుతున్న షనీబా కెరీర్ తొలినాళ్లలో చాలా తక్కువ జీతానికే పనిచేశారు.



'మొదటి మూడు నెలల సమయంలో నేను ఒక పూట భోజనం మానుకుని ఖర్చులు తగ్గించుకున్నాను. సీనియర్ ఇచ్చిన ప్రోత్సాహంతో సొంతంగా కేసులు తీసుకున్నాను. అలా ఆదాయం సంపాదించుకున్నాను' అని తన జీవితంలో ఎదురైన అనుభవాలన్నింటినీ ఇటీవల సోషల్ మీడియా వేదికగా ఆమె పంచుకున్నారు. 27 ఏళ్ల షనీబా ఎక్కడా సిగ్గు పడకుండా తన బాల్యాన్ని, పేదరికాన్ని చెప్పడం చూసిన ఆమె ఇన్‌స్టా ఫాలోవర్లు తన ఆత్మవిశ్వాసాన్ని గొప్పగా ప్రశంసిస్తున్నారు. తను మరిన్ని విజయాలను అందుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. ❖

సరికొత్తగా చైల్డ్ ఆర్టిస్టులు...



చిత్ర పరిశ్రమలో బాలనటులకు కొదవలేదు. ప్రస్తుతం టాలీవుడ్ అగ్రనటులుగా కొనసాగుతున్న బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్, మహేష్‌బాబు, అల్లు అర్జున్ ఇలా చాలామంది నటులు బాలనటులుగా అరంగ్రేటం చేసిన వారే. ఆతర్వాత కెరీర్‌లో దూసుకుపోతూ ముందుకు సాగుతున్నారు. వారసత్వంగా కాకుండా మరికొందరు కేవలం ప్రతిభ ఆధారంగా బాలనటులుగా తెరపైకి వస్తూ సంచనాలు సృష్టిస్తున్న వారు సైతం ట్రెండ్ సెట్టర్లుగా మారుతున్నారు. ఇదే కోవలోకి సుకృతి శాంతి, రిత్విక్, గగనగీతిక, భానుప్రకాష్; రేవంత్ తదితరులు ఉన్నారు.

'పిల్లలు..దేవుడు చల్లని వారే... కల్ల కపటమెరుగని కరుణామయులే' అంటూ సాగే ఈ పాట 'లేత మనసులు' చిత్రంలోనిది. నాటికీ, నేటికీ ఆ పాట ఆ పాటమధురంగా తెలుగునాట మార్మోగుతూనేవుంది. నాటి సినిమాల్లో బాలల జీవనం, అవస్థలు వంటివి సినిమాల్లో పట్టిచూపేవి. ఇప్పుడు పెద్దలను తిట్టేవారిగానూ, జులయిలుగా కొందరు బాలలను చూపుతుండటం కొంత ఇబ్బందికరంగానే ఉంటోంది. ఏ పాత్రల్లోనైనా ఒదిగిపోయి వాటిల్లో జీవించేలా నటించే సత్తా నేటి బాలబాలికలకు ఉంది. వారసత్వంగా వచ్చిన నటన, సిఫార్సులతో కాకుండా తమ సొంత ప్రతిభతో రాణించేందుకు ముందుకు దూకుతున్నారు. మాటతీరు, అభినయం, వ్యక్తీకరణలు అదుర్స్ అనేలా ఉంటున్నాయి. గతేడాది ఈ ఏడాది ఆరంభంలోనూ తెలుగు సినిమా పరిశ్రమలో కొత్తగా బాలనటుల హవా కొనసాగుతోంది. ః పిల్లలతో తెరకెక్కించిన సినిమాలు బాక్సాఫీసు వద్ద భారీ వసూళ్లు చేస్తుండటంతో నిర్మాతలు, దర్శకులు బాలనటులను ప్రోత్సహిస్తున్నారు.

'లక్కీ భాస్కర్' సినిమాలో మెరిసిన రిత్విక్ చక్కగా నటించాడు. ఎంతో ప్రతిభను ప్రదర్శిస్తున్నాడు. డైలాగులు మర్చిపోకుండా చెబుతుండటం మరో గొప్ప విషయం. ముఖకవలికలు, మాటల తీరు బాగుండటంతో పలు సినిమాల్లో అతడికి ఛాన్సులు వస్తున్నాయి. జైలర్ సినిమాలో రజనీకాంత్ మనువడి పాత్రలో రిత్విక్ నటించారు. ఇతడికి 'రిత్విక్ రాక్స్' పేరిట ఓ యూట్యూబ్ ఛానల్ కూడా ఉంది. తండ్రి జ్యోతిరాజ్ ఈ బాధ్యతలను చూస్తున్నారు. 2023 ఆగస్టు నాటికి రిత్విక్ రాక్స్ 2.36 మిలియన్ సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. నయనతార నటించిన 02 (ఆక్సిజన్) అనే సినిమాలోనూ కొడుకుగా నటించారు. ఆ తర్వాత కార్తీ హీరోగా వచ్చిన 'సర్దార్' సినిమాలోనూ కొడుకుగా నటించారు.

సుకుమార్ తనయి సుకృతి శాంతి సందేశాత్మకంగా, ప్రకృతి ప్రేమికురాలిగా 'గాంధీతాత చెట్టు'లో నటించింది. ఆమె నటనకు ప్రేక్షకులే కాదు, సెలబ్రిటీలూ ప్రసంశలు కురిపించారు. సుకృతి నటనకుగానూ, ఉత్తమ బాలనటిగా దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకున్నారు. దర్శకురాలు పద్మావతి తీసిన చిత్రం 'గాంధీతాత చెట్టు'. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 24న ఈ సినిమా విడుదల చేశారు. ఇందులో సుకృతి 'గాంధీ' అనే పాత్రలో నటించింది. తనకిది మొదటి సినిమా. అయినా ఎక్కడా తడబడకుండా అద్భుతంగా నటించింది.







డాకు మహారాజ్ సినిమాలో ప్రేక్షకులను మెప్పించిన బాల నటి 'గగనగీతిక'. టాలీవుడ్ అగ్రనటుల్లో ఒకరైన నందమూరి బాలకృష్ణతో ఆమె స్క్రీన్ షేర్ చేసుకున్న విషయం తెలిసిందే. 'పిట్ట కొంచెం... కూత ఘనం' అనే సామెతను గుర్తు చేస్తూ... నాలుగున్నరేళ్ల ప్రాయంలోనే టిక్ టాక్ వీడియోస్ చేస్తూ ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించి... 'లాయర్ విశ్వనాథ్' చిత్రంతో బాలనటిగా అరంగేట్రం చేసిన ఈ చిచ్చరపిడుగు..రెండవ మూవీ . ఆర్.ఆర్.ఆర్, నారప్ప, 18 పేజీస్, తెల్లవారితే గురువారం' తదితర చిత్రాల్లో హీరోయిన్ల చిన్నప్పటి పాత్రలతో తన ప్రతిభకు మరింత సానబెట్టుకుంది. 90' శాతం మిడిల్ క్లాస్ బయోపిక్, ది గ్రేట్ ఇండియన్ సూసైడ్, ప్రేమ విమానం" చిత్రాలలోనూ నటించి మెప్పించారు. 'ఓదెల రైల్వే స్టేషన్-2 చిత్రంలో తమన్నా చిన్నప్పటి క్యారెక్టర్ చేస్తోంది. ఆయన తండ్రి శ్రీతేజ్ కూడా ఇండస్ట్రీలోనే ఉన్నారు. సంప్రదాయ కూచిపూడితోపాటుగా వెస్ట్రన్ డాన్స్‌ను కూడా సాధన చేస్తున్నారు.



ప్రతిభకు ఎల్లలు లేవని నిరూపిస్తున్నాడు ఏలూరు జిల్లా నిడమర్రు మండలం చానమిల్లికి చెందిన భీమాల శ్రీనివాసరావు, దేవి దంపతుల కుమారుడు రేవంత్ పవన్ సాయిసుభాష్ (బుల్లిరాజు). సంక్రాంతికి వస్తున్నాంలో బాల నటుడిగా మంచి గుర్తింపు పొందారు. అతడి వీడియోలను చూసినా దిల్‌రాజ్, అనిల్‌రావిపూడి ఇతడికి అవకాశం కల్పించారు.రేవంత్ నిడమర్రు మండలం బావాయిపాలెం చైతన్య పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఈ సినిమా కోసం మూడు నెలలపాటు సెలవులు సైతం పెట్టాడు. ఇదే గ్రామానికి చెందిన ఎంఎస్ నారాయణ హాస్యనటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు చానమిల్లికి చెందిన భీమాల రేవంత్ బాలనటుడిగా 'సంక్రాంతికి వస్తున్నాం'తో మంచి గుర్తింపు సంపాదించుకున్నాడు.

కెజిఎఫ్ సినిమాలో నటించిన బాలనటుడు మాస్టర్ భానుప్రకాష్‌కు దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. భానుతోపాటుగా మాస్టర్ పుష్కర్లు కూడా ఈ సినిమాలో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. శిశిరంలో నటిస్తుండటం అందరి దృష్టి భానుపై పడింది. కెజిఎఫ్ 2లోనూ నటిస్తున్నారు. తండ్రి సురేష్ అమాస సినిమాలంటే ఇష్టం కావటంతో కొన్ని లఘు చిత్రాలు తీశాడు.

వాటిలో ఒక చిత్రంలో చిన్న పిల్లాడి క్యారెక్టర్ కోసం ఎక్కడెక్కడో వెతికినా తగిన వాళ్లు దొరకలేదు. విసుగొచ్చి తన కొడుకుతోనే చేయించాడు. తొలి ప్రయత్నంలోనే యాక్టింగ్, డైలాగ్స్ అదరగొట్టాడు భాను. దీంతో అల్లు శిరీష్ సినిమాలో చైల్డ్ ఆర్టిస్టుల కోసం ప్రయత్ని స్తున్నారని తెలిసి అడిషన్స్‌కు తీసుకెళ్లగా వెంటనే అవకాశం ఇచ్చేశారు. ఎన్టీఆర్ : కథానాయకుడు, వెంకీమామ, సరిలేరు నీకెవ్వరు, లవ్‌స్టోరీ, గమనం ఇలా దాదాపు 30 సినిమాల్లో నటించాడు. తమ డబ్బింగ్ కూడా తానే చెబుతున్నాడు.

ఐసిసి అండర్-19 మహిళల క్రికెట్ విశ్వ విజేత భారత్

- ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 9వికెట్ల తేడాతో గెలుపు
- తెలుగు తేజం త్రిషకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ అవార్డులు





అండర్-19 మహిళల ప్రపంచకప్ టైటిల్‌తో భారత జట్టు(ఇన్‌సెట్) ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డుతో త్రిష

కౌలాలంపూర్: ఐసిసి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌ను భారత్ చేజిక్కించుకుంది. వరుసగా విజయాలతో ఫైనల్లోకి దూసుకొచ్చిన యువ భారతజట్టు ఆదివారం దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్లో 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి విశ్వవిజేతగా నిలిచింది. దక్షిణాఫ్రికా మహిళలు నిర్దేశించిన 83 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా అమ్మాయిలు 11.2 ఓవర్లలో వికెట్ కోల్పోయి ఛేదించింది. తెలుగు తేజం గొంగడి త్రిష 33బంతుల్లో 44పరుగులతో అజేయంగా నిలిచింది. త్రిష-కమిలిని తొలి వికెట్‌కు 36పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత కమిలిని ఔటైనా.. సనిక ఛల్కేతో కలిసి త్రిష మ్యాచ్‌ను ముగించింది. అంతకుముందు తొలిగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాను నిర్ణీత 20 ఓవర్లలో 82పరుగులకే కట్టడి చేసింది. భారత స్పిన్నర్ల విజృంభణతో సఫారీ జట్టు విలవిల్లాడింది. మికీ వాన్ (23 పరుగులు)టాప్ స్కోరర్. నలుగురు ప్లేయర్లు పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరారు. భారత జట్టు బౌలర్లలో త్రిష(3/15)కి తోడు పరునిక, ఆయూషి, వైష్ణవి రెండేసి, షబ్నమ్‌కు ఒక వికెట్ పడగొట్టారు.

ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా తెలుగు తేజం త్రిష

ఈ టోర్నీలో తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష అద్భుతంగా రాణించింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో దుమ్మురేపింది. ఈ టోర్నీలో సెంచరీ కొట్టిన ఏకైక ప్లేయర్ త్రిష మాత్రమే. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా గొంగడి త్రిష అవార్డులను సొంతం చేసుకుంది. ఈ వరల్డ్ కప్‌లో త్రిష మొత్తం 309 పరుగులు చేసింది. బౌలింగ్‌లో 7 వికెట్లు తీసి సత్తా చాటింది. టైటిల్ విజేతగా నిలిచిన అనంతరం భారత మహిళల జట్టు మాజీ క్రికెటర్ నీతూ డేవిడ్ చేతుల మీదుగా త్రిష ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు అందుకుంది. ఈ అవార్డును తన తండ్రికి అంకితం ఇస్తున్నానని ప్రకటించింది. త్రిష స్వస్థలం తెలంగాణలోని భద్రాచలం. రెండేళ్ల వయసుకే బ్యాట్ పట్టిన త్రిష... 9ఏళ్లకే హైదరాబాద్ అండర్-16 జట్టుకు ఎంపికై సత్తా చాటింది. ఆ తర్వాత అండర్-23 కేటగిరీలోనూ ఆడింది. బౌలింగ్‌లో స్పిన్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను తికమకపెట్టే త్రిష... బ్యాటింగ్‌కు దిగితే భారీ షాట్లతో మోత మోగిస్తుంది.

స్కోర్‌బోర్డు..

దక్షిణాఫ్రికా అండర్-19 మహిళల ఇన్నింగ్స్: బోథా (సి)కమిలిని (బి)షబ్నమ్ 16, లారెన్స్ (బి)సిసోడియా 0, రామ్‌లకన్ (బి)ఆయుషీ శుక్లా 3, రెనెకె (సి)సిసోడియా (బి)త్రిషా 7, మెసో (బి)ఆయుషీ శుక్లా 10, వాన్-వుర్ట్స్ (స్టంప్)కమిలిని (బి)త్రీషా 23, కోలింగ్ (బి)వైష్ణవి శర్మ 15, శేష్ణ నాయుడు (బి)త్రీషా 0, వాన్-వైర్క్ (సి)వైష్ణవి (బి)సిసోడియా 0, లెగోడి (బి)వైష్ణవి శర్మ 0, నిని (నాటౌట్) 2, అదనం 6. (20ఓవర్లలో ఆలౌట్) 82పరుగులు. **వికెట్ల పతనం:** 1/11, 2/20, 3/20, 4/40, 5/44, 6/74, 7/74. 8/74, 9/80, 10/82 **బౌలింగ్:** జోషితా 2-0-17-0, సిసోడియా 4-0-6-2, షబ్నమ్ 2-0-7-1, ఆయుషీ శుక్లా 4-2-9-2, వైష్ణవి శర్మ 4-0-23-2, త్రీషా 4-0-15-3,

భారత అండర్-19 మహిళల ఇన్నింగ్స్: కమిలిని (సి)లారెన్స్ (బి)రెనెకె 8, గొంగడి త్రీషా (నాటౌట్) 44, సనికా ఛల్కే (నాటౌట్) 26, అదనం 6. (11.2ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి) 84పరుగులు. **వికెట్ల పతనం:** 1/36 **బౌలింగ్:** నిథాబి 1-0-7-0, కాలింగ్ 2-0-19-0, రెనెకె 4-1-14-1, శేష్ని 1-0-12-0, వైర్క్ 1-0-12-0, లెగోడి 1.2-0-10-0, బోథా 1-0-9-0.

అభిషేక్ సెంచరీ

- చివరి టి20లో ఇంగ్లండ్‌పై టీమిండియా ఘన విజయం
- షమికి మూడు వికెట్లు
- సిరీస్ 4-1తో కైవసం




ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అభిషేక్ శర్మ(135)

ముంబయి: వాంఖడే స్టేడియంలో జరిగిన ఐదో, చివరి టి20లో అభిషేక్ సెంచరీ ధనా ధన్ సెంచరీతో మెరిసాడు. దూబే(30), తిలక్ వర్మ(24) కూడా బ్యాటింగ్‌లో రాణించడంతో టీమిండియా నిర్ణీత 20ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 247 పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో ఇంగ్లండ్ ఓపెనర్ సాల్ట్(55) అర్ధసెంచరీతో మెరిసినా.. ఆ తర్వాత టీమిండియా బౌలర్లు సమిష్టి రాణించడం ఇంగ్లండ్ 10.3ఓవర్లలో 97పరుగులకే కుప్పకూలింది. పేసర్ మహ్మద్ షమి(3/25)కి తోడు వరుణ్ చక్రవర్తి, దూబే, అభిషేక్ శర్మ రెండేసి వికెట్లతో రాణించారు. దీంతో టీమిండియా ఐదు టి20ల సిరీస్‌ను 4-1తో చేజిక్కించుకుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌ను ఓపెనర్లు సంజూ శాంసన్(16) నిరాశపరిచినా.. అభిషేక్ శర్మ(135) సెంచరీతో రాణించాడు. సంజూ శాంసన్ ఏడు బంతుల్లో ఒక ఫోర్, రెండు సిక్సర్లతో 16 పరుగులు మార్క్ వుడ్ బౌలింగ్‌లో జోఫ్రా అర్చర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. వన్ డౌన్ బ్యాటర్ తిలక్ వర్మ, సారథి సూర్య కుమార్ యాదవ్ వెంటవెంటనే ఔటయినా.. అభిషేక్ శర్మ క్రీజ్‌లో పాతుకుపోయాడు. 10.1 ఓవర్లు ముగిసే సరికి టీమిండియా రెండు వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేసింది. అభిషేక్ 37 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి స్కోర్‌బోర్డును పరుగులు పెట్టించాడు. మొత్తం 54 బంతుల్లో 135 పరుగులు చేసి అదిల్ రషీద్ బౌలింగ్‌లో జోఫ్రా ఆర్చర్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. శివం దూబే 13బంతుల్లో 30 పరుగులు, అక్షర్ పటేల్ 15 పరుగులు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్ మూడు, మార్క్ వుడ్ రెండు, జోఫ్రా ఆర్చర్, జామీ ఓవర్‌టన్, అదిల్ రషీద్ చెరో వికెట్ తీశారు. దీంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 247 పరుగులు చేసింది. ఛేదనలో ఇంగ్లండ్ ఓపెనర్ సాల్ట్(55), బేథెల్(10) మాత్రమే రెండంకెల స్కోర్ చేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ అభిషేక్ శర్మకు దక్కింది. గురువారం నుంచి మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది.

ఊరట జానెడు... బాదుడు బారెడు

- నాలుగు కోట్ల మందికే పన్ను ప్రయోజనం
- మిగిలిన 140 కోట్ల మంది భారతీయులపై భారాలు
- జిఎస్‌టి హేతుబద్ధీకరణ పట్టని మోడీ సర్కార్

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మరోసారి గ్రామీణ ప్రజలకు మొండిచేయి చూపించింది. పట్టణ ప్రజానీకానికి...అది కూడా వేతన జీవులకు మాత్రమే కొంత ఊరట కల్పించి చేతులు దులుపుకుంది. ఆదాయపన్ను మినహాయింపుల కారణంగా ప్రభుత్వ ఖజానాపై లక్ష కోట్ల రూపాయల అదనపు భారం పడుతుందంటూ మొసలి కన్నీరు కార్చింది. ఒక్క మాటలో చెప్పాలంటే మీ వార్షిక జీతం రూ.12 లక్షలు అయితే అందులో రూ.80 వేలు ఆదా చేయగలరు. ఏడాదికి కోటి రూపాయలు ఆర్జిస్తుంటే ఐదు లక్షల రూపాయలు వెనకేసుకోగలరు. ఇదీ బడ్జెట్ అంకెల గారడీ.



ఉద్దీపనల ఫలాలు ఎవరికి?

దేశ ఆర్థిక పరిస్థితి బాగుండాలంటే వినియోగ విప్లవం రావాలని కొందరి అభిప్రాయం. దేశంలో సుమారు ఎనిమిది కోట్ల మంది ఆదాయపన్ను రిటర్న్‌లు దాఖలు చేస్తుంటారు. వారిలోనూ సగం మందివి జీరో-ట్యాక్స్ రిటర్న్‌లే. కాబట్టి వినియోగ విప్లవం అనేది కేవలం నాలుగు కోట్ల మందికి మాత్రమే పరిమితం. అయితే దేశ జనాభా 140 కోట్లు. మరి మిగిలిన వారి సంగతేమిటి?. మన దేశంలో ప్రయివేటు వినియోగ వ్యయం సుమారు రూ.200 లక్షల కోట్లు. కాబట్టి ఈ పన్ను ఉద్దీపనలు మొత్తం విలువలో కేవలం 0.5 శాతం మాత్రమే.

జిఎస్‌టి రేట్లను తగ్గిస్తే...

ఏదో కంటి తుడుపు చర్యగా పన్ను మినహాయింపులు ప్రకటించడానికి బదులు ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జిఎస్‌టి రేట్లను తగ్గించి ఉంటే ప్రజల కొనుగోలు సామర్థ్యం కచ్చితంగా పెరిగి ఉండేది. కేవలం నాలుగు కోట్ల మంది పన్ను చెల్లింపుదారుల కొనుగోలు శక్తే కాదు....మొత్తం 140 కోట్ల భారతీయుల కొనుగోలు శక్తి కూడా పెరిగేది. కానీ ప్రభుత్వం ఇక్కడ ఓ తిరకాసు పెడుతోంది. జిఎస్‌టి రేటు అనేది కేంద్ర బడ్జెట్‌లో నిర్ణయించేది కాదని, దానిని జిఎస్‌టి మండలి నిర్ణయిస్తుందని చెబుతోంది. నిజం చెప్పాలంటే అది ఓ కుంటిసాకు మాత్రమే.

రక్తాన్ని పీలుస్తున్న వ్యవస్థ

కేంద్ర ప్రభుత్వానికి, బిజెపి పాలనలోని రాష్ట్ర ప్రభుత్వాలకు కలిపి జిఎస్‌టి మండలిలో స్పష్టమైన ఆధిక్యత ఉంది. కాబట్టి జీఎస్టీని పెంచాలన్నా, తగ్గించాలన్నా నిర్ణయాధికారం పరోక్షంగా బిజెపిదే. ప్రస్తుతం జీఎస్టీ గరిష్ట రేటు 18 శాతం. లగ్జరీ రేటు 28 శాతం. గత ఎనిమిది సంవత్సరాలుగా వీటిలో ఎలాంటి మార్పులు చేయడం లేదు. పేదలు, మధ్య తరగతి ప్రజలతో పాటు అధిక జీతాలు తెచ్చుకుంటున్న భారతీయుల రక్తాన్ని విపరీతమైన, తిరోగమన పన్ను వ్యవస్థ పీల్చి పిప్పి చేస్తోందని చెప్పడానికి ఇంతకంటే ఉదాహరణ ఏం కావాలి?

అరకొర మినహాయింపులతో ఏం లాభం?

ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఒకటుంది. పేద, మధ్య తరగతి కుటుంబం వినియోగ వస్తువులపై పెట్టే ప్రతి రూ.10,000 ఖర్చుకు ప్రభుత్వానికి రూ.1,800 చెల్లించాల్సి ఉంటుంది. అయితే పన్ను రేటు తగ్గించామని చెప్పి ఇందులో రూ.300 రూపాయలు వాపసు చేస్తే దానితో ఏం కొనగలం? బహుశా చిన్నారుల కోసం కొన్ని గుడ్లు కొనుగోలు చేయగలమేమో. అధిక జీతం పొందుతున్న వ్యక్తి రూ.10 లక్షలు పెట్టి కారు కొన్నాడని అనుకుందాం. జీఎస్టీ రేటును 28 శాతం నుండి 22 శాతానికి తగ్గిస్తే ఓ రూ.60,000 ఆదా అవుతాయి. కానీ దానితో అతను తన కుమార్తెకు ఓ ఐప్యాడ్ మాత్రమే కొనగలడు.

ఆదాయాలు పెరిగినప్పుడే...

'పన్ను రేట్లను తగ్గిస్తే ప్రజల వినియోగం పెరుగుతుంది. ప్రజలపై మరిన్ని పన్నులు విధించడానికి ప్రభుత్వానికి అవకాశం లభిస్తుంది. అప్పుడు వాటిపై మళ్లీ మినహాయింపులు...ఇలా ఈ చక్రం తిరుగుతూనే ఉంటుంది' అని ఓ ఆర్థికవేత్త వ్యాఖ్యానించారు. అయితే ఆదాయాలు పెరిగినప్పుడే ఇవన్నీ సాధ్యపడతాయన్న వాస్తవాన్ని పాలకులు విస్మరిస్తున్నారు. 'రెవెన్యూ తటస్థ' జీఎస్టీ రేటు 6.2-15.3 శాతం మధ్య ఉండాలని అనేక అధ్యయనాలు సూచించాయి. గరిష్ట రేటును 18 శాతం నుండి 15 శాతానికి, లగ్జరీ రేటును 28 శాతం నుండి 22 శాతానికి తగ్గిస్తే ప్రభుత్వం కోల్పోయే ఆదాయం ఏమీ ఉండదు. కానీ జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని సీనియర్ న్యాయవాది (ట్యాక్స్) అరవింద్ దతార్ చెప్పారు.

అయోధ్యలో దళిత మహిళపై హత్యాచారం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో బిజెపి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోతోంది. తాజాగా అయోధ్య జిల్లాలో దళిత మహిళపై హత్యాచార ఘటన వెలుగులోకి వచ్చింది. మహిళను దారుణంగా హింసించి హత్యాచారం చేశారు. కాళ్లు విరిచి, కంటి గుడ్లు పెకలించిన 22 ఏళ్ల మహిళ నగ్న మృతదేహాన్ని కాలువలో గుర్తించారు. జిల్లాకు చెందిన 22 ఏళ్ల దళిత మహిళ జనవరి 30న రాత్రి వేళ భజన కార్యక్రమానికి వెళ్లి, అప్పటి నుంచి ఆమె ఇంటికి తిరిగి రాలేదు. ఆమె మృతదేహాన్ని తాజాగా దారుణ స్థితిలో గుర్తించారు. మహిళ అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మరోవైపు పోలీసులు ఆ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రిపోర్ట్ వచ్చిన తర్వాత ఏం జరిగిందో అన్నది నిర్ధారిస్తామని పోలీసులు తెలిపారు. కాగా, ఈ ఘటనపై స్థానిక ఎంపి అవధేష్ ప్రసాద్ ఈ తీవ్రంగా స్పందించారు. ఆదివారం ప్రెస్ మీట్‌లో ఆయన తీవ్రంగా విలపించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరుగకపోతే లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని అన్నారు. 'నన్ను ఢిల్లీకి వెళ్ళనివ్వండి. ప్రధాని మోడీ ముందు ఈ విషయాన్ని లోక్‌సభలో లేవనెత్తుతా. న్యాయం జరుగకపోతే లోక్‌సభ సభ్యత్వానికి నేను రాజీనామా చేస్తా. కూతుళ్లను రక్షించడంలో మనం విఫలమవుతున్నాం. చరిత్ర మనల్ని ఎలా భావిస్తుంది?' అంటూ బోరున విలపించారు.

గుజరాత్‌లో రోడ్డు ప్రమాదం

- ఏడుగురు మృతి

గాంధీనగర్ : ఆదివారం తెల్లవారుజామున గుజరాత్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. డాంగ్ జిల్లా లోని సపుతర హిల్ స్టేషన్ పరిధిలో యాత్రికులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు అదుపు తప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. తెల్లవారుజామున 5.30 గంటలకు బస్సు అదుపుతప్పి 200 అడుగుల లోతు లోయలోకి దూసుకెళ్లింది. .బ్రేకులు ఫెయిల్ కావడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ప్రమాదం జరగగానే సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. యాత్రికులు మహారాష్ట్రలోని త్రయంబకేశ్వర్ నుంచి గుజరాత్‌లోని ద్వారకకు వస్తుండంగా ఈ ప్రమాదం సంభవించింది. బాధితులంతా మధ్యప్రదేశ్‌లోని గుణ, శివపురి, అశోక్ నగర్ జిల్లాలకు చెందినవారని డాంగ్ జిల్లా కలెక్టర్ మహేశ్ పటేల్ తెలిపారు.

ఒక్క మురికివాడను కూల్చం..

- ఢిల్లీ ప్రచారంలో మోడీ హామీ



న్యూఢిల్లీ : ఢిల్లీలో అధికారంలోకి వస్తే ఇక్కడ ఒక్క మురికివాడను కూడా కూల్చమని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హామీ ఇచ్చారు. తాము ప్రచారం కోసం ప్రకటనలు చేయమని, చేసిన వాగ్దానాలను నిలబెట్టుకునేందుకు బడ్జెట్‌లో వెసులుబాట్లు కల్పిస్తామని ఢిల్లీలోని ఆర్కే పురంలో ఆదివారంనాడు జరిగిన ర్యాలీలో మోడీ పేర్కొన్నారు. అలాగే ప్రస్తుతం ఢిల్లీలో అమలులో ఉన్న ప్రజాసంక్షేమ పథకాలన్నింటికీ తాము కొనసాగిస్తామని ఢిల్లీ ప్రజలకు మోడీ భరోసా ఇచ్చారు. ప్రజాప్రయోజనాలకే తాము పెద్దపీట వేస్తామని, ప్రజలకు ప్రయోజనం చేకూర్చే ఏ పథకాన్ని కూడా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆపేసే ప్రసక్తి ఉండదని చెప్పారు. పూర్వాంచల్, బిహారీ కమ్యూనిటీల నుంచి తనకు పెద్ద సంఖ్యలో మెసేజ్‌లు వచ్చినట్టు చెప్పారు. "వారి మనోభావాలను నేను అర్థం చేసుకోగలను. నేను కూడా పూర్వాంచల్ ఎంపీనే. కోవిడ్ సమయంలో వారి పట్ల కొన్ని పార్టీలు అనుచితంగా వ్యవహరించాయి. ఢిల్లీలోని బలవంతంగా పంపేశారు. కానీ బీజేపీ ప్రభుత్వం పూర్వాంచల్, బీహార్ ప్రజలకు ఎప్పుడూ బాసటగా ఉంటుంది" అని అన్నారు.

కేంద్రంలో బిజెపి మూడోసారి దేశానికి తాను సేవలందిస్తున్నానంటే దేశంలోని మహిళల ఆశీర్వాదమే కారణమని అన్నారు. మోడీ ఇచ్చే ప్రతి హామీలోనూ మహిళలకు కీలక భూమిక ఉంటుందని స్పష్టంచేశారు. కాంగ్రెస్, ఆప్ పార్టీల అవినీతిపై మోడీ విమర్శలు గుప్పించారు. అవినీతిలో రెండూ ఒకటేనని విమర్శించారు.

ప్రజలు సంపాదించుకునే దానిపై మాజీ ప్రధానులు జహహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ భారీగా పన్నులు వడ్డించే వారని, కానీ తమ ప్రభుత్వం పన్నుభారాన్ని సులభతరం చేసిందని వివరించారు.

ఢిల్లీని ఆప్ ప్రభుత్వం నుంచి విముక్తి చెప్పాలని కార్యకర్తలందరినీ కోరుతున్నానని మోడీ తెలిపారు.

ఓటమి భయంతోనే బిజెపి గూండాయిజం : కేజ్రీవాల్

న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ విజయం తమదేనని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఆప్ చారిత్రాత్మక విజయం దిశగా దూసుకెళ్తుండగా.. బిజెపి పరిస్థితి రోజురోజుకు దిగజారిపోయిందని విమర్శించారు. ఓటమి భయంతో బిజెపి నాయకులు గూండాయిజం చేస్తున్నారని ఆరోపించారు. ఆప్ నాయకులపై, ప్రజలపై దాడులు చేస్తున్న బిజెపి గూండాలపై చర్యలు తీసుకోకుండా పోలీసులకు ఆదేశాలు వెళ్లాయని కేజ్రీవాల్ విమర్శించారు. ఢిల్లీలో ఈ విధమైన ఎన్నికలను ప్రజలు ఇంతకుముందు ఎప్పుడూ చూడలేదని కేజ్రీవాల్ అన్నారు. బిజెపి గూండాయిజానికి వ్యతిరేకంగా అందరం ఏకం కావాల్సిన అవసరం ఉందని ప్రజలకు పిలుపునిచ్చారు. బిజెపి గూండాయిజాన్ని దేశం దృష్టికి తెచ్చేందుకు ప్రత్యేక హ్యాష్‌ట్యాగ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బిజెపి లేదా అధికార యంత్రాంగం దాడులు చేసినా, వేధింపులకు గురిచేసినా ఈ హ్యాష్‌ట్యాగ్ ద్వారా సమాచారం ఇవ్వాలని కేజ్రీవాల్ కోరారు.

ఇలాంటి ఘటన తమ దృష్టికి వచ్చినా సరే, 'అమిత్ షా గుండాగిరి హ్యాష్‌ట్యాగ్'ను వాడి తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు కేజ్రీవాల్ సూచించారు. బిజెపి మనలను భయపెట్టడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా మనం బెదరవద్దని సూచించారు. అలాగే ఎన్నికలకు ముందు మురికివాడల్లో నివసించే, ఆర్థికంగా బలహీనులైన వారి ఓటు హక్కును తొలగించడానికి పెద్ద కుట్ర జరుగుతోందని కేజ్రీవాల్ ఆరోపించారు.

రాజకీయ కాలుష్యంతో ఢిల్లీ కలుషితం

- ఎన్నికల ప్రచారంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజకీయ కాలుష్యంతో ఢిల్లీ కలుషితమైందని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపిని గెలిపించాలని అక్కడి తెలుగు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, టిడిపి ఎంపిలు, రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు పాల్గొన్నారు. షాద్రా బిజెపి అభ్యర్థి సంజయ్ గోయల్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సరైన నాయకుడు మనదేశానికి సరైన సమయంలో ఉన్నారని, ఆయనే మోడీ అని అన్నారు. ఢిల్లీలో ఇంతమంది తెలుగువారు ఉంటారని అనుకోలేదని అన్నారు. మోడీ నాయకత్వాన్ని ప్రపంచ దేశాలు హర్షిస్తున్నాయని చెప్పారు. 1995లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గురించి తాను మాట్లాడానని అన్నారు. ఇప్పుడు ప్రతి ఇంటికీ ఒక ఎఐ తయారుకావాలని చెప్పారు. ఢిల్లీలో ఉన్న తెలుగు తమ్ముళ్లు ఇంటింటికీ వెళ్లి బిజెపి గెలుపు దేశ చరిత్రకు మలుపు అనేలా చెప్పాలని అన్నారు. 'దేశం బ్రాండ్ మోగడానికి మోడీ కారణం. 2047 నాటికి భారత్ నెంబర్‌వన్‌గా తయారవుతుంది. ఢిల్లీని చూస్తుంటే చాలా బాధగా ఉంది. 1993లో హైదరాబాద్ ఎలా ఉందో ఢిల్లీ ఇప్పుడు అలానే ఉంది. ఢిల్లీలో డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చి ఉంటే ఢిల్లీ వాషింగ్టన్ లాగా ఉండేది. ఢిల్లీలో కాలుష్యం పెరిగిపోయింది. ఆ గాలితో ప్రజలు ఎలా ఉన్నారో తెలియడం లేదు. చాలామంది హైదరాబాద్, బెంగళూరు వెళ్లాలని అనుకుంటున్నారు. రాజకీయ కాలుష్యంతో ఢిల్లీ కలుషితమైంది. బిజెపి గెలిస్తే ఢిల్లీ బాగుపడు తుంది. నరేంద్ర మోడీ మోక్షం ఇస్తే తప్ప ఢిల్లీ బాగుపడదు. ఢిల్లీ అభివృద్ధి కావాలంటే బిజెపి అధికారంలోకి రావాలి. దేశానికి ప్రపంచం మొత్తం గుర్తింపు వచ్చింది. అయితే ఢిల్లీ సమస్యల వలయంలో చిక్కుకుంది. పదేళ్లలో ఏం చేశారంటే, స్కూళ్లు పెట్టమని అంటున్నారు. ఢిల్లీ మురికి కూపంలా మారింది. ఢిల్లీలో స్వచ్ఛమైన మంచినీరు తాగే పరిస్థితి లేదు. బీహార్ నుంచి ఉపాధికి ఢిల్లీ వచ్చేవారు, ఇప్పుడు అందరూ దక్షిణ భారతదేశానికి వస్తున్నారు. ఢిల్లీలో అభివృద్ధి ఆగిపోయింది. బిజెపి ఎన్నికల మేనిఫెస్టో అద్భుతంగా ఉంది. ప్రతి మహిళకూ రూ.2,500, గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు బాగున్నాయి' అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. బిజెపి బహిరంగ సభలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, ఎపి బిజెపి నేతలు మాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



దీటైన స్పందన !

- ప్రతీకార చర్యలు చేపట్టిన కెనడా, మెక్సికో
- ఘర్షణలు కోరుకోవడం లేదు కానీ...వారే రెచ్చగొట్టారని వ్యాఖ్యలు

ఒట్టావా, మెక్సికో సిటీ : తమ దేశాల నుండి వచ్చే దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అదనపు టారిఫ్‌లు ప్రకటించిన వెంటనే కెనడా, మెక్సికోలు తీవ్రంగా స్పందించాయి. అమెరికాకు వ్యతిరేకంగా తాము కూడా ప్రతీకార చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించాయి. ఈ చర్యలతో విభేదాలు తలెత్తాయని కెనడా ప్రధాని వ్యాఖ్యానించగా, అమెరికాతో ఘర్షణలు తాము కోరుకోవడం లేదని, వారితో చర్చలు, సహకారమే ఆకాంక్షిస్తున్నామని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షబ్నమ్ పేర్కొన్నారు. కానీ ప్రతీకార చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితులను వారే రెచ్చగొట్టారని వ్యాఖ్యానించారు.

అందరం ఒక తాటిపైకి రావడానికి బదులుగా ట్రంప్ నేడు తీసుకున్న చర్యలతో తమలో చీలిక వచ్చిందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడే వ్యాఖ్యానించారు. ట్రంప్ చర్యలకు ప్రతిగా తాము కూడా ప్రతీకార చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఆల్కహాల్, పళ్ళు, ఇతర ఉపకరణాలతో సహా అమెరికా దిగుమతులన్నింటిపై 25శాతం టారిఫ్‌లను విధించనున్నట్లు తెలిపారు. ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికన్లతోపాటు కలిసి కెనడా బలగాలు పోరాడాయని, అమెరికాలో తలెత్తిన తుపాను, కార్చిచ్చులు వంటి ప్రకృతి వైపరీత్యాల సంక్షోభాల్లో కూడా సాయమందించామని ఆయన గుర్తు చేసుకున్నారు. అమెరికన్లకు ఎప్పుడూ కూడా బాసటగా నిలబడుతూ వచ్చామని ఆయన వ్యాఖ్యానించారు. 155 బిలియన్ల డాలర్ల విలువైన అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లు విధిస్తున్నట్లు ట్రూడే పత్రికా సమావేశంలో ప్రకటించారు. ట్రంప్ టారిఫ్‌లు అమల్లోకి వస్తున్న మంగళవారం నాడే ఇందులో కొన్ని సుంకాలు అమల్లోకి వస్తాయని తెలిపారు. రాబోయే రోజులు కెనడియన్లకు గడ్డు కాలమని వ్యాఖ్యానించారు. అదే రీతిలో అమెరికన్లు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు.

ప్లాన్ బి ని అమలు చేస్తాం

మెక్సికో అధ్యక్షుడు ప్రతీకార చర్యలను ప్రకటించారు. నేర ముఠాలతో మెక్సికన్ ప్రభుత్వం కలిసిపోయి పనిచేస్తోందని వైట్‌హౌస్ చేసిన విమర్శలను మెక్సికో నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తోందని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షబ్నమ్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె ఎక్స్‌లో సుదీర్ఘమైన పోస్టు పెట్టారు. మెక్సికో ప్రయోజనాలను కాపాడేందుకు తీసుకునే చర్యలతో సహా అమెరికా వైఖరిని వ్యతిరేకిస్తూ తీసుకునే ప్రతీకార చర్యలకు స్పందించాల్సిందిగా తమ ఆర్థిక శాఖ కార్యదర్శిని ఆదేశించామని ఆమె చెప్పారు. తాము కసరత్తు చేసిన ప్లాన్ బిని అమలు చేయాలని ఆర్థిక మంత్రిని ఆదేశించినట్లు చెప్పారు. మెక్సికో ప్రయోజనాల పరిరక్షణ కోసం తీసుకునే చర్యల్లో టారిఫ్‌లు, టారిఫ్‌యేతర చర్యలు రెండూ వున్నాయన్నారు. అయితే అమెరికా నుండి దిగుమతయ్యే ఏ వస్తువులపై టారిఫ్‌లు విధిస్తున్నారో వెల్లడించలేదు.

చైనా, కెనడా, మెక్సికోలపై వాణిజ్య యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ధరలు తగ్గుతాయని ప్రజలు ఆశపడ్డారు. కానీ ట్రంప్ తాజా చర్యలతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. ఈ టారిఫ్‌లు ఇలాగే కొనసాగితే ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక వృద్ధికి అంతరాయం కలుగుతుందని, పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారే అవకాశముందని భయపడుతున్నారు.

కాగా ఈ చర్యల వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు జరిగే నష్టంపై యేలే లోని బడ్జెట్ ల్యాబ్ విశ్లేషణ జరిపింది. సగటు అమెరికన్ కుటుంబం ఈ పన్నుల వల్ల తన ఆదాయంలో 1170డాలర్ల మేరకు నష్టపోతుందని పేర్కొంది. వృద్ధిరేటు మందగిస్తుందని, ద్రవ్యోల్బణ పరిస్థితులు మరింత పెచ్చరిల్లుతాయని, ఇతర దేశాలు తీసుకునే ప్రతీకార చర్యలతో పరిస్థితి మరింత దిగజారుతుందని పేర్కొంది. డెమోక్రాట్లు కూడా తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ తీసుకున్న చర్యల ఫలితమే రాబోయే పరిస్థితులని హెచ్చరించారు.

అండర్-19 మహిళా క్రికెట్ జట్టుకు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అండర్-19 ఉమెన్స్ టి-20లో ప్రపంచకప్ గెలిచిన భారత మహిళా క్రికెట్ జట్టుకు అభినందనలు వెల్లువెత్తాయి. అద్వీతమైన విజయం సాధించిన మహిళా బృందానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, ఐటిశాఖ మంత్రి నారా లోకేష్‌తో పాటు పలువురు మంత్రులు, ప్రముఖులు వేర్వేరు ప్రకటనల్లో అభినందనలు తెలిపారు.

ప్రపంచకప్ సాధనలో తెలుగు అమ్మాయి గొంగడి త్రిష 33 బంతుల్లో 44 పరుగులు దూకుడుగా ఆడటంతో భారత్ 11.2 ఓవర్లలోనే విజయాన్ని అందుకోవడం సులభతరమైందని ప్రశంసించారు. వరల్డ్ కప్ ఫైనల్ డిఫెండింగ్ ఛాంపియన్‌గా అడుగుపెట్టిన భారత్ జట్టు అద్భుతమైన పోరాట పటిమతో దక్షిణాఫ్రికాపై 9 వికెట్ల తేడాతో చారిత్రాత్మక విజయం సాధించారని కొనియాడారు. జట్టు సభ్యులందరికీ పేరుపేరునా అభినందనలు తెలియజేశారు.

ఎన్నికల కమిషన్‌కు వైసిపి వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న మున్సిపల్ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్ల ఉప ఎన్నికల్లో అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు వైసిపి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆదివారం ఎన్నికల కమిషనరు నీలం సహానిని కలిసి వైసిపి నేతలు వినతిపత్రం అందజేశారు. ఆమెను కలిసిన వారిలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, రుహుల్లా, విజయవాడ సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్, విజయవాడ మేయరు రాయన భాగ్యలక్ష్మి ఉన్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. పలు ప్రాంతాల్లో ఎన్నికలను ఏకపక్షంగా, తమకు అనుకూలంగా మార్చుకునేందుకు కూటమి పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని తాము ఎన్నికల కమిషన్‌ను కలిసి విజ్ఞప్తి చేశామన్నారు.

తిరుపతిలో వరుస చోరీలు

- 1.48 కిలో బంగారం అపహరణ

ప్రజాశకి- తిరుపతి సిటీ

తిరుపతి రూరల్ ప్రాంతంలో వరుసగా నాలుగు ఇళ్లల్లో చోరీ జరిగిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని సిపిఆర్ విల్లాస్‌లోని 80, 81, 82, 83 నంబర్లు గల ఇళ్లకున్న తాళాలను బద్దలు కొట్టి చోరీకి పాల్పడ్డారు. 81వ నంబర్ ఇంటి ఓనర్ మేఘనాథరెడ్డి తన ఇంటిలో పై అంతస్తులో నిద్రిస్తుండగా కింది అంతస్తులోకి దొంగలు చొరబడి కేజీ బంగారాన్ని అపహరించారు. 82వ నంబర్ ఇంటిలో 48 గ్రాముల బంగారం చోరీ చేశారు. 80, 83 ఇంటి నంబర్ గల ఇళ్లలో పలు వస్తువులు అపహరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని చోరీ జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిపై హత్యాచారం

ప్రజాశక్తి - పెదనందిపాడు (గుంటూరు జిల్లా)

వృద్ధురాలిపై గుర్తు తెలియని వ్యక్తులు అత్యాచారం, ఆపై హత్యకు పాల్పడిన సంఘటన గుంటూరు జిల్లా పెదనందిపాడులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెదనందిపాడు శివారులోని ఆరోగ్య కేంద్రం ఎదుట ఇర్ల రమణ (64) అనే వృద్ధురాలు నివాసముంటున్నారు. స్థానిక సాయిమందిరంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం పనికి వెళ్లకపోవడంతో ఆలయానికి సంబంధించిన వారు వృద్ధురాలి కుటుంబీకులను సంప్రదించారు. దీంతో వారు వెళ్లి చూడగా రక్తపు మడుగులో చెల్లాచెదురైన దుస్తులతో వృద్ధురాలు పడి ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

బ్రాండిక్స్‌లో మహిళాగ్రహం

• వరుస నిరసనలు • డిమాండ్లను నెరవేర్చాలని పట్టుబట్టిన కార్మికులు



బ్రాండిక్స్‌లో సమ్మె చేస్తున్న మహిళా కార్మికులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం అధిస్తాన్ (బ్రాండిక్స్) కంపెనీలో మహిళాగ్రహం పెల్లుబిక్కింది. పని ప్రదేశంలో ఏళ్ల తరబడి భరించుకుంటూ వచ్చిన అనేక సమస్యలపై మహిళా కార్మికులు సమ్మెకు దిగారు. ఫిబ్రవరి ఒకటి నుంచి పని సమయం అరగంట పెంచడానికి యాజమాన్యం సిద్ధపడ్డంతో జనవరి 30వ తేదీన బ్రాండిక్స్-2 యూనిట్ కార్మికులు మెరుపు సమ్మెకు దిగారు. సమ్మెకు సిఐటియు అండగా నిలబడ్డంతో మరింత ఆత్మస్థైర్యంతో ఆందోళనను కొనసాగించారు. శుక్రవారం ఉదయం ఐదు గంటల వరకు నిరసనను కొనసాగించారు. ఆదివారం సెలవు ఇస్తున్నట్లు, అరగంట పెంపు సమయం యాజమాన్యం రద్దు చేసుకున్నట్లు ప్రకటించినప్పటికీ, ఇఎస్ఐ, పిఎఫ్, రవాణా ఛార్జీలు పోనూ రూ.15వేలు వేతనం చెల్లించాలని, సీనియార్టీ ఆధారంగా వేతనాలు పెంచాలని, మహిళా సూపర్‌వైజర్లను నియమించాలని, వేధింపులు అరికట్టాలని, సెలవు రోజున రూ.500 కోత పెట్టొద్దన్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని మహిళలు పట్టుబట్టారు.

నిరసనలో పాల్గొన్న వేలాది మహిళలకు ఫొటోలు, వీడియోలు తీసి బెదిరించి విధులకు పంపాలని సూపర్‌వైజర్లు, యాజమాన్య ప్రతినిధులు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టడంతో అనివార్యంగా వేతనాలు పెంపు, ఇతర సమస్యల పరిష్కారానికి యాజమాన్య ప్రతినిధులు హామీ ఇవ్వక తప్పలేదు. బ్రాండిక్స్-2 యూనిట్ మహిళల వలె తమకు కూడా జీతాలతో ఇతర సమస్యలను పరిష్కరించాలని బ్రాండిక్స్ 1,3 యూనిట్లలోని మహిళలు ఫిబ్రవరి 1న విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ (బిఐఎసి)లోని వివిధ యూనిట్లలో పనిచేస్తున్న సుమారు 22వేల మంది మహిళలకు రూ. ఎనిమిది వేల నుంచి రూ.పదివేల మధ్య జీతాలు చెల్లిస్తున్నారు. గతంలో ఎనిమిది గంటలకు 1200 ఉన్న పీసుల తయారీ లక్ష్యం క్రమంగా బ్రాండిక్స్ యాజమాన్యం 2,400కు పెంచడంతో తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నట్లు మహిళా కార్మికులు ప్రజాశక్తికి తెలిపారు. అనేకసార్లు వేతనాలు పెంచాలని చేసిన విజ్ఞప్తులను యాజమాన్యం పట్టించుకోకపోవడం, సమస్యలు క్రమంగా పెరగడం, వేధింపులు భరించలేకపోవడంతో వేలాదిమంది మహిళా కార్మికులు నిరసనకు దిగారు. మహిళల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాల్సిన ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోంది. మహిళల సమ్మెకు మద్దతు తెలపడానికి వెళ్లిన సిఐటియు నాయకులను అరెస్టు చేసి యాజమాన్యాన్ని వెనుకేసుకొస్తుంది.

వేతనాలు పెంచాలి



బ్రాండిక్స్‌లో పనిచేస్తున్న మహిళలకు కటింగ్‌లు పోనూ వేతనం రూ.15వేలు చెల్లించాలి. మహిళా సూపర్‌వైజర్లను నియమించాలి. వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఆరు నెలలు ఇవ్వాలి. మహిళా కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చొరవచూపకపోతే పోరాటం ఉధృతం చేస్తాం.

ఆర్.రాము,
సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు

స్టీల్‌ప్లాంట్‌పై బిజెపి మోసపూరిత చర్యలు

- భవన నిర్మాణ కార్మిక సంఘం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ అంశంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పలు మోసాలకు పాల్పడుతూ, తెలుగు ప్రజలను వంచిస్తుందని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) అధ్యక్షుడు కె నర్సింగరావు పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం నాటికి 1406వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ కమిటీ సభ్యులు కూర్చున్నారు. ఈ సందర్భంగా కె నర్సింగరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వానికి ఎన్నికలు తప్ప, ప్రజల సంక్షేమం పట్టదని ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూస్తే తేటతెల్లం అవుతుందన్నారు. ఆనాడు రైతులు నల్ల చట్టాలు రద్దు చేయాలంటూ పోరాటం చేసినా, 700 మందికి పైగా రైతులు అసువులు బాసినా పట్టించుకోని బిజెపి ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికలు సమీపించేసరికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగంగా రైతులకు క్షమాపణ చెప్పి నల్ల చట్టాలను రద్దు చేశారని గుర్తుచేశారు. ఈనాడు ఢిల్లీ ఎన్నికల నేపథ్యంలో మధ్యతరగతికి మేలు చేసే బడ్జెట్‌గా అభివర్ణిస్తూ ఢిల్లీ గద్దె లక్ష్యంగా ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు సమస్యకు శాశ్వత పరిష్కారమైనటువంటి సొంత గనులు, సెయిల్‌లో విలీనం, ఉద్యోగులకు బకాయి జీతాలు చెల్లించకపోతే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు వై రాజు, ప్రొఫెసర్ ఎస్ సూరప్పుడు, కె సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న సిఐటియు నాయకులు



నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

టూరిజం కేంద్రంగా అరకు

చలి ఉత్సవ్ ముగింపులో టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్

ప్రజాశక్తి- అరకులోయ (అల్లూరి జిల్లా)

టూరిజం కేంద్రంగా అరుకును అభివృద్ధి చేస్తామని రాష్ట్ర టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ తెలిపారు. అరకులోయలో జనవరి 31వ తేదీన ప్రారంభమైన అరకు చలి ఉత్సవ్ ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో అజయ్‌జైన్ మాట్లాడుతూ.. టూరిజం అభివృద్ధికి అరకు అనువైన ప్రదేశమన్నారు. టూరిజం అభివృద్ధిపై ప్రత్యేకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారని తెలిపారు. ప్రతి జిల్లాలో ఉత్సవాలు నిర్వహించడానికి కేలండర్‌ను రూపొందిస్తున్నామని చెప్పారు. అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ.. అడ్వెంచర్ టూరిజం కేంద్రంగా అరకును అభివృద్ధి చేస్తామని చెప్పారు. మాడగడ కేంద్రంలో పారాగ్లైడింగ్‌కు అనువైన ప్రదేశం ఉందన్నారు. ఉత్సవంలో మణిపూర్, నాగాలాండ్ మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కళాకారులు గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా అద్భుతంగా ప్రదర్శనలిచ్చారని తెలిపారు. ఉత్సవ్ లో భాగంగా మూడవ రోజైన ఆదివారం ఉదయం సుంకరమెట్ట కాఫీ ట్రయల్ నుంచి సుమారు మూడు కిలోమీటర్లు ట్రెక్కింగ్ చేపట్టారు.

60 పథకాలకు నిధులు కట్

రక్షణ, రైల్వేకు అరకొర పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారీగా కోత వేసింది. మొత్తం 150 వరకూ ఈ పథకాలు ఉండగా వీటిలో 60 పథకాలకు 2024-25 బడ్జెట్‌లో కేటాయింపులు ఘనంగా చూపించినా ఖర్చు చేసే విషయానికి వచ్చే సరికి చేతులెత్తేసింది. తాజా బడ్జెట్‌లో రివైజ్డ్ ఎస్టిమేట్స్ (సవరించిన అంచానాలు)ను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. సామాన్యులకు మేలు చేసే పథకాలకు కోత వేసింది. రక్షణ రంగంలో చేపట్టిన పథకాలకు అరకొర నిధులు పెంచింది.

భారీగా కోత విధించిన పథకాల్లో ముఖ్యంగా ప్రతి ఇంటికీ కుళాయి నిరందించేందుకు ఏర్పాటుచేసిన జల్ జీవన్ మిషన్‌కు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.70,163 కోట్లు కేటాయించగా, సవరించి రూ.22,694 కోట్లకు పరిమితం చేశారు. గ్రామీణ పేదల ఇళ్ల నిర్మాణానికి రూపొందించిన పిఎంఎవై(జి)కి కేటాయించిన రూ.54,500 కోట్లను సవరించి రూ.32,426 కోట్లకే పరిమితం చేశారు. పట్టణ పేదల ఇళ్ల నిర్మాణం కోసం తీసుకొచ్చిన పిఎంఎవై(అర్బన్) పథకంలో రూ.30,171 కోట్లను సవరించి 13,670 కోట్లకు కుదించారు. గ్రామీణ రహదారుల నిర్మాణ పథకమైన పిఎంజిఎస్‌వైకి రూ.19,500 కోట్లను సవరించి రూ.14,500 కోట్లకు కుదించారు. న్యూ ఎంప్లాయిమెంట్ జనరేషన్ స్కీంకు కేటాయించిన రూ.10,000 కోట్లను రూ.6,799 కోట్లకు తగ్గించారు. ఎల్‌పిజి డిబిటి పథకంలో రూ.1,500 కోట్లను రూ.500 కోట్లకు కోత వేశారు. విద్యార్థుల కోసం రూపొందించిన న్యూ ఇంటర్ షిఫ్ ప్రోగ్రామ్‌కు రూ.2,000 కోట్లను రూ.380 కోట్లతో సరిపెట్టారు. నదుల అనుసంధానం పథకానికి రూ.4,000 కోట్లను రూ.2,000 కోట్లకు తగ్గించారు. పిఎం పోషణ్‌కు రూ.12,467 కోట్లకు రూ.10,000 కోట్లకు కుదించారు. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకానికి రూ.2,05,250 కోట్ల నుంచి 1,97,000 కోట్లకు కోత వేశారు. వీటితో పాటు రాష్ట్రీయ కృషి యోజన, నేషనల్ ఆయుష్ మిషన్, పిఎం శ్రీ, పిఎం ఉషా, అమృత్, ఎన్‌యుడిఎం, పిఎం ఎసెస్వి, మిషన్ శక్తి, పిఎం విశ్వకర్మ వంటి అనేక పథకాలకు సవరించిన అంచనాల్లో కోత వేశారు. డిమాండ్ అధికంగా ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, యూరియా సబ్సిడీ, ఎంఐఎస్-ఎస్, దీన్ దయాల్ అత్యోదయ యోజన-నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్, నేషనల్ సోషల్ అసిస్టెంట్ ప్రొగ్రామ్, స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్), నేషనల్ హెల్త్ ప్రొగ్రామ్, నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ నిధులు అవసరం ఉన్నా అదనపు నిధులు కేటాయించలేదు.

మరోవైపు రక్షణ రంగంలో ఎయిర్ క్రాఫ్ట్ అండ్ ఏరో ఇంజన్స్‌కు రూ.40,278 కోట్ల నుంచి 46,592 కోట్లకు, నావెల్ ఫీట్‌కు రూ.23,800 కోట్ల నుంచి రూ.25,605 కోట్లకు, మెట్రో ప్రాజెక్టులకు రూ.21,336 కోట్ల నుంచి 24,691 కోట్లు, రైల్వే ప్రాజెక్టులైన రోలింగ్ స్టాక్స్ (రైల్వే) రూ.40,314 కోట్ల నుంచి 46,252 కోట్లు, ట్రాక్ రెన్యువల్స్ రూ.17,652 కోట్ల నుంచి రూ.22,669 కోట్లకు సవరించిన అంచనాల్లో పెంచారు.

ప్రజారోగ్యానికి బడ్జెట్ పెంచాలి

- కేంద్ర ఆర్థికశాఖ మంత్రికి ప్రజారోగ్యవేదిక లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో ఆర్యోగ రంగంపై కేటాయింపులు తక్కువగా ఉన్నాయని, ఇది తమను ఆందోళనకు గురి చేస్తోందని ప్రజారోగ్యవేదిక పేర్కొంది. ఆరోగ్య రంగంపై బడ్జెట్‌ను పెంచాలని కోరుతూ ప్రజారోగ్యవేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి రమణయ్య, టి కామేశ్వరరావు ఆదివారం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. ప్రస్తుత కేటాయింపులు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) సిఫార్సు చేసిన జిడిపిలో 6 శాతం కంటే గణనీయంగా తక్కువగా ఉందని పిఎయు లేఖ హైలెట్ చేసిందని తెలిపారు. ఆరోగ్య బడ్జెట్‌ను పెంచడానికి ప్రభుత్వం తన నిబద్ధతను పేర్కొన్నప్పటికీ కేటాయింపు అంచనాలను, దేశ ఆరోగ్య వ్యవస్థ అత్యవసరాలను అందుకోవడంలో విఫలమవుతోందని పిఎయు నొక్కి చెప్పిందన్నారు. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులు జిడిపిలో దాదాపు 2 శాతంగానే ఉందని, ఇది డబ్ల్యుహెచ్ఒ సిఫార్సులకు చాలా దూరంలో ఉందని పిఎయు సంస్థ పేర్కొందని లేఖలో పేర్కొన్నారు. ఆరోగ్య సంరక్షణ రంగానికి పెరుగుతున్న డిమాండ్లను తీర్చడానికి సరిపోని స్వల్ప పెరుగుదలను లేఖలోని బడ్జెట్ గణాంకాలు వివరించాయని, ఈ నిరంతర నిధుల కొరత తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని పిఎయు భావిస్తోందని, వీటిలో తగినంత మౌలిక సదుపాయాలు లేకపోవడం, సంరక్షణకు పరిమిత ప్రాధాన్యత (ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో) ప్రజలపై పెరిగే జేబు ఖర్చులు, బలహీనమైన ప్రజారోగ్య వ్యవస్థలు ఉన్నాయన్నారు. డబ్ల్యుహెచ్ఒ సిఫార్సు చేసిన జిడిపిలో 6 శాతం ఆరోగ్యానికి కేటాయించడం కేవలం ఆర్థిక పెట్టుబడి మాత్రమే కాదని, దేశ భవిష్యత్తు, పౌరుల శ్రేయస్సుకు పెట్టుబడి అని సంస్థ నొక్కిచెప్పిందన్నారు.

అరసవల్లిలో రథసప్తమి వేడుకలు ప్రారంభం

- ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం జిల్లా అరసవల్లి సూర్యదేవాలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న ఈ వేడుకలు మూడు రోజులపాటు కొనసాగనున్నాయి. తొలిరోజు ఆదివారం ఉదయం నగరంలోని 80 అడుగుల రోడ్డులో సామూహిక సూర్య నమస్కారాలతో ప్రారంభమైన వేడుకలకు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు హాజరయ్యారు. సుమారు ఐదు వేల మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. డచ్ బిల్డింగ్ వద్ద టూరిజం హెలీకాప్టర్ రైడ్, ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్, జిల్లా స్థాయి వెయిట్‌లిఫ్టింగ్, గ్రామీణ క్రీడలైన కర్రసాము, సంగిడీలు, ఉలవల బస్తా లిఫ్టింగ్ తదితర క్రీడా పోటీలను కేంద్ర మంత్రి ప్రారంభించారు. మధ్యాహ్నం డేఅండ్‌నైట్ కూడలి నుంచి అరసవల్లి ఆలయం వరకు నిర్వహించిన శోభాయాత్రను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభించారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలు, పలు ఆలయాల ప్రచార రథాలు, మంగళ వాయిద్యాలతో శోభాయాత్ర సాగింది. రథసప్తమి వేడుకల్లో భాగంగా 'సమగ్రత-సమానత్వం' అంశంపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో సంగీత కార్యక్రమాలు, హైపర్ ఆది, ఫైమా, ఢీ భూమిక, రేలారే రేలా టీమ్, మిమిక్రీ ఆనంద్, జోష్ శివ, పిన్ని సాంగ్ ఫేమ్ షణ్ముఖ, సురేష్, రేష్మ, బాలాజీ వంటి ప్రముఖులు ధూంధాం కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ అంజనా కళా సంస్థ ఆధ్వర్యాన పంచరత్నాలు పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు.




వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు తక్షణ చర్యలు

- 6న హైకోర్టు జడ్జీల బృందం కర్నూలుకు రాక : మంత్రి ఫరూక్

ప్రజాశక్తి- నంద్యాల కలెక్టరేట్



మీడియా తో మాట్లాడుతున్న మంత్రి ఎన్ ఎం డి ఫరూక్

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నామని న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. నంద్యాలలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అనువైన భవనాన్ని ఎంపిక చేసేందుకు ఈ నెల 6న హైకోర్టు న్యాయమూర్తుల బృందం కర్నూలుకు వస్తున్నట్టు తెలిపారు. కర్నూలు మండలం దిన్నెదేవరపాడు వద్ద ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌కు చెందిన భవనాన్ని బృందం పరిశీలించనున్నట్టు పేర్కొన్నారు. 2014-19 సమయంలోనే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారన్నారు. దానికి అనుగుణంగానే కర్నూలులో బెంచ్ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలంటే 15 మంది జడ్జిలు ఉండాలని, అందుకు కావలసిన భవనం, అందులో మౌలిక సదుపాయాలు అవసరమవుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే కర్నూలు కలెక్టర్ స్థలాన్ని పరిశీలించడంతోపాటు ఏపి విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌కు చెందిన భవనాన్ని గుర్తించినట్లు చెప్పారు. వాటిని పరిశీలించడానికి, ఇక్కడి పరిస్థితులను తెలుసుకోవడానికి హైకోర్టు న్యాయమూర్తుల బృందం వస్తున్నట్లు తెలిపారు.



10కె రన్‌ను ప్రారంభిస్తున్న శాప్ ఛైర్మన్ రవి నాయుడు, ఎమ్మెల్యే దగ్గుపాటి, అహుడా ఛైర్మన్ వరుణ్, నిర్వాహకులు సజ్జ రాగవీణ

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఆంధ్ర

- 'వి రన్ ఫర్ అనంతపురం' కార్యక్రమంలో శాప్ ఛైర్మన్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టారని శాప్ ఛైర్మన్ రవి నాయుడు తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్), యాంటీ నార్కోటిక్స్ పోలీస్ విభాగం "ఈగల్", అహుడా, వి వైబ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 'వి రన్ ఫర్ అనంతపురం' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట నుంచి 10కె, 5కె, 3కె రన్‌లను ప్రారంభించారు. యువత, విద్యార్థులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథులు శాప్ ఛైర్మన్ రవి నాయుడు, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అహుడా ఛైర్మన్ వరుణ్, నిర్వాహకులు సజ్జ రాగవీణ, అడిషనల్ ఎస్‌పి పాల్గొన్నారు. రవినాయుడు మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువత పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అనంతపురం జిల్లాను క్రీడా హబ్‌గా మారుస్తామని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.



ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి, కలెక్టర్ తదితరులు

ప్రకాశం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- జిల్లా ఆవిర్భావ దినోత్సవంలో మంత్రి వీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

భిన్న పరిస్థితులు ఉన్న ప్రకాశం జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి చెప్పారు. ప్రకాశం జిల్లా 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ ఆవరణం ప్రకాశం భవనంలో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలో బాల్యవివాహాలు, శిశు మరణాలను తగ్గించేందుకు కృషి జరుగుతోందన్నారు. విస్తారంగా ఉన్న భూములను వినియోగంలోకి తెస్తామన్నారు. కనిగిరి ప్రాంతంలో పునరుత్పాదక ఇంధన పరిశ్రమ, గిద్దలూరులో లెదర్ పార్కు ఇందులో భాగమని తెలిపారు. రామాయపట్నం పోర్టు, హార్టికల్చర్ యూనివర్సిటీ ఉన్న కందుకూరు నియోజకవర్గం కూడా త్వరలోనే ప్రకాశం జిల్లాలో విలీనం అవుతుందన్నారు. పొగాకు అనుబంధ పరిశ్రమలు కూడా జిల్లాలో ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈ దిశగా దావోస్ పర్యటనలో సిఎం చంద్రబాబు చర్చలు జరిపినట్లు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయడంతో పాటు నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేలా జిల్లాలో అవసరమైన చోట చెక్ డ్యాముల నిర్మాణాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. తొలుత కలెక్టరేట్ ఆవరణంలో ఉన్న ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ముద్రగడ ఇంటి వద్ద ఉద్రిక్తత

- కారు, ఫ్లెక్సీలు, ఇతర వస్తువులు ధ్వంసం
- నిందితుడిపై అనుచరుల దాడి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు (కాకినాడ జిల్లా)

మాజీ మంత్రి, వైసిపి నాయకులు ముద్రగడ పద్మనాభం ఇంటి వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని ముద్రగడ ఇంటి ఆవరణలోకి ట్రాక్టర్‌తో ప్రవేశించి కారుతోపాటు ఫ్లెక్సీలను ఢీకొట్టి ధ్వంసం చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిఠాపురం నియోజకవర్గం మంగుతుర్తికి చెందిన గనిశెట్టి గంగాధర్ తన అమ్మమ్మ గ్రామమైన కిర్లంపూడి పంచాయతీ పరిధిలోని జగపతినగరంలో నివాసం ఉంటున్నాడు. గ్రామంలో జనసేన నాయకునిగా ఉన్నాడు. ఆదివారం తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో ముద్రగడ ఇంటి ఆవరణంలోకి ట్రాక్టర్‌తో వచ్చి పలు వస్తువులను ధ్వంసం చేశాడు. కారును ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. ఫ్లెక్సీలను ధ్వంసం చేశాడు. శబ్ధం రావడంతో ఇంటి నుంచి బయటకు వచ్చిన ముద్రగడ పద్మనాభం చూసి గంగాధర్ పారిపోయేందుకు ప్రయత్నించగా ఆయన అనుచరులు యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం గంగాధర్‌ను కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఘటనా స్థలాన్ని పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరిరాజు, జగ్గంపేట సిఐ వైఆర్‌ఎ.శ్రీనివాస్, ఎస్ఐ జి.సతీష్ పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీహరిరాజు మాట్లాడుతూ.. నిందితుడిపై కేసు నమోదు చేశామని, దాడికి కారణాలను తెలుసుకుంటున్నామని తెలిపారు. విషయం తెలిసిన వెంటనే వైసిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు కురసాల కన్నబాబు, మాజీ మంత్రులు దాడిశెట్టి రాజా, చెలుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, జక్కంపూడి రాజా, మాజీ ఎంపి వంగా గీత కిర్లంపూడి చేరుకున్నారు. ముద్రగడను కలిసి జరిగిన ఘటనపై ఆరా తీశారు. అనంతరం కురసాల కన్నబాబు విలేకరులతో మాట్లాడుతూ ముద్రగడ ఇంటిపై జరిగిన దాడికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి చెల్లిబోయిన వేణు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాడులు పెరిగాయని తెలిపారు. అయినా, ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. పద్మనాభం ఇంటిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

ప్రజలతో మమేకం...

ప్రజారంగాలపై చర్చలో ప్రతినిధులు



ఆంజనేయులు



శివనాగరాణి



కె. శ్రీనివాస్



బేబిరాణి



మురళి

ప్రజాశక్తి-కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ (నెల్లూరు)

గత మూడేళ్లలో ప్రజలతో మమేకమై ప్రజా రంగాల ద్వారా రాజీలేని విధంగా పోరాటాలు, కార్యక్రమాలు నిర్వహించినట్లు వివిధ ప్రజారంగాల బాధ్యులు చెప్పారు. సిపిఐ(ఎం) 27వ రాష్ట్ర మహాసభలో ప్రవేశపెట్టిన ప్రజారంగాల నివేదికపై రెండోరోజైన ఆదివారం రంగాల వారీగా చర్చ జరిగింది.

కార్మిక రంగం నుంచి బేబీరాణి, కందారపు మురళి మాట్లాడుతూ 42 రోజుల పాటు జరిగిన అంగన్‌వాడీల సమ్మెతో పాటు మున్సిపల్ కార్మికుల సమ్మెలు జయప్రదమైనట్లు చెప్పారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నాలుగేళ్లుగా సాగుతున్న ఆందోళన కార్మికుల పోరాట పటిమకు నిదర్శమన్నారు. విజయనగరం జిల్లా మిమ్స్ కార్మికులు తమ హక్కుల కోసం నిర్బంధాన్ని ఎదురించి పోరాడారని చెప్పారు. నెల్లూరు కృష్ణపట్నం పోర్టు కంటైనర్లను మార్చడాన్ని ఆపగలిగామని, థర్మల్ విద్యుత్‌ని అదానీకి అప్పగించాలని చూస్తే అడ్డుకున్నామని చెప్పారు.

వ్యవసాయ కార్మిక రంగం నుంచి శివనాగరాణి, కె ఆంజనేయులు మాట్లాడుతూ వ్యవసాయం సంక్షోభానికి గురికావడం, యాంత్రీకరణ పెరిగి పనిదినాలు పడిపోవడంతో అనివార్యంగా భూ పోరాటాలకు, వ్యవసాయ పోరాటాలకు దిగాల్సి వస్తోందన్నారు. ఈ కాలంలో 16 జిల్లాల్లోని 181 కేంద్రాల్లో భూమి, ఇళ్ల స్థలాలు, నిర్వాసితుల సమస్యలపై ఆందోళనలు జరిగాయనీ, 900 మందికి పైగా కేసులు బనాయించారని, రౌడీ షీట్లు పెట్టారని చెప్పారు.

రైతు రంగం నుంచి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యలు, అస్తవ్యస్తమైన మార్కెట్, పెరిగిన సాగు పెట్టుబడులతో రాష్ట్ర వ్యవసాయం సంక్షోభంలో వుందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు నిర్మించమని అడుగుతున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. గుంటూరులో పసుపు, ఉత్తరాంధ్రలో చెరుకు పంటల వారీగా చేస్తున్న పోరాటాలకు రైతుల నుంచి స్పందన కనబడుతున్నదన్నారు.

యువజన రంగం తరపున జి రామన్న మాట్లాడుతూ నిరుద్యోగం, స్థానిక సమస్యలపై పనిచేయడం ద్వారా ప్రజల్లోకి వెళ్లగలిగామని తెలిపారు. మెగా డిఎస్సీపై పోరాటంలో లక్షలాది మంది భాగస్వామ్యులవ్వడంతో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే తొలి సంతకం పెట్టాల్సిన పరిస్థితిని కల్పించామని చెప్పారు. గత ప్రభుత్వం విద్యార్థులకు పూర్తిగా విద్యను దూరం చేసేందుకు ఎయిడెడ్ విద్యాసంస్థలను విలీనం చేయడంపై పోరాటాలు చేశామని విద్యార్థి రంగం తరపున ప్రసన్నకుమార్ తెలిపారు. విద్యార్థి ఉద్యమాల్లో సాంస్కృతిక రంగాన్ని బలోపేతం చేసుకోవడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. మహిళా రంగం తరపున సాయిలక్ష్మీ, శ్యామల మాట్లాడుతూ బాలల రంగం, మైక్రో ఫైనాన్స్, డ్వాక్రా రంగాల సమస్యలపై నిరంతరం పనిచేస్తున్నామని తెలిపారు. బాలలకు ట్యూషన్ సెంటర్లు నిర్వహించడం, తరుణీతరంగాలు పేరుతో మహిళలకు నిర్వహిస్తున్న కార్యక్రమాలకు మంచి స్పందన వచ్చినట్లు చెప్పారు. కళారంగం తరపున అనిల్ మాట్లాడుతూ సాంస్కృతిక రంగంలో బిజెపి ప్రమాదం పెరుగుతోందని, అదే మోతాదులో మన సాంస్కృతిక రంగం కూడా పనిచేయాల్సి వుందని తెలిపారు. ప్రజారక్షణ భేరి, పోలవరం పాదయాత్ర వంటి కార్యక్రమాల్లో దళాలు విస్తృతంగా పాల్గొన్నాయని చెప్పారు.

వైసిపి ప్రభుత్వం కౌలు చట్టాన్ని మార్చడంతో అనేకమంది కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని కౌలురైతు రంగం తరపున హరిబాబు, లక్ష్మణస్వామి చెప్పారు. దేవాదాయ భూములను సాగుచేస్తున్న కౌలు రైతులకు అనుకూలంగా ప్రభుత్వ ఉత్తర్వులు సాధించడంలో జరిగిన రాయభారాలను, ఆందోళనా వివరాలను వారు వివరించారు. పంటల భీమా, పంటల నష్టపరిహారం ఇవ్వాలని కౌలు రైతుల పక్షాన పోరాటాలు చేసినట్లు చెప్పారు.

గిరిజన రంగం తరపున లోతా రామారావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని స్థాయిలలోనూ ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. జీవో నెంబర్ 3 రద్దుపై ఆందోళన నిర్వహించడం జరిగిందన్నారు. ఏజెన్సీలో స్థానిక గిరిజన యువతకు వందశాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పిస్తూ 2000లో వచ్చిన ఈ జీవోను రాష్ట్రప్రభుత్వం రద్దు చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా వేలాది మందితో మన్యం బంద్, రంపచోడవరం, చింతూరు ఐటిడిఎ ముట్టడి నిరసనలతో గిరిజన రంగం ప్రతిష్ట పెరిగిందని తెలిపారు.

మొత్తం సముద్రతీరాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని, దీనివల్ల మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని వృత్తిదార్ల తరపున గంటా శ్రీరామ్, గురు శేఖర్ తెలిపారు. అలాగే చేనేత కార్మికులపై దృష్టి పెట్టి పనిచేయాల్సిన అవసరం వుందన్నారు.

సామాజిక రంగానికి సంబంధించి క్రాంతికుమార్, రఘురామ్ మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు ప్రజల నుండి విశేష స్పందన లభించిందని చెప్పారు. శ్మశాన వాటికల సమస్యలపై జగన్ ప్రభుత్వ హయాంలో ఆందోళన చేయగా,....ఆయా ప్రాంతాల్లో జనాభాను బట్టి అర ఎకరం నుండి ఎకరం వరకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. పూర్వ ప్రకాశం జిల్లాలో దళితుడిని ఎస్ఐ, ఇతర పోలీసులు హింసించిన ఘటనపై 2016లోనే తాము కేసు వేయగా, ఇటీవల ఆ ఎస్ఐకి శిక్ష వేయడమేగాక జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పిందని చెప్పారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గత మూడేళ్లలో శాసన మండలిలోనూ, బయటా అనేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సిపిఎస్ ఉద్యోగుల ఆందోళనకు ప్రత్యక్షంగా సంఘీభావం తెలిపామని, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం ప్రభుత్వంతో రాయభారాలు నడపడమే గాక ఆందోళనలో పాల్గొనడం వల్లే రెగ్యులరైజేషన్ అయిందని చెప్పారు. జాబ్ కేలండర్, డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం, వెలుగొండ ప్రాజెక్టు సత్వర పూర్తికి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తికి పిడిఎఫ్ ఎమ్మెల్సీలుగా శాసనమండలిలో ప్రస్తావించామని చెప్పారు. రానున్న కాలంలో మరిన్ని ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేయడానికి ఈ నెల 27న శాసనమండలిలో ఉత్తరాంధ్ర, గోదావరి, కృష్ణా-గుంటూరు జిల్లాల స్థానాలకు పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని కోరారు.

తమ 'బడి కోసం బస్సు యాత్ర'కు ప్రజల్లో స్పందన రావడం వల్లే ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లే తగ్గి పాత పద్ధతిని పునరుద్ధరించడానికి ప్రకటన జారీ చేసిందని, అయితే మళ్లీ మరో రూపంలో మరింత ప్రమాదకరంగా తెచ్చే ప్రయత్నం చేస్తోందని ఉపాధ్యాయ రంగం నుండి పాల్గొన్న సురేష్ చెప్పారు. మతోన్మాదాన్ని పక్కా ప్రణాళికతో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గంలోకి మతోన్మాదులు తీసుకెళ్లే ప్రయత్నాన్ని తిప్పికొట్టేలా కార్యాచరణను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

సైన్స్ రంగానికి సంబంధించి రామారావు, త్రిమూర్తులు రెడ్డి మాట్లాడుతూ 8 వేల పాఠశాలల్లో చెకుముకి సంబరాలు నిర్వహించామని చెప్పారు. మేజిక్‌పై రాష్ట్ర వర్క్‌షాపులో తీసుకున్న 50 మంది ద్వారా రాష్ట్రమంతా మేజిక్ షోలను మరింత పకడ్బందీగా నిర్వహించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

న్యాయవాద రంగానికి సంబంధించి మాధవరావు, పౌర హక్కులకు సంబంధించి రమేష్ మాట్లాడుతూ

పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాస్తున్న ప్రతి సందర్భంలోనూ బాధితులకు అనుకూలంగా తీర్పులు రావడం లేదన్నారు. ప్రొఫెసర్ సాయిబాబాను ఉపా చట్టం కింద జైలులో దశాబ్దానికిపైగా నిర్బంధించి మానసికంగా, శారీరకంగా అనేక ఇబ్బందులకు గురిచేసిన విషయాన్ని, 80 ఏళ్ల వృద్ధుడు స్టాన్‌స్వామి అక్రమంగా జైలులోనే నిర్బంధించడంతో అనారోగ్యానికి గురై చనిపోయిన విషయాన్ని వారు గుర్తు చేశారు.

న్యాయవాదుల రంగం ప్రతినిధి రమేష్ బాబు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం న్యాయస్థానాల్లోనూ మతతత్వాన్ని చొప్పించేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. ఆ పార్టీకి ఊడిగం చేసే వారికే ఉద్యోగోన్నతులు కల్పిస్తోందన్నారు. సామాజిక కార్యకర్త సాయిబాబా వంటి వారిని జైల్లో పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు.

సోషల్ మీడియా రంగం ప్రతినిధి దాస్ మాట్లాడుతూ సాంకేతికంగా వచ్చిన విప్లవాత్మకమైన మార్పుల్లో భాగంగా యువత తప్పుదోవపట్టే పరిస్థితులున్నాయని అన్నారు. యువతను మంచి మార్గంలో నడిపించేందుకు సోషల్ మీడియా ద్వారా కృషి చేస్తున్నామని చెప్పారు.

నెల్లూరు ప్రజా వైద్యశాల ప్రతినిధి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించుకోవడం ద్వారా ప్రజారోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని అన్నారు. సహకార ఉత్పత్తి రంగాలను మెరుగుపరచుకోవడం ద్వారా ప్రజా సంబంధాలను మరింతగా పెంచుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

పట్టణ సంస్కరణలపై సత్యబాబు మాట్లాడుతూ కేంద్రం ఒత్తిడితో పట్టణాల్లో చెత్త పన్ను, విలువ ఆధారిత ఆస్తి పన్ను వంటివి కూటమి ప్రభుత్వం అమలు చేస్తుండటం పేద, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారిందన్నారు. భవిష్యత్తులో వీటిపై పోరాటానికి సిద్ధం కావాలని అన్నారు.

సాహితీరంగ ప్రతినిధి సత్యాజీ మాట్లాడుతూ పుస్తకాలపై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో ప్రగతిశీల సాహిత్యాన్ని అందించాల్సిన అవసరముందన్నారు. సాహిత్య కార్యశాలలు, జనకవనం వంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాల్సి ఉందని అన్నారు.

మైనార్టీ రంగం నుంచి ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎ చిష్టి మాట్లాడుతూ లౌకికవాదం ప్రాతిపదికగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మణిపూర్‌లో, బంగ్లాదేశ్‌లో జరిగిన దాడులను ఖండించామని అన్నారు.

విజ్ఞాన కేంద్రాల నిర్వాహకుల ప్రతినిధి రామరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో 16 జిల్లాలో విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల్లో వైజ్ఞానిక అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. తాము చేపట్టిన వివిధ కార్యక్రమాలకు మేధావులు, విద్యావేత్తలు, కవులు, కళాకారులు, సాహితీ వేత్తల నుంచి మంచి స్పందన లభిస్తుందని వివరించారు.

ఉత్తరాంధ్ర అభివద్ధి వేదిక ప్రతినిధి రెడ్డి వేణు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలను అమలు చేయకపోవడం వల్ల ఉత్తరాంధ్ర అన్ని విధాల నష్టపోయిందని అన్నారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ రైల్వే జోన్ వంటి విషయాల్లో బిజెపి మోసం చేసిందని విమర్శించారు.

రాయలసీమ అభివృద్ధి వేదిక ప్రతినిధి డాక్టర్ ఎం.గేయానంద్ మాట్లాడుతూ కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, ప్రజల సెంటిమెంట్‌గా ఉన్న ఆంధ్రప్రదేశ్ వికాస్ గ్రామీణ బ్యాంక్ హెడ్ ఆఫీస్‌ను కడపలోనే ఉంచాలని డిమాండ్ చేశారు.

రాజధాని అభివృద్ధి వేదిక ప్రతినిధి ఎం.రవి మాట్లాడుతూ రాజధాని నిర్మాణం విషయంలో బిజెపి మోసాన్ని రైతులు క్రమేణా తెలుసుకున్నారని అన్నారు. రాజధాని ప్రాంత అభివద్ధి విషయంలో 29 గ్రామాలకు పరిమితం చేయకుండా సిఆర్‌డిఎ పరిధిలోని 56 మండలాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విభిన్న ప్రతిభావంతుల సంఘం ప్రతినిధి నాగేశ్వరరావు మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల విషయంలో షరతులు విధిస్తోందని అన్నారు. అర్హులకు అన్యాయం చేస్తే పోరాడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

బాలల సంఘం ప్రతినిధి జయ మాట్లాడుతూ వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యాన నివాస ప్రాంతాల్లో 132 చిల్డన్స్ క్లబ్‌లు నడుస్తున్నాయని చెప్పారు. విశాఖలో ట్యూషన్ సెంటర్లు కూడా నడుస్తున్నాయన్నారు. మిగిలిన చోట్ల కూడా క్లబ్‌లు నడుపుతామని అన్నారు.

ప్రజారోగ్య వేదిక ప్రతినిధి కామేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్యం ప్రజల హక్కుగా డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఫీజులు, వైద్య పరీక్షల బిల్లులు, పడకలు వంటి వాటిపై ప్రభుత్వ నియంత్రణ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పార్టీ ప్రజాప్రతినిధుల విభాగం నుంచి టి.కృష్ణమోహన్ మాట్లాడుతూ స్థానిక సంస్థల నిధులు, విధులు, అధికారాలు తెలుసుకొని ప్రజలకు సేవలందించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇంకా, అఖిల భారత శాంతి సంఘం ప్రతినిధి సతీష్, టెక్నాలజీ రంగ ప్రతినిధి శ్రీపతి, జానపద, వృత్తి కళాకారుల రంగాల ప్రతినిధులు మాట్లాడారు.

విద్యకూ విదిలింపులే !

- కేంద్ర బడ్జెట్‌పై ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశ విద్యా రంగానికి తాజా బడ్జెట్‌లో మోడీ ప్రభుత్వం మొండి చేయి చూపించిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పేర్కొంది. విద్యను కార్పొరేట్, ప్రైవేట్ రంగానికి ధారాదత్తం చేయడానికి ఈ బడ్జెట్‌లో చర్యలు తీసుకుందని తెలిపింది. గతేడాది కంటే ఈ ఏడాది కేవలం 0.2 శాతం మాత్రమే విద్యారంగానికి కేటాయింపులు పెంచారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్న కుమార్, ఎ అశోక్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిధులు ఏమాత్రం విద్యాభివృద్ధికి సరిపోవన్నారు. 2024 జూన్‌లో వచ్చిన పోషన్ ట్రాకర్ డేటా ప్రకారం దేశంలో 17 శాతం (2.7 కోట్ల మంది పిల్లలు) తక్కువ బరువుతో ఉన్నారని వెల్లడించిందని, ఈ లెక్కన ప్రస్తుతం కేటాయింపులతో ఒక పిల్లాడికి 5 పైసలు మాత్రమే నిధులు పెరిగాయన్నారు. ఇప్పటికే పాఠశాల విద్యకు దేశంలో నిధుల కొరత తీవ్రంగా వేధిస్తుందని, ఈ నేపథ్యంలో పాఠశాల విద్యకు గతేడాది కేటాయించిన రూ.73,008 కోట్ల నుంచి రూ.78,572 కోట్లకు పెంచారని, సవరించిన అంచాల్లో ఈ మొత్తం తగ్గించకుండా చర్యలు తీసుకోవాలని, ప్రైవేటు రంగంలో పరిశోధకులు కోసం ఈ బడ్జెట్‌లో కేటాయింపులు పెరిగాయన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగ అభివృద్ధి కోసం 2024 బడ్జెట్‌లో ప్రకటించిన ప్రైవేట్ రంగ ఆధారిత పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల చొరవ కోసం ప్రభుత్వం రూ.20 వేలకోట్లు కేటాయించిందని, అదే సమయంలో ప్రభుత్వ పథకాలకు రూ.355 కోట్లకు తగ్గించారని తెలిపారు. ప్రైవేటు సంస్థలకు రూ.327 కోట్లు మూలధనం ఇస్తూ వారి మార్కెట్ అవసరాలకు కేటాయింపులు చేశారని పేర్కొన్నారు. ఉన్నత విద్య కోసం బడ్జెట్‌ను రూ.47,619.77 కోట్ల నుంచి రూ.50,077.95 కోట్లకు కేవలం 5 శాతం పెరుగుదలను ఉందని, కానీ ఈ ఏడాది బడ్జెట్‌లో ఉన్నత విద్య వాటా 1 శాతం కంటే తక్కువగా ఉందన్నారు. 'ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్' పేరుతో ఆర్ఎస్ఎస్ భావజాలానికి అనుగుణంగా వేద విద్యను ప్రచారం చేసేందుకు చర్యలు తీసుకోవడాన్ని ఖండించారు. రాష్ట్రాల హక్కులను లాక్కుని విద్య కేంద్రీకరణ, కార్పొరేటీకరణ కోసం కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు.



అనంతపురంలో టవర్‌క్లాక్ వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

బడ్జెట్ ప్రతులు దహనం

మొదటిపేజీ తరువాయి

కల్పించకుండా మొండి చెయ్యి చూపారని విమర్శించారు. ఇది మధ్య తరగతి బడ్జెట్ కాదని, కార్పొరేట్ బడ్జెట్ అని మండిపడ్డారు. బాపట్లలో పాత బస్టాండ్ ఆటో స్టాండ్ వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం రూరల్ తోకతిప్పలో, యలమంచిలి మండలం చించినాడ జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. తాడేపల్లిగూడెంలో పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుంచి పోలీసు ఐల్యాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. తణుకులోని అమరవీరుల భవనం వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలంలో, గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఉండవల్లి సెంటర్, ప్రాతూరులోని బైపాస్ రోడ్డు వద్ద నిరసనలు తెలిపారు. మంగళగిరి పట్టణం, మంగళగిరి మండలంలోని నిడమర్రు, తుళ్లూరులో, ఫిరంగిపురం మండలం పొనుగుపాడు, దుగ్గిరాల, తెనాలిలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట, విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ జంక్షన్, గజపతినగరం నాలుగు రోడ్ల జంక్షన్, పార్వతీపురం, సాలూరు, కొమరాడ మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టారు. అల్లూరి జిల్లా ఎటపాక మండలం గుండాల కాలనీ వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. విఆర్.పురం మండలం రేఖపల్లి జంక్షన్‌లో నిరసన తెలిపారు.

ముస్లింల సంక్షేమానికి నిధులు

- వక్ఫ్ చట్ట సవరణ ఉపసంహరించుకోండి
- సిపిఎం రాష్ట్ర మహాసభ తీర్మానం

ప్రజాశక్తి -సీతారాం ఏచూరి నగర్ (నెల్లూరు)

ముస్లిం ప్రజల సంక్షేమ, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, హామీలు అమలు చేయాలని, వక్ఫ్ చట్టానికి కేంద్రం తల పెట్టిన సవరణలను ఉపసంహరించుకోవాలని, పాత చట్టాన్నే కొనసాగించాలని, వక్ఫ్ ఆస్తులకు రక్షణ కల్పించాలనే తీర్మానాలను ఎస్ఎ సుభాన్ (కర్నూలు) ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని రషీద్ (నెల్లూరు) బలపరిచారు. ఇటీవల ఆమోదించిన రాష్ట్ర బడ్జెట్‌లో మైనారిటీ సంక్షేమానికి కేటాయించిన నిధులు కూడా విడుదల చేయలేదని తీర్మానం పేర్కొంది. మైనారిటీల సంక్షేమం మాటల్లో తప్ప, ఆచరణలో జరుగుతున్న కృషి ఏమీలేదని తెలిపింది. మైనార్టీల సంక్షేమానికి వారి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి వారి అభివృద్ధికి ఖర్చు చేయాలని సిపిఎం రాష్ట్ర మహాసభ డిమాండ్ చేసింది. వక్ఫ్ ఆస్తులను దురాక్రమణదారులకు అప్పజెప్పడానికి తన మతతత్వ అజెండాలో భాగంగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తోందని వివరించింది. ప్రజలను మత ప్రాతిపదికన విభజించడానికి ముస్లిం ప్రజానీకాన్ని సమాజం నుంచి వేరు చేసే దురుద్దేశంతో బిజెపి ఈ సవరణలను చేయబోతోందని పేర్కొంది. బిజెపి ప్రతిపాదించిన వక్ఫ్ చట్ట సవరణలను వ్యతిరేకిస్తూ, భారత రాజ్యాంగం మైనారిటీలకు ఇచ్చిన హామీలకు భిన్నంగా ఉన్న ఈ సవరణలను తక్షణం ఉపసంహరించాలని సిపిఎం రాష్ట్ర మహాసభ డిమాండ్ చేసింది.

పొదుపుసంఘాలకు సక్రమంగా రుణాలు

పొదుపు సంఘాలకు సక్రమంగా రుణాలివ్వాలని, మహిళలకు ఉపాధి చూపాలని, మైక్రో ఫైనాన్స్, రుణీ యాప్‌ల నుండి రక్షణ కల్పించాలనే తీర్మానాన్ని బి.ప్రభావతి ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని అలివేలమ్మ (కర్నూలు) బలపరిచారు.

నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించాలి

నిత్యావసర సరుకుల ధరలు నియంత్రించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించాలనే తీర్మానాన్ని పూర్ణ (పశ్చిమగోదావరి) ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని వి.ఇందిర (పార్వతీపురం మన్యం) బలపరిచారు. రాష్ట్రంలో రేషన్ డిపోల్లో ఇచ్చే సరుకుల్లో ప్రభుత్వాలు క్రమంగా కోతపెట్టారని, నగదు బదిలీకి రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, కందిపప్పు, పంచదార సరఫరా అరకొరగానే ఉంది.

పామాయిల్ సరఫరా నిలిపివేశారని తీర్మానంలో వివరించారు. కోవిడ్ సమయంలో ప్రతి మనిషికీ అదనంగా ఇచ్చిన ఐదు కిలోల బియ్యం సరఫరా ఇప్పుడు నిలిపివేశారని సన్న బియ్యం ఇస్తామని వైసిపి ఊరించి మోసగించిందని, రేషన్ బియ్యం అక్రమ రవాణాతో నాడు, నేడు వేల కోట్ల రూపాయలు పాలక పార్టీల నేతలు, అధికారులు దోచుకుంటున్నారని పేర్కొంది. అధిక ధరలు తగ్గించాలని, ప్రజా పంపిణీతో నిత్యావసర సరుకులు అందించాలని రాష్ట్ర మహాసభ డిమాండ్ చేసింది.

పోలవరం పూర్తి బాధ్యత కేంద్రానిదే



మొదటిపేజీ తరువాయి

ప్రవేశపెట్టారు. దీన్ని వి.కృష్ణయ్య బలపరిచారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల 356 గ్రామాల్లో 1,05,601 కుటుంబాలు పూర్తిగా నిర్వాసితమవుతాయని పేర్కొంది. దీనికి కేంద్ర ప్రభుత్వానిది ప్రధాన బాధ్యతని, కానీ బాధ్యతారాహిత్యంగా నిర్వాసితుల సమస్య తమకు సంబంధం లేదన్నట్లు ప్రకటించిందని తీర్మానంలో పేర్కొంది. ఎన్నికల ముందు హామీలు గుప్పించి అధికారంలోకొచ్చిన తరువాత ప్రభుత్వాలు నిర్వాసితులపై మాట మాట్లాడటం లేదని, ఎన్నికల హామీలు నిలబెట్టుకునే నిజాయితీ ఆయా పార్టీలకు లేదని పేర్కొంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం నిర్వాసితులపై మాట్లాడటం లేదని విమర్శించింది. నిర్మాణ బాధ్యత తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతను విస్మరించి నిర్వాసితుల పునరావాసం, పరిహారం గురించి ప్రస్తావనే లేదని పేర్కొంది.

2026 నాటికి 41.15 కాంటూరు పరిధిలోని కుటుంబాలకు పునరావాసం, పరిహారం పూర్తిచేస్తామని తాజా ప్రభుత్వం ప్రకటన చేసిందని, 45.72 కాంటూరు పరిధిలోని కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం సహాయం ఆధారంగా రెండోదశగా చేయగలమని చెబుతోందని పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి వల్ల ఏటేటా ముంపు మండలాలు గోదావరి వరదల్లో వారాల తరబడి మునిగి ఉంటున్నాయని, వేలాది మంది నిర్వాసితులు కొండలు, అడవుల్లో తలదాచుకోవాల్సిన దయనీయ స్థితులు ఏర్పడుతున్నాయని తెలిపింది. దీనిలో కేంద్ర ప్రభుత్వ వైఖరి అన్యాయంగా ఉందని, నిర్వాసితులకు 33 వేల కోట్లు కేటాయించాల్సినప్పటికీ, పదిశాతం కూడా కేటాయించలేదని, లక్షకుపైగా కుటుంబాలకు పునరావాసం, పరిహారం అమలు చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం 12 శాతం కుటుంబాలకు మాత్రమే అసమగ్రంగా అమలు జరిపాయని, 2013 భూసేకరణ చట్టం సమగ్రంగా అమలు జరపాలని తీర్మానం కోరింది. దశలవారీగా కాకుండా ఎనిమిది మండలాల్లో నిర్వాసిత కుటుంబాలన్నిటికీ ఈ సంవత్సరంలోనే సమగ్ర పునరావాసం, పూర్తిస్థాయి పరిహారం చెల్లించాలని, పునరావాసం ప్యాకేజీ పదిలక్షలు ఇవ్వాలని కోరింది. శాస్త్రీయ పద్ధతుల్లో కాంటూరు సర్వే చేసి ముంపు ప్రాంతాలను ఖచ్చితంగా గుర్తించాలని, సమగ్ర పునరావాసం కల్పించాలని, పునరావాస కాలనీల్లో తగిన వసతులు కల్పించాలని, నాణ్యతతో ఇళ్లు, రహదారులు నిర్మించాలని తీర్మానించింది. భూమికి భూమి తగిన గ్రామానికి సమీపంలో సారవంతమైన విలువైన భూమి ఇవ్వాలని, సాగుభూములకు నష్టపరిహారం ఎకరాకు రూ.20 లక్షలివ్వాలని మహాసభ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ తీర్మానించింది.

విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి

మొదటిపేజీ తరువాయి

ఆదేశాల మేరకు వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడానికి గత వైసిపి ప్రభుత్వం పూనుకుంది. రైతులు పెద్దఎత్తున ప్రతిఘటించారు. మీటర్లు పెడితే పగలగొట్టాలని పిలుపునిచ్చిన కూటమి నేతలే మీటర్ల ఒప్పందాలను రద్దు చేయకుండా వేగంగా బిగిస్తున్నారు. ఈ స్మార్ట్ మీటర్లు పెట్టి క్రమంగా విద్యుత్ పంపిణీని ప్రైవేటీకరించడానికి ప్రభుత్వాలు కుట్ర పన్నాయి." అని పేర్కొంది. "గ్రీన్ ఎనర్జీ పేరుతో బడా సంస్థలకు భూములు కారుచౌకగా కట్టబెడుతున్నారు.

రాయితీలు ప్రకటిస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో సైతం రాజ్యాంగ విరుద్ధంగా చట్టాలను ఉల్లంఘించి పంప్డ్ హైడ్రో ప్రాజెక్టుల పేరిట అదానీ సంస్థలకు వేల ఎకరాల భూమిని కట్టబెడుతున్నారు." అని విమర్శించింది.

డబ్ల్యుటిఓలో తేల్చుకుంటాం

- ట్రంప్ టారిఫ్‌లపై చైనా
- హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడి



మావో నింగ్

బీజింగ్ : చైనా నుండి దిగుమతయ్యే వస్తువులపై 10శాతం అదనపు సుంకాలు విధిస్తూ ట్రంప్ తీసుకున్న చర్యలను చైనా తీవ్రంగా ఖండించింది. తమ చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలు పరిరక్షించుకునేందుకు అవసరమైన చర్యలన్నీ తీసుకుంటామని స్పష్టం చేసింది. ట్రంప్ చర్యలను చైనా విదేశాంగ, వాణిజ్య శాఖలు తీవ్రంగా వ్యతిరేకించాయి. "చైనా వైఖరి చాలా దృఢంగా, స్థిరంగా వుంది. వాణిజ్యం, టారిఫ్‌ల యుద్ధంలో విజేత అంటూ ఎవరూ వుండరు." అని విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ వ్యాఖ్యానించారు. అమెరికా ఏకపక్షంగా తీసుకున్న ఈ టారిఫ్‌ల చర్యలు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘిస్తున్నాయని అన్నారు. ఈ చర్యలతో దేశీయంగా అమెరికా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావని అన్నారు. పైగా, ఈ చర్యల వల్ల ఉభయ పక్షాలకూ ఎలాంటి ప్రయోజనం ఒనగూడదని స్పష్టం చేశారు. ప్రపంచ ప్రయోజనాలు అసలే నెరవేరవని అన్నారు. ఫెంటనిల్ అనేది అమెరికా సమస్య అని వ్యాఖ్యానించారు. మాదకద్రవ్యాల నిరోధానికి అమెరికాతో సహకరిస్తున్నామని, గణనీయమైన ఫలితాలు కూడా వచ్చాయని చెప్పారు. ఈ మేరకు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. చైనాపై అమెరికా తీసుకున్న చర్యలతో తాము తీవ్ర అసంతృప్తికి గురయ్యామని చైనా వాణిజ్య శాఖ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ చర్యలను ఖండిస్తున్నామని తెలిపింది. అమెరికా తీసుకున్న తప్పుడు చర్యలకు ప్రతిస్పందనగా డబ్ల్యుటిఓలో చైనా ఫిర్యాదు చేస్తుందని, చైనా ప్రయోజనాలు, హక్కులను పరిరక్షించేందుకు అవసరమైన ప్రతీకార చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ మేరకు వాణిజ్య శాఖ కూడా ఆదివారం ఒక ప్రకటన జారీ చేసింది. ఇతర దేశాలపై టారిఫ్‌లను విధిస్తామని తరచుగా బెదిరించడం కన్నా ఫెంటనిల్, అందుకు సంబంధించిన అంశాలను హేతుబద్ధంగా, నిష్పక్షపాతంగా చూసి, పరిష్కరించాల్సి వుందని అమెరికాను చైనా కోరింది. ఘర్షణలను మరింత పెంచకుండా నివారించడానికి అమెరికాతో చర్చలకు తలుపులు తెరిచే వున్నాయని పేర్కొంది. ఎలాంటి అరమరికలు లేని రీతిలో చర్చలు జరిపి, సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని కోరింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68